

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 25-5-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 39 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ.3.52 తదుపరి చతుర్దశి, నక్షత్రం: అశ్విని ఉ.11.12 తదుపరి భరణి, వర్జ్యం: ఉ.7.38-9.08, రా.7.40-9.05, దుర్ముహూర్తం: సా.4.56-5.48, అమృతఘడియలు: తె.4.09-5.34, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.39 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సముచిత ప్రాధాన్యమిస్తే సరే..

కాదంటే కొత్త పార్టీ

తండ్రి కేసీఆర్‌తో తేల్చుకోవాలనుకుంటున్న ఎమ్మెల్సీ కవిత



ఆయన పిలుపు కోసం ఎదురుచూపు.. లేఖ లీకేజీపై ఆగ్రహంగా కేసీఆర్ తనయ

లీకువీరులెవరో తేలే వరకు పార్టీకి దూరం.. పార్టీ పెడితే తెలంగాణ జాగృతే?

రోజంతా ఇంటికే పరిమితం.. భర్త తరఫు కుటుంబం, సన్నిహితులతో మంతనాలు

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితిలో తగిన ప్రాధాన్యం దక్కకుంటే తన దారి తాను చూసుకోవాలనే యోచనలో కేసీఆర్ తనయ కవిత ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై అధిష్ఠానం స్పందన కోసం ఆమె ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ నుంచి పిలుపు వస్తే అన్ని విషయాలు కూలంకుషంగా చర్చించాలనుకుంటున్నారు. ప్రధానంగా రెండు అంశాలపై ఆమె పట్టుబడుతున్నట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. పార్టీలో తిరిగి తనకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. అలాగే, కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ, తాను ప్రస్తావించిన దయ్యాల సంగతి కూడా తేల్చాల్సిందేనని గట్టిగా పట్టుబడుతున్నారు. పార్టీ అధినేత సానుకూలంగా స్పందించకుంటే కఠినమైన నిర్ణయం తీసుకునే యోచనలో కవిత ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అవసరమైతే బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేందుకు కూడా ఆమె సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేసే అవకాశం లేకపోలేదని అంటున్నాయి. రెండు వారాల కిందటే కవిత కీలక నిర్ణయం తీసుకుంటుందని భావించారు. ఎందుకో కార్యరూపం దాల్చలేదు. తాను రాసిన లేఖపై కేసీఆర్ స్పందిస్తారని, తాను ప్రస్తావించిన

మిగతా 14వ పేజీలో...



14

మా పార్టీలో రేవంత్ కోవర్టులుండొచ్చు

ఒక్కోసారి వాళ్లంతట వాళ్లే బయటపడ్డారు

లేఖ రాయడం పెద్ద విషయమేమీ కాదు

పార్టీలో అంతర్గతంగానే మాట్లాడాలి

ఎంత పెద్ద నేతలైనా ఇదే సూత్రం: కేటీఆర్

ఫామ్‌హౌస్‌కి ఎవర్నీ రానివ్వని కేసీఆర్?

దయ్యం నువ్వేనా కేటీఆర్?

14

నిలదీసిన మంత్రి సీతక్క.. మోదీ ప్రశంసల కోసమే రాహుల్‌పై విమర్శలంటూ విమర్శ

కవిత లేఖతో కేటీఆర్‌కు మతి భ్రమించినట్లుంది.. పంపకాల్లో తేడాతోనే ఈ తిరుగుబాటు: మహేశ్‌గౌడ్

ఆ దయ్యాలెవరో కేటీఆరే చెప్పాలి: మంత్రి పొన్నం.. దయ్యాల స్కాంలు బయటపెట్టండి: చామల

ఆస్తుల్ని కాపాడుకునే యత్నం: మధుసూదన్‌రెడ్డి.. కవిత చెప్పిన దయ్యాలు ఆ ముగ్గురే: రామ్మోహన్‌రెడ్డి

అన్నాచెల్లెళ్ల వార్!

తండ్రులు అధికారంలో ఉన్నప్పుడు అన్నల చేతికి రాఖీలు కట్టి తమ మధ్య ఉన్న రక్త సంబంధాన్ని చాటి చెప్పినవాళ్లే ఇప్పుడు ఆ అన్నల ద్రోహాన్ని బయటపెడుతున్నారు. ఏపీలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆస్తుల పంపకంలో తనకు అన్యాయం చేస్తున్నారనీ, కోరుకున్న రాజ్యసభ సీటు కూడా ఇవ్వకుండా నిరాదరణకు గురిచేశారంటూ షర్మిల తిరుగుబాటు చేయడం చూశాం.


కొత్త పలుకు!

ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ కుటుంబంలో కూడా అంతఃపుర కలహాలు వీధికెక్కాయి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ వ్యవహారాల్లో అన్న కేటీఆర్‌కు ఇచ్చిన ప్రాధాన్యం తనకు ఇవ్వడంలేదన్న అసంతృప్తి చెల్లి కవితలో ఎప్పటి నుంచో ఉంది.

దీంతో అన్నపై పైచేయి సాధించడం ఎలా? అని కవిత అంతర్మథనం చెందారు. బీఆర్ఎస్‌లో కీలక నాయకుడిగా ఉన్న హరీశ్‌రావును తనతో చేయి కలపవలసిందిగా కవిత ఒక సందర్భంలో కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని అప్పట్లోనే హరీశ్‌రావు సున్నితంగా తిరస్కరించారు. మేనమామ కేసీఆర్‌ను ధిక్కరించే సాహసాన్ని హరీశ్ చేయలేరు అని పలు సందర్భాలలో రుజువైంది.

తన తండ్రి దేవుడు అని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. కవిత చెబుతున్న ఆ దెయ్యాలు ఎవరో ఇప్పుడు తేలాల్సి ఉంది. అధికారం మహా చెడ్డది. అయినవాళ్ల మధ్య కూడా దూరం పెంచుతుంది.

కేసీఆర్ ఆగ్రహానికి గురైతే కవిత పరిస్థితి ఏమిటి? కార్యకర్తల మద్దతు గానీ, ప్రజల మద్దతు గానీ ఆమెకు లభించే పరిస్థితులు కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో షర్మిల ఒక విఫల ప్రయోగంగా నిలిచారు.

4

షర్మిలతో పోలిస్తే కవితది భిన్నమైన నేపథ్యం. తెలంగాణ ఉద్యమంలో కవిత చురుగ్గా పాల్గొన్నారు. కింది స్థాయి కార్యకర్తలతో కూడా ఆమెకు పరిచయాలు ఉన్నాయి. వైఎస్ రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందినందున జగన్-షర్మిల మధ్య ఏర్పడిన వివాదాల పరిష్కారానికి ఆ కుటుంబంలో పెద్ద దిక్కు లేకుండా పోయింది. తల్లి విజయలక్ష్మి కుమారుడు, కుమార్తె మధ్య నలిగిపోవడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కేసీఆర్ కుటుంబంలో ఈ పరిస్థితి లేదు. ఇటు పార్టీని, అటు కుటుంబాన్ని కంటి సైగతో శాసించగల కేసీఆర్ ఉన్నారు. ఆయన గీసిన గీత కవిత దాటుతారా? లేదా? అన్నదే ఇప్పుడు ప్రశ్న.

కేసీఆర్‌ను ధిక్కరించి రాజకీయంగా నిలదొక్కుకోవడం దాదాపు అసాధ్యం అన్న విషయం తెలుసుకోలేనంత అమాయకురాలు కాదు కవిత. పార్టీలో తన స్థానం ఏమిటో స్పష్టం చేయాలని ఆమె తండ్రి వద్ద మారాం చేయవచ్చు. తాజా పరిణామాలతో కేసీఆర్ కుటుంబం కూడా రాజశేఖర రెడ్డి కుటుంబం వలె బజారున పడింది. అర్ధాంతరంగా చనిపోవడం వల్ల తన కుటుంబ కలహాలు చూసి బాధపడే దౌర్భాగ్యం రాజశేఖర రెడ్డికి తప్పింది. కేసీఆర్ విషయంలో ఆయన కళ్ల ముందే కుటుంబ కలహాలు వీధిన పడ్డాయి.

అందాల పోటీల్లో వేశ్యలా..

నన్ను అలాగే చూసినట్టు అనిపించింది.. పురుష స్పాన్సర్లతో కలిసి ఉండాలన్నారు

24 గంటల పాటు మేకప్‌లో ఉండాలని, బాల్ గౌన్లు ధరించాలని ఒత్తిడి చేశారు

మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ఆరోపణలు.. పోటీ నుంచి తప్పుకొన్నట్లు ప్రకటన

ఆరోపణలు నిరాధారం.. తల్లికి బాగోలేదని చెప్పి వెళ్లిపోయారు: జూలియా మోర్లే

చేనేత వస్త్రాల్లో.. మరింత అందంగా.. అందాల భామల ర్యాంప్ వాక్

11

ఘనంగా మిస్ వరల్డ్ ఫ్యాషన్ ఫినాలే.. ఆసియా-ఓషియానా విజేతగా నందిని


మిల్లా మాగీ

కనీస మర్యాద లేని తెలుగు చిత్ర పరిశ్రమ!

'రిటర్న్ గిఫ్ట్' ఇచ్చినందుకు పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు

ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవు

6

సినిమా సంఘాల ప్రతినిధులు రావాల్సిందే

థియేటర్ల బంద్‌పై ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం

థియేటర్ల బంద్ లేదు.. సమస్యల పరిష్కారానికి కమిటీ



ముందే 'రుతు'రాగం

కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

13

16 ఏళ్ల తర్వాత 8 రోజులు ముందుగా..

ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు దాకా విస్తరణ

రెండు, మూడు రోజుల్లో ఏపీ, తెలంగాణకు

ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

వచ్చే 5 రోజులూ వర్షాలే: వాతావరణ కేంద్రం

స్వదేశాలకు పంపే సొమ్ముపై..

పన్ను 3.5%

రెమిటెన్స్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను స్వల్పంగా తగ్గించిన ట్రంప్ సర్కారు

తొలుత ప్రతిపాదించినది 5 శాతం

ఎన్నారైలకు ఊరటనిచ్చిన నిర్ణయం

అమెరికాలో ఫోన్లు తయారు చేయకుంటే దిగుమతి సుంకం

12

సామ్‌సంగ్ కంపెనీకి ట్రంప్ హెచ్చరిక

పాలీసెట్ ఫలితాలు విడుదల

ఎంపీసీ విభాగంలో 82 శాతం

14

ఎంబైపీసీ విభాగంలో 84 శాతం ఉత్తీర్ణత

100 శాతం మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన నలుగురు విద్యార్థులు

టీమిండియా టెస్ట్ కొత్త కెప్టెన్ గిల్

ఎంపిక చేసిన బీసీసీఐ.. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు జట్టు ప్రకటన

5

నిషేధిత భూములకూ ప్రత్యేక పోర్టల్

ఎక్కడ రిజిస్ట్రేషన్ చేసినా సమాచారం

ఫిర్యాదులొస్తే.. అధికారులపై చర్యలు

గ్రామ పాలనాధికారుల పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

15

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి

కలిసి పని చేద్దాం

పెట్టుబడులకు పెద్దపీట వేయండి

12

వ్యవసాయం, విద్య, ప్రజారోగ్యం అత్యంత కీలక ప్రాధాన్యతాంశాలు

వికసిత భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

అన్ని రాష్ట్రాల అభివృద్ధితోనే ఇది సాధ్యం

నీతి ఆయోగ్ భేటీలో మోదీ పిలుపు

బిహార్ సీఎం సహా పలువురు గైర్హాజరు

మెట్రో2కు అనుమతివ్వండి

ఆర్ఆర్ఆర్‌కు ఆమోదం తెలపండి

బందరు పోర్టు-హైదరాబాద్ డ్రైపోర్టుకు గ్రీన్ ఫీల్డ్ హైవేను మంజూరు చేయండి

యూపీ, తమిళనాడు, ఏపీ మాదిరిగా.. తెలంగాణను ప్రోత్సహించండి

15

ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

వికసిత్ భారత్ బాటలో..

ఆ లక్ష్యంతోనే 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ రూపకల్పన

'నేషన్ ఫస్ట్ - పీపుల్ ఫస్ట్' ప్రాధాన్యతతో ముందుకెళ్తున్నాం

ఈ దేశం రాష్ట్రాల సమాఖ్య.. తెలంగాణకు సహకరించండి

దేశవ్యాప్త కులగణనకు కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఎస్సీ వర్గీకరణ జరిపాం.. బీసీ రిజర్వేషన్లు 42% పెంచాం

60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, లక్ష ప్రైవేటు ఉద్యోగాలిచ్చాం

మాదక ద్రవ్యాల నిర్మూలనలో నంబర్ వన్‌గా తెలంగాణ

రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజిస్తూ మాస్టర్ ప్లాన్

ఆపరేషన్ సిందూర్‌పై మోదీకి, సైన్యానికి అభినందనలు

ఇందిరాగాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలుగా చీల్చారు

నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, మే 24 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్ రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో.. ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలుంటాయని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను సూపర్ పవర్‌గా, నెంబర్ వన్‌గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పాన్ని ఆయన స్వాగతించారు. 'వికసిత భారత్' ప్రణాళికను రూపొందించడం అభినందనీయమని కొనియాడారు. అదే స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని వివరించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ మొదటి వరుసలో ఉంటుందని మాట ఇచ్చారు. భారత దేశం రాష్ట్రాల సమాఖ్య అని, తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర సహకారం, మద్దతు లేకుండా తెలంగాణ రైజింగ్ విజన్ అమలు చేయలేమని స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన నీతి ఆయోగ్

మిగతా 15వ పేజీలో...

26న బీసీ సాధికారతపై ఏఐసీసీ సదస్సు

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన న్యూఢిల్లీలో బీసీ సాధికారతపై సదస్సు జరుగనుంది. దీనికి హాజరు కావాలని రాష్ట్రంలోని బీసీ ఎమ్మెల్యేలు, బీసీ కార్పొరేషన్ల చైర్మన్లకు ఏఐసీసీ ఆహ్వానం పలికింది. ఈ సదస్సుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో పాటు పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు.

తాండూరులో భారీగా అక్రమ రిజిస్ట్రేషన్లు!

- అక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాలుగు రోజుల్లోనే 224 రిజిస్ట్రేషన్లు
- సాధారణ రోజుల్లో 10 నుంచి 15లోపే
- స్కానింగ్ పెండింగ్‌తో బయటపడ్డ వైనం
- ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ పనే.. ఆయనపై వేటు
- సమగ్ర విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం


తాండూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

వికారాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల పరంగా పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనధికార లే ఔట్లలోని ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారనే అభియోగాలు ఎదుర్కొంటున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు అక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం'పై సమగ్ర విచారణకు ఆదేశించారు. దీనికి సంబంధించిన నివేదిక రాగానే మరికొందరిపై వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాండూరులో సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సాయికుమార్ గతనెల 22 నుంచి ఈ నెల 17వ తేదీ వరకు సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పనిచేస్తున్న పవన్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అక్కడ 20 రోజుల పాటు పనిచేశాక పవన్‌కుమార్ తన సోదరుడి వివాహం కోసం ఈనెల 12 నుంచి 23వ తేదీ వరకు సెలవు పెట్టారు. దీంతో చంపాపేట్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఫసియుద్దీన్‌కు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు తాండూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన అక్కడ ఆరు రోజుల పాటు 'బాధ్యతలు' నిర్వహించి నాలుగురోజుల్లోనే ఏకంగా 224 రిజిస్ట్రేషన్లు చేశారు. సాధారణంగా తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 10 నుంచి 15 లోపే రిజిస్ట్రేషన్లు జరిగేవి. దీంట్లో అయిదు వరకు తనఖాకు సంబంధించినవే ఉండేవి. సాధారణంగానైతే ఏ రోజు రిజిస్ట్రేషన్ జరిగితే అదేరోజు డాక్యుమెంట్ల స్కానింగ్ ప్రక్రియ కూడా పూర్తి చేయాలి. ఫసియుద్దీన్ బాధ్యతలు నిర్వహించిన ఆరు రోజుల్లో స్కానింగ్ ప్రక్రియ కొనసాగలేదు. పెద్దఎత్తున డాక్యుమెంట్ల స్కానింగ్ పెండింగ్‌లో ఉండటంతో భారీ ఎత్తున రిజిస్ట్రేషన్ల ఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా ఎల్ఆర్ఎస్ పూర్తయ్యాక ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రం తీసుకుని వీటిని రిజిస్ట్రేషన్ సమయంలో జత చేస్తారు. కానీ తాండూరు కార్యాలయంలో డబ్బు కట్టినట్లు కొన్ని రసీదులు జతపరిచినట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై వాస్తవాలు వెలికి తీసేందుకు లోతుగా విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఫసియుద్దీన్ బాధ్యతలు నిర్వహించిన ఆరు రోజుల్లో రాత్రి పదింటి దాకా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు తమ విచారణలో గుర్తించడం గమనార్హం. ఈ మేరకు అనధికార లే ఔట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆయన పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో డాక్యుమెంట్ రైటర్లు కొందరు కీలకపాత్ర వ్యవహరించినట్లు ఉన్నతాధికారుల దృష్టికొచ్చింది. కాగా రిజిస్ట్రేషన్లపై ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా ఆయనపై చర్యలు తీసుకున్నారు. ఫసియుద్దీన్ హయాంలో జరిగిన రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపించేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాన్ని నియమించారు.


పుష్కరఘాట్ వద్ద భక్తుల సందడి

సరస్వతి.. భక్తజన నీరాజనం

ఒక్కరోజే 2 లక్షలకు పైగా భక్తుల పుణ్యస్నానాలు

2 రోజులే ఉండటంతో పెరిగిన రద్దీ

తగినన్ని బస్సులు లేక పడిగాపులు..

నేడు కాళేశ్వరానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

భూపాలపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల్లో భాగంగా కాళేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పుష్కర ఘాట్లు కిటకిటలాడాయి. పుష్కరాలు మరో రెండురోజులు మాత్రమే ఉండటంతో శనివారం దాదాపు 2 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల సంఖ్య పెరగడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల రద్దీ బాగా పెరిగిపోయింది. కాగా హన్మకొండ, వరంగల్ నుంచి బస్సులను నాన్‌స్టాప్‌గా నడపడంతో భూపాలపల్లి, పరకాల ప్రాంతాలకు చెందిన భక్తులు కాళేశ్వరం చేరుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు సరిపోయినన్ని లేకపోవటంతో పుష్కర స్నానాల కోసం వస్తున్న భక్తులు స్వస్థలాలకు తిరిగి వెళ్లటానికి గంటల కొద్ది వేచి చూసే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి వన్‌వేగా మార్చడంతో రాకపోకలు సజావుగానే జరుగుతున్నాయి. శనివారం పుణ్యస్నానాలు చేసిన భక్తులు కాళేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు ఒక్కసారిగా రావటంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. అధికారులు అప్రమత్తమై దర్శనాలను వేగవంతం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. భక్తుల సంఖ్యకు తగినట్లుగా తీర్థప్రసాదాలను సమకూర్చడంలో దేవాదాయశాఖ విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకల్లా లడ్డు, పులిహోర, ప్రసాదాలు అయిపోవటంతో పలువురు భక్తులు తీర్థప్రసాదాలు తీసుకోకుండానే తీవ్ర అసంతృప్తితో వెనుదిరిగి వెళ్తున్నారు. మూడు రోజులుగా వర్షం కురియడంతో పార్కింగ్ స్థలాలన్నీ నీటమునిగాయి. పుష్కరఘాట్లు, టెంట్ సిటీ పరిసరాలు బురదమయంగా మారాయి. కాగా, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కాళేశ్వరాన్ని ఆదివారం సందర్శించనున్నారు.

మృతదేహాల కోసం ఛత్తీస్‌గఢ్ పోలీసులను అడగండి

- మావోయిస్టుల కుటుంబ సభ్యులకు ఏపీ హైకోర్టు సూచన

అమరావతి, మే 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు మృతదేహాలను అప్పగించాలని ఛత్తీస్‌గఢ్ పోలీసులను కోరాలని వారి కుటుంబ సభ్యులకు ఏపీ హైకోర్టు ధర్మాసనం సూచించింది. ఛత్తీస్‌గఢ్ పోలీసులను ఆశ్రయించే వ్యవహారాన్ని పిటిషనర్లకే వదిలేసింది. వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు ధర్మాసనం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. తమ వారి మృతదేహాలను అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కేశవరావు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు శుక్రవారం అత్యవసరంగా హైకోర్టులో హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై శనివారం ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. మృతదేహాలను అప్పగించాలని ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లా పరిధి ఐజీని పిటిషనర్లు సంప్రదిస్తే.. అక్కడి పోలీసులు బెదిరించి పంపించి వేశారని చెప్పారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకే పోలీసులు మృతదేహాలను అప్పగించడం లేదన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఎన్‌కౌంటర్ మృతుల పోస్టుమార్టం ముగిసిందా? అని ప్రశ్నించింది. ఛత్తీస్‌గఢ్ అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ప్రఫుల్ భరత్ స్పందిస్తూ.. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 27 మంది చనిపోగా, కేశవరావు, నాగేశ్వరరావులతో పాటు 21మందికి పోస్టుమార్టం ముగిసిందని, మరో ఆరుగురికి శనివారం సాయంత్రంలోగా పూర్తిచేస్తామని చెప్పారు. ఆ తరువాత కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించడమే మిగిలి ఉంటుందన్నారు. రాష్ట్ర ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఛత్తీస్‌గఢ్ హైకోర్టును ఆశ్రయించి ఉండాల్సిందన్నారు. కేంద్ర హోంశాఖ తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ) పసల పొన్నారావు వాదనలు వినిపిస్తూ.. అంతిమ సంస్కారాల సందర్భంగా ర్యాలీలు నిర్వహిస్తే లా అండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందనే కారణంతో మృతదేహాలను అప్పగించడానికి నిరాకరించి ఉండొచ్చని తెలిపారు. అందరి వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఛత్తీస్‌గఢ్ ఏజీ వాదనలు గుర్తుచేస్తూ.. మృతదేహాల అప్పగింతపై ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులను ఆశ్రయించే వ్యవహారాన్ని పిటిషనర్లకే వదిలేసింది.

సత్తాచాటిన కందనెల్లి బాలుడు

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షలో నాలుగో ర్యాంక్

అభినందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

పెద్దేముల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో వికారాబాద్ జిల్లా కందనెల్లి గ్రామానికి చెందిన హనీశ్ రెడ్డి రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించాడు. కందనెల్లికి చెందిన తోపోజి రాంరెడ్డి, రాధిక దంపతుల కుమారుడు హనీశ్ రెడ్డి.. హైదరాబాద్‌లోని రేయాన్స్ సైనిక్ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన ఆలిండియా సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షలో నాలుగో ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా అతడిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో అభినందించారు. హనీశ్ ఇలాంటి విజయాలు ఎన్నో సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు.


హనీశ్‌రెడ్డిని అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా పాటించబోతున్నట్టు జగన్‌రెడ్డి ప్రకటించారు. గత ఏడాది జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ప్రజలు ఆయనను 11 సీట్లకే పరిమితం చేస్తూ తీర్పు ఇచ్చారు. ఫలితాలు వెల్లడైన రోజునే ఆయన ఎంచుకున్నారంటే ప్రజలు తనకు వెన్నుపోటు పొడిచారని జగన్ భావిస్తున్నారేమో తెలియదు! బటన్లు నొక్కి డబ్బులు పంచినా ప్రజలు తనను ఓడించడం అంటే వెన్నుపోటు పొడవడమేనని ఆయన అనుకుంటున్నట్టుగా ఉంది. ప్రజలు ఆయనకు వెన్నుపోటు పొడిచారా? ఆయనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారా? అన్నది సుస్పష్టం. రాజశేఖరరెడ్డి వేరు.. జగన్మోహన్‌రెడ్డి వేరు అని ప్రజలు గ్రహించారు కనుకనే ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. జగన్‌రెడ్డి నిర్వహించాల్సింది వెన్నుపోటు దినాలు కాదు. ప్రాయశ్చిత్త దినాలు జరుపుకోవాలి.

అన్నాచెల్లెళ్ల వార్!

అనగనగా రాజకీయాల్లో ఇద్దరు అన్నలు.. వారికి చెరో చెల్లి ఉన్నారు. ఆ ఇద్దరు అన్నల తండ్రులు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. షరా మామూలే.. తండ్రుల అధికారాన్ని అడ్డు పెట్టుకొని సంపదను పోగేసుకున్నారు. సహజంగానే సంపద కోసం అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. రక్తం పంచుకు పుట్టిన వాళ్లు బద్ధశత్రువులయ్యారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. తెలుగునాట వర్తమాన రాజకీయాలలో ఇదొక రసవత్తర ఘట్టం. ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో చెలరేగిన కలహాలను ఇప్పటిదాకా చూశాం.. చూస్తున్నాం. తెలంగాణ రాజకీయాలలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంలో అదే సీన్ రిపీట్ కాబోతున్నది. తండ్రుల వల్ల సంక్రమించిన అధికారం, సంపదలో కుమార్తెలకు వాటా దక్కకపోవడం ఆ చెల్లెళ్ల ఆగ్రహానికి కారణమైంది. ఎన్టీఆర్ హయాంలో ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తండ్రులు అధికారంలో ఉన్నప్పుడు అన్నల చేతికి రాఖీలు కట్టి తమ మధ్య ఉన్న రక్త సంబంధాన్ని చాటి చెప్పినవాళ్లే ఇప్పుడు ఆ అన్నల ద్రోహాన్ని బయటపెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆస్తుల పంపకంలో తనకు అన్యాయం చేస్తున్నారనీ, కోరుకున్న రాజ్యసభ సీటు కూడా ఇవ్వకుండా నిరాదరణకు గురిచేశారంటూ షర్మిల తిరుగుబాటు చేయడం చూశాం. ఈ ఆస్తుల గొడవలో తల్లి విజయలక్ష్మి కుమార్తె షర్మిలకు అండగా నిలవడం, వివాదాలు న్యాయస్థానాలకు చేరడం చూశాం. ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ కుటుంబంలో కూడా అంతఃపుర కలహాలు వీధికెక్కాయి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ వ్యవహారాల్లో అన్న కేటీఆర్‌కు ఇచ్చిన ప్రాధాన్యం తనకు ఇవ్వడంలేదన్న అసంతృప్తి చెల్లి కవితలో ఎప్పటి నుంచో ఉంది. పుండు మీద కారం రాసినట్టుగా కేటీఆర్‌కు తోడు, అప్పటి ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు పార్టీలో ప్రాధాన్యం పెరిగిపోవడాన్ని కవిత జీర్ణించుకోలేక పోయారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఒక దశలో కేసీఆర్ తలపోశారు. రేపో మాపో తాను ముఖ్యమంత్రిని కాబోతున్నానని కేటీఆర్ కూడా చెప్పుకొన్నారు. దీంతో అన్నపై పైచేయి సాధించడం ఎలా? అని కవిత అంతర్మథనం చెందారు. భారత రాష్ట్ర సమితిలో కీలక నాయకుడిగా ఉన్న హరీశ్‌రావును తనతో చేయి కలపవలసిందిగా కవిత ఒక సందర్భంలో కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని అప్పట్లోనే హరీశ్‌రావు సున్నితంగా తిరస్కరించారు. మేనమామ కేసీఆర్‌ను ధిక్కరించే సాహసాన్ని హరీశ్‌రావు చేయలేరు అని పలు సందర్భాలలో రుజువైంది. తాజాగా పార్టీలో తన ప్రాధాన్యం తగ్గిపోయి కేటీఆర్ అంతా తానై వ్యవహరించడం హరీశ్‌రావుకు రుచించలేదు. 'కిం కర్తవ్యం' ఏమిటా అని ఆయన కొన్ని రోజులుగా మథనపడుతున్నారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకత్వం నుంచి హరీశ్‌రావుకు ఆఫర్లు వచ్చాయి. అయినా ఆయన తొందరపడకుండా మౌనాన్ని ఆశ్రయించారు. కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా హరీశ్‌రావుకు లభించని పరిస్థితి. దీంతో ఆయన బీఆర్ఎస్‌ను వీడతారని, బీజేపీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరిగింది. ఫలితంగా కేటీఆర్ ఒక మెట్టు దిగి హరీశ్‌రావు ఇంటికి వెళ్లి రాజీ కుదుర్చుకున్నారు. బావ–బావమరుదుల మధ్య తాత్కాలికంగా సఖ్యత కుదిరింది. ఎర్రవల్లి ఫాంహౌజ్ గేట్లు కూడా హరీశ్‌రావుకు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో తండ్రి కేసీఆర్‌కు తనయ కవిత రాసిన లేఖ లీకై కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం రాత్రి అమెరికా నుంచి తిరిగి వచ్చిన కవిత ఆ లేఖ తానే రాశానని ధ్రువీకరించారు. తాను రాసిన లేఖ లీకైందంటే పార్టీలో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చునని అన్నారు. తన తండ్రి దేవుడు అని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. కవిత చెబుతున్న ఆ దెయ్యాలు ఎవరో ఇప్పుడు తేలాల్సి ఉంది. కేసీఆర్‌ను అంటిపెట్టుకొని ఉంటున్నవారు కేటీఆర్, సంతోష్ కుమార్ మాత్రమే. ఈ ఇరువురు కాకుండా కొంత మంది ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో అంటకాగుతూనే ఉంటారు. అయితే రక్తం పంచుకు పుట్టిన కవిత కంటే వారి మాటలకు కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తారని భావించలేం. కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగిన బయటివారు అనతికాలంలోనే ఆయనకు దూరమవడం పరిపాటే. ఈ కారణంగా కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు కేటీఆర్, సంతోష్‌కుమార్ అని భావించాల్సి ఉంటుంది. అధికారంలో ఉన్నప్పుడు.. ముఖ్యంగా చివరి రెండు సంవత్సరాలు పార్టీలో, ప్రభుత్వంలో అంతా తానే అన్నట్టుగా సంతోష్‌కుమార్ వ్యవహరించారు. ఈ పరిణామాన్ని ఒక దశలో కేటీఆర్ కూడా జీర్ణించుకోలేకపోయారు. రాజీ పడటానికి అలవాటుపడిన హరీశ్‌రావు ఈ పరిణామాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే కవిత మాత్రం అప్పట్లోనే తన అసంతృప్తిని దాచుకోలేకపోయారు. ఈ దశలో ఎన్నికలు జరగడం, బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడం జరిగింది. ఆ తర్వాత అటు తండ్రి వద్ద, ఇటు పార్టీలో కేటీఆర్ ప్రాధాన్యం పెరిగింది. సరిగ్గా ఈ దశలోనే ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత పేరు వెల్లడి కావడం, ఈడీ అధికారులు ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగిపోయింది. కుమార్తెను జైలు నుంచి బెయిలుపై విడిపించుకోవడానికి అప్పట్లో కేసీఆర్ చేయని ప్రయత్నం లేదు. కేటీఆర్, హరీశ్‌రావులను ఢిల్లీలో మకాం చేయించి భారతీయ జనతా పార్టీ పెద్దల వద్దకు రాయబారాలు నెరిపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధమని కూడా ఆఫర్లు ఇచ్చారు. అయితే బీజేపీ పెద్దల నుంచి సానుకూల స్పందన రాలేదు. తెలంగాణ ఏర్పాటు సమయంలో అప్పటి టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని నమ్మబలికిన కేసీఆర్, రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంగ్రెస్‌కు జెల్ల కొట్టడం బీజేపీ పెద్దలకు గుర్తుకొచ్చి ఉంటుంది. బీజేపీతో రాజీ ప్రయత్నాలు ఫలించకపోయినా మిగతా నిందితులతో పాటు కవితకు కూడా బెయిల్ వచ్చింది. ఆ తర్వాత కవిత కొంత కాలం పాటు పార్టీకి దూరంగా ఉండిపోయారు. ఇటీవలి కాలంలోనే ఆమె తిరిగి ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే పార్టీలో తనకు పూర్వం లభించిన ప్రాధాన్యం కరువైంది. కేసీఆర్ కూడా ఆమెను పట్టించుకోలేదు. వరంగల్‌లో భారీగా ఖర్చు చేసి నిర్వహించిన రజతోత్సవ సభలో కూడా ఆమెకు ప్రాధాన్యం దక్కలేదు. అప్పుడు హరీశ్‌రావు కూడా రజతోత్సవ సభకు దూరంగానే ఉండిపోగా కేటీఆర్ సర్వం తానై వ్యవహరించారు. అదే సమయంలో పార్టీలో కవిత రీఎంట్రీని ప్రజలు హర్షించడం లేదని ప్రచారం చేశారు. దీంతో పార్టీలో తనకు చోటు లేదన్న అభిప్రాయానికి కవిత వచ్చారు. పార్టీ పగ్గాలు సోదరుడు కేటీఆర్ చేతికి చిక్కితే తన పరిస్థితి ఏమిటి? అని మథన పడ్డారు. ఈ నేపథ్యంలోనే కవిత సొంత పార్టీ ఏర్పాటు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. ఈ దశలో తన కుమారుడు గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని కవిత అమెరికా వెళ్లారు. అదే సమయంలో బీఆర్ఎస్ రజతోత్సవాలను అమెరికాలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఈ ఉత్సవాలలో పాల్గొనడానికి కేటీఆర్ అమెరికా వెళ్లబోతున్నారు. అయితే అప్పటికే అమెరికాలో ఉన్న కవితను ఈ ఉత్సవాల గురించి ఎవరూ సంప్రదించలేదు. అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ వారు కూడా ఆమెను పట్టించుకోలేదు. అదే సమయంలో రజతోత్సవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కేటీఆర్ తరఫున మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అమెరికా వెళ్లారు. సుమన్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కూడా తనకు ఇవ్వకపోవడంపై కవిత ఆగ్రహంగా ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే వరంగల్ సభ తర్వాత తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ గురువారం బయటకు పొక్కింది. కవిత అమెరికా నుంచి తిరిగి రావడానికి ఒక రోజు ముందు ఈ లేఖ లీక్ కావడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. ఈ లేఖను ఎవరు లీక్ చేశారన్నది ఇప్పుడు తేలవలసి ఉంది. కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు ఈ లేఖను లీక్ చేశాయా? లేక కవితనే తన రాకకు ఒక రోజు ముందు వ్యూహాత్మకంగా లీక్ చేశారా? అన్నది తేలాల్సి ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదేనని బీఆర్ఎస్ నాయకులు ఆశల పల్లకిలో విహరిస్తున్న వేళ చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఆ పార్టీ శ్రేణులను నివ్వెరపోయేలా చేశాయి. ఇప్పుడు కవిత అడుగులు ఎటు? అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. కవిత వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు అనుమానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా చెల్లి షర్మిల వెనుక చంద్రబాబు ఉన్నారని జగన్మోహన్‌రెడ్డి ఆరోపించడం విన్నాం. ఇప్పుడు తెలంగాణలో కవిత వెనుక ఫలానా వారు ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు స్పష్టంగా చెప్పడం లేదు. ఈ మొత్తం వ్యవహారంలో కేసీఆర్ వైఖరి ఎలా ఉండబోతున్నదో తెలియకుండా మాట్లాడితే తమకే మంచిది కాదన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు మౌనాన్ని ఆశ్రయించారు.

మా చెడ్డ అధికారం!

అధికారం మహా చెడ్డది. అయినవాళ్ల మధ్య కూడా దూరం పెంచుతుంది. తండ్రి కేసీఆర్‌కు ఎదురు నిలిచి ధిక్కరించే సాహసం ఇప్పటివరకు కేటీఆర్ గానీ, కవిత గానీ చేయలేదు. అలాంటిది ఇప్పుడు కవిత హఠాత్తుగా తండ్రికి ఇబ్బందులు సృష్టించే పనిచేయడం సహజంగానే ఆశ్చర్యం కలిగిస్తోంది. కవిత తిరుగుబాటు స్వరం టీ కప్పులో తుపానులా చల్లబడుతుందా? లేక బీఆర్ఎస్ పుట్టి ముంచుతుందా? అన్నది ఇప్పుడే చెప్పలేం. కేసీఆర్‌ను కలిసి అన్ని విషయాలూ మాట్లాడతానని కవిత అంటున్నందున కేసీఆర్ తన కుమార్తెకు సర్దిచెబుతారా? లేక ఆమెను పార్టీ నుంచి బయటకు పంపుతారా? అన్నది స్పష్టమవుతుంది. కేసీఆర్ ఆగ్రహానికి గురైతే కవిత పరిస్థితి ఏమిటి? కార్యకర్తల మద్దతు గానీ, ప్రజల మద్దతు గానీ ఆమెకు లభించే పరిస్థితులు కనిపించడం లేదు. విమానాశ్రయం వద్ద కవితకు స్వాగతం పలకడానికి జాగృతి కార్యకర్తలు వచ్చి ఉండవచ్చును గానీ చివరి వరకు వారంతా ఆమె వెంట నిలబడకపోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో షర్మిల ఒక విఫల ప్రయోగంగా నిలిచారు. తెలంగాణలో రాజకీయ పార్టీ ప్రారంభించి రాజీ పడకుండా పాదయాత్ర చేసినా ఆమెకు ఆదరణ లభించలేదు. దీంతో అన్న జగన్‌రెడ్డిపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఆమె ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ బాధ్యతలు చేపట్టారు. రాజకీయాల్లో నిలదొక్కుకోవాలంటే పగలనకా రాత్రనకా కష్టపడాలి. అవరోధాలను ఓర్పుగా అధిగమించాలి. ఈ లక్షణాలు షర్మిలలో లేకపోవడం వల్ల ఆమె రాజకీయంగా నిలదొక్కుకోలేక పోతున్నారు. షర్మిలతో పోలిస్తే కవితది భిన్నమైన నేపథ్యం. తెలంగాణ ఉద్యమంలో కవిత చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి పేరిట తనకంటూ ప్రత్యేకంగా ఒక వేదికను ఏర్పాటు చేసుకున్నారు. కింది స్థాయి కార్యకర్తలతో కూడా ఆమెకు పరిచయాలు ఉన్నాయి. వైఎస్ రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందినందున జగన్–షర్మిల మధ్య ఏర్పడిన వివాదాల పరిష్కారానికి ఆ కుటుంబంలో పెద్ద దిక్కు లేకుండా పోయింది. తల్లి విజయలక్ష్మి కుమారుడు, కుమార్తె మధ్య నలిగిపోవడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కేసీఆర్ కుటుంబంలో ఈ పరిస్థితి లేదు. ఇటు పార్టీని, అటు కుటుంబాన్ని కంటి సైగతో శాసించగల కేసీఆర్ ఉన్నారు. ఆయన గీసిన గీత కవిత దాటుతారా? లేదా? అన్నదే ఇప్పుడు ప్రశ్న. తండ్రి నాయకత్వంలోనే పనిచేస్తానని కవిత స్పష్టం చేశారు. కేసీఆర్‌ను ధిక్కరించి రాజకీయంగా నిలదొక్కుకోవడం దాదాపు అసాధ్యం అన్న విషయం తెలుసుకోలేనంత అమాయకురాలు కాదు కవిత. పార్టీలో తన స్థానం ఏమిటో స్పష్టం చేయాలని ఆమె తండ్రి వద్ద మారాం చేయవచ్చు. అయితే తాజా పరిణామాలతో కేసీఆర్ కుటుంబం కూడా రాజశేఖరరెడ్డి కుటుంబం వలె బజారున పడింది. అర్ధాంతరంగా చనిపోవడం వల్ల తన కుటుంబ కలహాలు చూసి బాధపడే దౌర్భాగ్యం రాజశేఖర రెడ్డికి తప్పింది. కేసీఆర్ విషయంలో ఆయన కళ్ల ముందే కుటుంబ కలహాలు వీధిన పడ్డాయి. ఈ సమస్యను ఆయన ఎలా పరిష్కరించుకుంటారో వేచి చూద్దాం. కవిత వ్యాఖ్యలు, లేఖ వ్యవహారాన్ని తేలికగా తీసిపారేయడానికి కేటీఆర్ శుక్రవారం విలేకరుల సమావేశంలో ప్రయత్నించారు. అయితే 'దాల్ మే కుచ్ కాలా హై..' అని అర్థమవుతోంది.

> తండ్రుల వల్ల సంక్రమించిన అధికారం, సంపదలో కుమార్తెలకు వాటా దక్కకపోవడం జగన్, కేటీఆర్ చెల్లెళ్ల ఆగ్రహానికి కారణమైంది. ఎన్టీఆర్ హయాంలో ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది.



> ఇటీవలి కాలంలోనే కవిత తిరిగి ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే పార్టీలో తనకు పూర్వం లభించిన ప్రాధాన్యం కరువైంది. కేసీఆర్ కూడా ఆమెను పట్టించుకోలేదు. వరంగల్‌లో భారీగా ఖర్చు చేసి నిర్వహించిన రజతోత్సవ సభలో కూడా ఆమెకు ప్రాధాన్యం దక్కలేదు. అప్పుడు హరీశ్‌రావు కూడా రజతోత్సవ సభకు దూరంగానే ఉండిపోగా కేటీఆర్ సర్వం తానై వ్యవహరించారు. అదే సమయంలో పార్టీలో కవిత రీఎంట్రీని ప్రజలు హర్షించడం లేదని ప్రచారం చేశారు. దీంతో పార్టీలో తనకు చోటు లేదన్న అభిప్రాయానికి కవిత వచ్చారు. పార్టీ పగ్గాలు సోదరుడు కేటీఆర్ చేతికి చిక్కితే తన పరిస్థితి ఏమిటి? అని మథనపడ్డారు. వరంగల్ సభ తర్వాత తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ గురువారం బయటకు పొక్కింది. ఈ లేఖను ఎవరు లీక్ చేశారన్నది ఇప్పుడు తేలవలసి ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదేనని బీఆర్ఎస్ నాయకులు ఆశల పల్లకిలో విహరిస్తున్న వేళ చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఆ పార్టీ శ్రేణులను నివ్వెరపోయేలా చేశాయి. ఇప్పుడు కవిత అడుగులు ఎటు? అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది.

జరుపుకోవాల్సింది ప్రాయశ్చిత్త దినం!

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు వద్దాం. మద్యం కుంభకోణంలో దర్యాప్తు వేగం అందుకుంటున్న కొద్దీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కలవరం చెందుతున్నారు. ఈ వ్యవహారంలో సిట్ అధికారులు నేరంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న వారిని అరెస్టు చేస్తున్నారు. బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టులతో జగన్ ఉలిక్కి పడుతున్నారు. ఇటు లిక్కర్ కుంభకోణంలో, అటు జెత్వానీ కేసుతో పాటు ఇతర కేసుల్లో అధికారులు అరెస్టయ్యారు. దీంతో కూటమి ప్రభుత్వాన్ని జగన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అరెస్టు చేయడం ఏమిటి? వాళ్లంతా మంచివాళ్లు అని ఆయన చెప్పుకొనే ప్రయత్నం చేశారు. తెలుగునాట ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైలుకు వెళ్లాల్సి రావడానికి అప్పుడు ఇప్పుడు కూడా జగన్‌రెడ్డి కారణం కావడం గమనార్హం? రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాక ముందు ఉమ్మడి రాష్ట్రంలో ఈ పరిస్థితి లేదు. నీటి ప్రాజెక్టులతో పాటు ఇతరత్రా వ్యవహారాల్లో కమీషన్లుగా వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని ఐఏఎస్ అధికారులకు వారి వాటాగా రాజశేఖరరెడ్డి పంపేవారు. ఈ దశలో జగన్మోహన్‌రెడ్డి ధన దాహం తోడవడంతో ఐఏఎస్ అధికారులు తప్పులు చేశారు. సీబీఐ కేసులలో పలువురు అధికారులు విచారణను ఎదుర్కొన్నారు. బీపీ ఆచార్య, శ్రీలక్ష్మి వంటి ఐఏఎస్ అధికారులు జైలుకు వెళ్లి వచ్చారు. అధికారులకు వారి వాటాను రాజశేఖరరెడ్డి హయాంలో పంచడం మాత్రమే చేయగా, జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అక్రమ సొమ్ము సమీకరణ బాధ్యతలను ఏకంగా అధికారులకే అప్పగించారు. లిక్కర్ కుంభకోణంలో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి వంటి వారు జగన్మోహన్ రెడ్డికి రావాల్సిన వాటాను వసూలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. అధికారులను అలా కూడా ఉపయోగించుకోవచ్చునని జగన్‌రెడ్డి మొదటిసారిగా రుజువు చేశారు. ఇక జగన్‌రెడ్డి ప్రస్తావించిన ఐపీఎస్ అధికారుల విషయానికి వద్దాం. ప్రస్తుతం జైల్లో ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులు చేయని అరాచకం లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2014–2019 మధ్య ఆయన విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. అప్పుడొక మహిళా డాక్టర్‌ను లైంగికంగా వేధిస్తున్నారని ప్రస్తుతం అదే జైల్లో ఉన్న వల్లభనేని వంశీ ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతంపై విచారణ చేయడానికి కోడె దుర్గాప్రసాద్‌ను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారు. ఆయన విచారణ జరిపి పీఎస్ఆర్ ఆంజనేయులు తప్పు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినా చంద్రబాబు ఆ నివేదికను పక్కన బెట్టారు. డీజీపీ స్థాయి అధికారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? అని ఇప్పుడు బోలెడంత ఆశ్చర్యపోతున్న వారికి ఈ విషయం తెలియకపోవచ్చు. డీజీపీ స్థాయి అధికారి ఏమి ఖర్మ.. ముఖ్యమంత్రులుగా ఉన్నవారిని కూడా అరెస్టు చేసి జైలుకు పంపిన ఉదంతాలు మన దేశంలో ఎన్నో ఉన్నాయి. కేంద్ర మంత్రులుగా ఉన్న వారు కూడా జైలుకు వెళ్లారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక డిప్యుటేషన్ నుంచి రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఆంజనేయులు అధికారిగా అన్ని పరిధులూ అతిక్రమించారు. ముఖ్యమంత్రి మెప్పు కోసం ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డారు. సీఐడీ విభాగం అధిపతులుగా పనిచేసిన సునీల్ కుమార్, సంజయ్‌లు ఎలా వ్యవహరించారో తెలిసిందే. కాంతి రాణా టాటా, విశాల్ గున్ని వంటి వారు కూడా ఈ కోవలోకే వస్తారు. ఈ అధికారులకు వత్తాసు పలుకుతున్న జగన్‌రెడ్డి కానీ, ఇతరులు కానీ ఒక విషయం తెలుసుకోవాలి. నాడు గానీ, నేడు గానీ అధికారులు కేసుల్లో ఇరుక్కోవడానికి కారణం ఎవరు? జగన్‌రెడ్డి కారణంగానే వీరంతా హద్దు మీరి వ్యవహరించి కష్టాలు కొని తెచ్చుకోలేదా? అధికారం శాశ్వతం అని తాను నమ్మడమే కాకుండా తనకు ఊడిగం చేయడానికి సిద్ధపడిన అధికారులను కూడా భ్రమల్లోకి నెట్టింది జగన్‌రెడ్డి కాదా? జనం అంటే వెర్రిబాగులోళ్లు అని జగన్‌రెడ్డి బలంగా నమ్ముతున్నట్టు ఉంది. రాజ్య హింసను ప్రోత్సహించిన జగన్ రెడ్డి ఇప్పుడు తన ఏలుబడిలో ఏం జరిగిందో జనానికి గుర్తు లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చి అందరికీ సినిమా చూపిస్తాను అనడం ద్వారా ఆయన ఇప్పటికీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ఆశ్చర్యంగా ఉంది. 'మొగుడ్ని కొట్టి మొగసాలకు ఎక్కినట్టు'గా అధికారంలో ఉన్నప్పుడు ఎడాపెడా దోచుకొని ఇప్పుడు చంద్రబాబే కుంభకోణాలకు పాల్పడ్డారని చెప్పగలుగుతున్నారంటే అది ఆయన విపరీత మనస్తత్వానికి నిదర్శనం. మద్యం కుంభకోణంలో అరెస్టయిన నిందితుల్లో పలువురిని.. ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఎందుకు ఓడిపోయారని మీరు భావిస్తున్నారని సిట్ అధికారులు ప్రశ్నించగా, నాసిరకం మద్యం సరఫరా చేయడం ప్రధాన కారణం అని పేర్కొనడం నిజం కాదా? అయినా తన ఓటమికి కారణాలను తెలుసుకోవడానికి ఇష్టపడని జగన్‌రెడ్డి.. ఇతర మీడియా సంస్థలపై పడి ఏడుస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఆయన చూపించిన సినిమా వారి స్మృతిపథం నుంచి తొలగక ముందే మళ్లీ వస్తే సినిమా చూపిస్తానని గుర్తుచేస్తున్నారు. జగన్ రాజకీయ జీవితం అంతా నయవంచనే అనడానికి రాజధాని విషయంలో ఆయన చేసిన ప్రకటనలే నిదర్శనం. 2014–2019 మధ్య ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'రాజధాని ఎక్కడైనా ఏర్పాటు చేయండి, అయితే కనీసం 30 వేల ఎకరాలు అందుబాటులో ఉండేలా చూడండి' అని కోరిన పెద్దమనిషే ముఖ్యమంత్రి అయ్యాక మూడు రాజధానుల కథ వినిపించారు. ఇప్పుడు తాజాగా రాజధానికి ఎంత కావాలి? 500 ఎకరాలు చాలవా? నాగార్జున యూనివర్సిటీకి చెందిన భూమి నుంచి 500 ఎకరాలు తీసుకొని కట్టండి అంటున్నారు. ఈ మూడు ప్రకటనల మధ్య పొంతన ఉందా? యూనివర్సిటీలకు వందల ఎకరాలు కేటాయించిన గత పాలకులు పిచ్చివాళ్లా? నిన్నగాక మొన్న హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో ఏం జరిగిందో చూశాం. 500 ఎకరాల్లో రాజధాని ఏర్పాటు చేస్తే యూనివర్సిటీలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేటాయించడానికి భూములు ఎక్కడి నుంచి వస్తాయి? రాజధానికి 500 ఎకరాలు చాలవా? అంటున్న పెద్ద మనిషికి ఇడుపులపాయ, హైదరాబాద్ లోటస్ పాండ్, బెంగళూరులోని ఎలహంక, తాడేపల్లి ప్యాలెస్‌లు ఎందుకు? జగన్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు. వారిరువురూ విదేశాల్లో ఉంటున్నారు. కేవలం ఇద్దరు మాత్రమే ఉండే జగన్ రెడ్డి దంపతులకు ఇన్ని ప్యాలెస్‌లు అవసరమా? ఈ ప్రశ్నకు ఆయన ఏం సమాధానం చెబుతారు? ఇవి కాకుండా విశాఖలో రుషికొండపై వందల కోట్ల ప్రభుత్వ సొమ్ముతో మరో ప్యాలెస్ నిర్మింపజేశారు. చదరపు అడుగుకు 30 వేలకు పైగా ఖర్చు చేయించారు. ఆయనే ఇప్పుడు రాజధానిలో చదరపు అడుగుకు తొమ్మిది వేలు ఖర్చు చేయడం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి గత ఎన్నికల్లో ఆయనను ఓడించారు గానీ.. లేనిపక్షంలో రుషికొండ ప్యాలెస్‌లో ఆయన కొలువుదీరి ఉండేవారు. మన దేశ రాజకీయాలలో బహుశా మరే ఇతర నాయకుడికీ ఇన్ని నగరాలలో ఇంత విశాలవంతమైన ప్యాలెస్‌లు లేవు. తాను నమ్మే జీసస్‌పై ప్రమాణం చేసి తాను నిర్మించుకున్న ప్యాలెస్‌లు, ఏర్పాటు చేసుకున్న వ్యాపార సామ్రాజ్యం కష్టపడి సంపాదించుకున్నానని జగన్ రెడ్డి చెప్పగలరా? కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా పాటించబోతున్నట్టు ఆయన ప్రకటించారు. గత ఏడాది జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ప్రజలు ఆయనను 11 సీట్లకే పరిమితం చేస్తూ తీర్పు ఇచ్చారు. ఫలితాలు వెల్లడైన రోజునే ఆయన ఎంచుకున్నారంటే ప్రజలు తనకు వెన్నుపోటు పొడిచారని జగన్ భావిస్తున్నారేమో తెలియదు! బటన్లు నొక్కి డబ్బులు పంచినా ప్రజలు తనను ఓడించడం అంటే వెన్నుపోటు పొడవడమేనని ఆయన అనుకుంటున్నట్టుగా ఉంది. ప్రజలు ఆయనకు వెన్నుపోటు పొడిచారా? ఆయనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారా? అన్నది సుస్పష్టం. రాజశేఖరరెడ్డి వేరు.. జగన్మోహన్‌రెడ్డి వేరు అని ప్రజలు గ్రహించారు కనుకనే ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. జగన్‌రెడ్డి నిర్వహించాల్సింది వెన్నుపోటు దినాలు కాదు. ప్రాయశ్చిత్త దినాలు జరుపుకోవాలి. అప్పుడైనా ప్రజలకు ఆయనపై భయాలు తొలగిపోతాయేమో చూడాలి!

విశ్వ శోధకుడు, వైజ్ఞానిక భావుకుడు

జయంత్ విష్ణు నార్లికర్ అచ్చమైన రోల్ మోడల్‌గా నిలిచే శాస్త్రవేత్త. అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతుడైన ఈ వైజ్ఞానికుడు జటిల శాస్త్ర విషయాలను సామాన్యుడికి సులువుగా బోధపడేలా చెప్పగలిగిన భావుకుడు. పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి జనమాధ్యమాల ద్వారా ఒకవైపు పాపులర్ సైన్స్, మరోవైపు సైన్స్ ఫిక్షన్ సృజించిన ప్రతిభాశాలి.

ఖగోళ భౌతిక శాస్త్రవేత్త అయిన నార్లికర్ 1938 జూలై 19న కొల్హాపూర్‌లో జన్మించారు. తండ్రి విష్ణు వాసుదేవ్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో గణిత, సైద్ధాంతిక భౌతిక శాస్త్రాలలో ఆచార్యుడు. తల్లి సుమతి సంస్కృత విదుషీమణి. మేనమామ వి.ఎస్. హుజూర్ బజార్ పేరు గాంచిన సాంఖ్యక శాస్త్రవేత్త. బాల్యం నుంచి విశేష ప్రతిభ కనబరిచిన నార్లికర్ పాఠశాల, కళాశాల ప్రథముడిగా రాణిస్తూ వచ్చారు. గణిత, ఖగోళ భౌతిక శాస్త్రాలు సబ్జెక్టులుగా 1957లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ ఆనర్స్ పట్టా పొందారు.

కుటుంబ ప్రోత్సాహంతో ప్రతిష్ఠాత్మక కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. అక్కడ Fred Hoyle పుస్తకం 'Frontiers of Astronomy' చదివిన తర్వాత ఆయన విద్యాసక్తి ఖగోళ భౌతికశాస్త్రం వైపు మొగ్గింది. విశ్వ నిర్మాణం, పరిణామాన్ని వివరించే 'కాస్మాలజీ'లో ఫ్రెడ్ హోయిల్ పర్యవేక్షణలో పరిశోధన ప్రారంభించారు. గురుత్వాకర్షణ సిద్ధాంతాలపై పిహెచ్.డి పట్టా 1963లో పొందారు. మహా విస్ఫోటనం కారణంగా ఈ జగత్తు ఒక్కదూటున ఉద్భవించిందని చెప్పే 'బిగ్ బ్యాంగ్ థియరి' అప్పటికి బహుళ ప్రచారంలో ఉంది. దానిని విభేదించే రీతిలో ప్రత్యామ్నాయ సిద్ధాంతంగా 'హోయిల్–నార్లికర్ థియరీ ఆఫ్ గ్రావిటీ' (కన్ఫార్మల్ గ్రావిటీగా పేరు గాంచినది) ప్రతిపాదించి ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. 1964లో చేసిన ఈ ప్రతిపాదన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్షతా సిద్ధాంతానికి కొనసాగింపు లేదా మెరుగైన జోడింపుగా మారింది. విశ్వంలోని ప్రతి వస్తువు ద్రవ్యరాశి, ఆ వస్తువు మిగతా వాటితో కలిగి ఉన్న సంబంధం, చర్య బట్టి ప్రభావితం అవుతుందనే 'మ్యాక్ ప్రిన్సిపుల్' వీరి సిద్ధాంతంలో ఆయువుపట్టు. ఐన్‌స్టీన్ ఈ సూత్రం గురించి చర్చించినా, దానిని తన సిద్ధాంతంలో అంతర్భాగంగా చేయలేదు. విశ్వం ఒక్కసారిగా కాకుండా, క్రమంగా విస్తరిస్తూ పోతోందనే సిద్ధాంతం (స్టెడి స్టేట్ థియరీ) ఫలితంగా నార్లికర్, ఆయన గురువు ఫ్రెడ్ హోయిల్‌లు ఒక్కసారిగా ప్రపంచ ప్రఖ్యాతులయ్యారు.

> 1989లో యూజీసీ ఆహ్వానంపై పూణేలో తాను వ్యవస్థాపించిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐ.యు.సి.ఎ.ఎ.) సంస్థకు 2003లో పదవీ విరమణ చేసే దాకా నార్లికర్ నేతృత్వం వహించారు. తద్వారా విశ్వవిద్యాలయాలలో ఖగోళ, ఖగోళ భౌతికశాస్త్ర పరిశోధనలకు పథ నిర్దేశక దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో జన సామాన్యంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఆయన విశేష కృషి చేశారు.



1964లో యువ నార్లికర్ పేరు భారతదేశంలో విపరీతంగా ప్రచారంలోకి వచ్చి ఆయనను స్వదేశానికి ఆహ్వానించాలని పెద్ద ఎత్తున చర్చలు జరగడం చరిత్ర. 1965లో నార్లికర్ 26 ఏళ్ల వయసులో భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ పురస్కారాన్ని పొందారు. ఫ్రెడ్ హోయిల్ 1966లో కేంబ్రిడ్జిలో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ థియరిటికల్ ఆస్ట్రానమీ'ని ప్రారంభించినప్పుడు నార్లికర్‌ను భాగస్వామిగా చేశారు. జీవితకాలపు స్నేహితులుగా మారిన వారిరువురు 'యాక్షన్ ఎట్ ఎ డిస్టెన్స్ ఇన్ ఫిజిక్స్ అండ్ కాస్మాలజీ' (1974), 'ఎ డిఫరెంట్ అప్రోచ్ టు కాస్మోలజీ' (2000) వంటి శాస్త్ర రచనలు చేశారు. 1972లో భారతదేశం తిరిగి వచ్చిన నార్లికర్ బొంబాయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. 1989 దాకా ఈ సంస్థలో బోధిస్తూ, పరిశోధన చేస్తూ; చేయిస్తూ, మరోవైపు మూఢ నమ్మకాలను పెకలించే రీతిలో ప్రసంగాలు, రచనలు వెలువరిస్తూ ప్రజాజీవితంలో కూడా ప్రసిద్ధులయ్యారు. 1989లో యూజీసీ ఆహ్వానంపై పూణేలో ఆయన వ్యవస్థాపించిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐ.యు.సి.ఎ.ఎ.) సంస్థకు 2003లో పదవీవిరమణ చేసే దాకా నేతృత్వం వహించారు. తద్వారా విశ్వవిద్యాలయాలలో ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనలకు పథ నిర్దేశక దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో జన సామాన్యంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి విశేష కృషి చేశారు. ఐ.యు.సి.ఎ.ఎ. వెబ్‌సైట్ చూస్తే ఆయన రచించిన 1200కు పైగా సైన్సు వ్యాసాలు, 140కు పైగా (ఆంగ్లం, హిందీ, మరాఠీ భాషల్లోనే కాకుండా ఇటాలియన్, రష్యన్, జపనీస్, స్పానిష్, గ్రీక్, ఇంకా తెలుగుతో పాటు పలు భారతీయ భాషలలోకి అనువాదమైన) పుస్తకాల వివరాలు విపులంగా తెలుస్తాయి.

నార్లికర్ రాసిన తొలి పాపులర్ వ్యాసం 'డిస్కవరీ' సైన్స్ మ్యాగజైన్‌లో 1960ల తొలినాళ్లలోనే ప్రచురితమయింది. 'న్యూ సైంటిస్ట్' పత్రిక కాస్మాలజీకి సంబంధించిన వ్యాసాలను నార్లికర్‌తో రాయించుకునేది. పరిశోధనలు చేయడం, పాపులర్ సైన్స్ వ్యాసాలు రాయడం మాత్రమే కాకుండా వీరు సైన్స్ విషయాల వక్తగా ఇంగ్లాండ్‌లో ప్రసిద్ధులయ్యారు. దాదాపు అదే కాలంలో వారి తొలి పుస్తకం కూడా అక్కడ నుంచే ప్రచురింపబడింది. మాతృభాష మరాఠీలోను, అలాగే తొలి రెండు దశాబ్దాల జీవితకాలం వారణాసిలో సాగడం వల్ల హిందీలోనూ మాత్రమే కాక ఆంగ్లంలో కూడా ఆయన మంచి రచయిత, వక్త. నార్లికర్ సైన్స్ ఫిక్షన్ నవల 'ధూమకేతు' సినిమాగా రూపొందింది. ఆత్మకథ 'My Tale of Four Cities' మరాఠీ మాతృకకు 2014లో సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. ఆయన మంచి క్రీడాకారుడు. సతీమణి మంగళ గణితశాస్త్రవేత్త. కుమార్తెలు గీత, గిరిజ, లీలావతి వివిధ విజ్ఞానశాస్త్ర రంగాలలో నిష్ణాతులు. కన్నుమూయడానికి ముందు రోజున కూడా మూడు గంటల పాటు పుస్తక పఠనం చేసిన ఈ జిజ్ఞాసువు గత మంగళవారం ప్రాతఃకాలంలో అనంత లోకాలకు తరలిపోయారు.

▪ డా. నాగసూరి వేణుగోపాల్



ఫైనల్‌కు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేవికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తూ కిడాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌ఫైట్‌కు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై

రాణించిన సమీర్ రిజ్వీ • ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు



సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

జైపూర్: టాప్-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. అతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్‌లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

స్టొయినిస్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్‌లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్‌లో అతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్‌లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్‌లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్‌లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇంగ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; బౌలింగ్: ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ: రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x చెన్నై — మ.3.30 నుంచి — వేదిక: అహ్మదాబాద్

హైదరాబాద్ x కోల్‌కతా — రా.7.30 నుంచి — వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీమిండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.



నవతరం నాయకుడు వచ్చాడు

శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్



అర్ష్‌దీప్, సుదర్శన్

ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకొనేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏడాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం అతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. అతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొడుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పాడు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్ఐ స్కాన్ తీయించుకొన్నాడు. అయితే, సిరీస్‌కు అతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతుంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్యలతో చోటు కోల్పోయాడు.

5

పిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.



బుమ్రాకు ఎందుకు వద్దంటే..?

కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్ట్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వు ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కు కూడా జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్ట్‌లో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇక

'శుభ్' ఆరంభం!

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ పట్టుబట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఏ' తరపున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఏ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెనుదిరిగి చూడలేదు. చక్కటి టెక్నిక్, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ సక్సెస్ వెనుక అతడి తండ్రి లఖ్విందర్ కృషి ఎనలేనిది. కొడుకు ధ్యాసంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కొన్నేళ్లపాటు బంధువుల వివాహాలకు కూడా హాజరుకాలేదట. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం ఘనమైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సవాళ్లతో కూడుకున్నదే అయినా.. భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభంగా కొనసాగాలని ఆశిద్దాం.





ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో యువ ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటున్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

'25' వేటలో జొకో!

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సిన్నర్

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కరజ్, జానిక్ సిన్నర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సిన్నర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆరోసీడ్ జొకోవిచ్, సిన్నర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సిన్నర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జిప్పరీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా... మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియటెక్, గతేడాది రన్నరప్ పౌలినీ, రెండో సీడ్ కొకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

షూటర్ ముకేశ్‌కు కాంస్యం

సుహ్లా (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేశ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ మూడోస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ నరేన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో కాంస్యం నెగ్గాడు.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

నాటింగ్‌హామ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 30/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 255 రన్స్‌కు కుప్పకూలింది.

ఖరీదైన బహుమతులు వచ్చాయా...



ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింది పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్ట్‌లు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్ట్‌లు
- ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్ట్‌లు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..



తొలి రోజు నుంచే వడ్డీ

జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపంలోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

చార్జీలు

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

వడ్డీ రేటు

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

లేటు చెల్లింపులు వద్దు

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

పరిమితులు

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువులోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



ఎల్‌ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్లు ఎల్‌ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ధ్రువీకరణ. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్‌ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్‌ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




25వ తేదీ

హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	485
చిత్తూరు	603	విశాఖపట్నం	513

డజను గుడ్లు రూ. 72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,080 ▲	89,900 ▲	1,10,900 ▼
విజయవాడ	99,700 ▲	93,500 ▲	99,700 ▼
విశాఖపట్నం	98,080 ▼	89,900 ▲	1,10,900 ▲
రాజమండ్రి	98,070 ▲	89,900 ▲	1,03,000 ▲
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471 ▼	87,451 ▼	96,909 ▲









ఏపీ ప్రభుత్వంపై కనీస మర్యాద కూడా లేని

తెలుగు చిత్ర పరిశ్రమ

- రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు పవన్ కృతజ్ఞతలు
- ఇకపై వ్యక్తిగత చర్చలు ఉండవు.. సినిమా సంఘాల ప్రతినిధులు రావాల్సిందే
- థియేటర్ల బంద్‌పై ఘాటుగా స్పందించిన ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే - తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా సీఎం చంద్రబాబును తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారైనా మర్యాద పూర్వకంగా కలిశారా? అని ఆయన ప్రశ్నించారు. తెలుగు చిత్ర పరిశ్రమను, అగ్రనటులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకొని ఇబ్బంది పెట్టిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరచిపోయినట్లున్నాయని ఆయన గుర్తు చేశారు. పరిశ్రమ ఇచ్చిన రిటన్ గిఫ్ట్‌ను తను తగిన విధంగానే స్వీకరిస్తున్నాని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ రిటర్న్ గిఫ్ట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. జూన్ ఒకటినుంచి థియేటర్ల బంద్ లేదని ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు వెల్లడించిన కొద్ది గంటలకే పవన్‌కల్యాణ్ ఈ ప్రకటన విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆ ఇబ్బందుల్ని మరచిపోయారా?

"రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిళ్లకూడదని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు కూడా స్పష్టంగా చెప్పాయి. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది, కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా..? ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే, కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందిన వారి చిత్రం విడుదలైనప్పుడు ఏపీ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డ వారు ఇబ్బందిపడకూడదు అనేది కూటమి ప్రభుత్వం విధానం. తెలుగు సినిమా రంగం వారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధర పెంచమని కోరడం ఎందుకు..? అందరూ కలిసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్‌రాజు, అల్లు అరవింద్, .సురేశ్ బాబు, సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా తెలిపారు. అయినప్పటికి ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది" ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం పేర్కొంది.

సినిమా రంగం కోసం ప్రత్యేక పాలసీ..

ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తారు. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యటక రంగానికి పరిశ్రమ హోదా ఇస్తూ పాలసీని ప్రకటించింది. అదే విధంగా సినిమా రంగం అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ తీసుకురావాలని పవన్ ఆలోచన చేశారు. దీనిపై సీఎంతో చర్చించనున్నారు. అనంతరం కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీని ప్రకటిస్తారు.

థియేటర్ల ఆదాయంపై ఆరా

పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో సంబంధిత శాఖలతో సినిమా రంగం అభివృద్ధిపై ఇప్పటికే కొన్ని చర్చలు చేశారు. ఇందులో పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు ఒక గ్రూపుగా ఏర్పడి చేస్తున్న వ్యవహారాలతో పాటు ప్రేక్షకులు వెచ్చిస్తున్న మొత్తాలు, అందుకు అనుగుణంగా వారు పొందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి. తదితర అంశాలను చర్చించారు. థియేటర్లను సంబంధిత యజమానులు నడపటం లేదని, లీజుదారుల చేతిలోనే అత్యధికంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే లీజుదారుల నుంచి పన్ను సక్రమంగా వస్తుందా లేదా...? కొన్ని చిత్రాలకు టిక్కెటు ధరలు పెంచినప్పుడు ఆ మేరకు పన్ను ఆదాయం పెరిగిందా..? లేదా..? అని కూడా పన్నుల విభాగం పరిశీలన చేయాలని దిశానిర్దేశం చేశారు. రాయలసీమ జిల్లాల్లో థియేటర్ల నుంచి వచ్చే ఆదాయంపైన ఈ సందర్భంగా చర్చించారు. టికెట్ సేల్‌కి, వచ్చే పన్నుకి అంతరం ఏ మేరకు ఉందో చూడాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో మల్టీప్లెక్సులు ఎన్ని ఉన్నాయి..?

రాష్ట్రంలో మల్టీప్లెక్స్ స్థాయి సినిమా హాల్స్ ఎన్ని ఉన్నాయో తెలియచేయాలని ఇప్పటికే సినిమాటోగ్రఫీ శాఖ అధికారులను ప్రభుత్వం నివేదిక అడిగింది. కొన్ని పట్టణాల్లో సింగిల్ థియేటర్లను కూడా రెండు, మూడు స్క్రీన్స్‌గా విభజించి మల్టీప్లెక్స్ విధానంలో నడుపుతున్నారు. వాటిలో టికెట్ ధరలు, సింగిల్ థియేటర్ టికెట్ ధరలకు ఏమైనా వ్యత్యాసం ఉందా..? కౌంటర్‌లో ఏ ధరకు అమ్ముతున్నారో ఆరా తీస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లో ఉన్న మల్టీప్లెక్స్‌ల నిర్వహణ వాటిలోని టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా దృష్టిసారిస్తారు.

నైపుణ్యాల పెంపుతోనే పరిశ్రమగా అభివృద్ధి...

కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా రాష్ట్రంలో సినిమా రూపకల్పన నుంచి వాణిజ్యం వరకూ 24 విభాగాల్లో నైపుణ్యాలు పెంపుదల, ఆధునాతన సాంకేతిక వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. పరిశ్రమహోదా కల్పించడంతో పాటు యువతలోనూ, ఇప్పటికే చిత్ర రంగంలో ఉన్న వారికి ఎప్పటికప్పుడు నైపుణ్యాల అభివృద్ధి కోసం - అవసరమైన శిబిరాలు, సెమినార్లు, సింపోజియమ్స్ లాంటివి ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా నిర్వహిస్తారు. సినిమా రంగంలో స్టూడియో నుంచి సినిమా హాల్ వరకూ ఉండే విభాగాల్లో గుత్తాధిపత్యం కంటే ఎక్కువ మందికి అవకాశాలు కల్పిస్తేనే, పెట్టుబడులు పెరిగి పరిశ్రమగా వృద్ధి చెందుతుంది. ఈ దిశగానే పవన్ కల్యాణ్ ఆలోచన చేశారు. కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా ఏపీలో సినిమా రంగం అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేష్

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంతి దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు మూసివేయాలన్న ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల నిర్ణయంపై ఆరా తీస్తున్నామన్నారు. సినీరంగ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుకూల వాతావరణం ఉందన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసమే నూతన ఫిల్మ్ పాలసీ తెస్తున్నామన్నారు. చిత్ర పరిశ్రమకు, ఎగ్జిబిటర్లకు డిస్ట్రిబ్యూటర్లకు, ప్రొడ్యూసర్‌లకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో విచారణ చేపడుతున్నామన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినీపరిశ్రమకు చెందిన వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను ఆరా తీసి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారని చెప్పారు. 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ముందు ఈ తరహా వ్యవహారం దేనికి సంకేతమని మంత్రి ప్రశ్నించారు.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై, చిత్ర పరిశ్రమలోని పరిస్థితులపై నిర్మాతలు బన్నీవాసు, నాగవంశీ స్పందించారు. "సినీ ఇండస్ట్రీలో రాజకీయాలు చాలా సైలెంట్‌గా.. లోతుగా ఉంటాయి. ఈ రాజకీయాల్లో పరిశ్రమ నలిగిపోతోందనే వాస్తవాన్ని ఇప్పటికైనా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు గ్రహించాలి. సినిమాల నుంచే వెళ్లి, డిప్యూటీ సీఎం అయిన వారికే మనం ఆగ్రహం తెప్పించామంటే.. మన ఐకమత్యాన్ని ప్రశ్నించుకోవాల్సిన సమయమిది"

- బన్నీవాసు

"పెద్ద సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో.. అనవసరం లేని సమస్యలను సృష్టించారు. ఇప్పుడు అవే పెరిగి పెద్దవయ్యాయి. విచక్షణతో ఆలోచించి ఉంటే పరిస్థితి దాకా వచ్చేది కాదు.. ఇలాంటి సమస్యలూ వచ్చేవి కావు"

- నాగవంశీ

థియేటర్ల బంద్ లేదు

- సమస్యల పరిష్కారానికి కమిటీ



'ఏదో ఒక సినిమాను టార్గెట్ చేసి, థియేటర్లను బంద్ చేస్తున్నారు అనే ప్రచారాన్ని ఖండిస్తున్నాం. జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ లేదు. ఈ విషయంపై అవసరం వస్తే ప్రభుత్వంతో సైతం చర్చిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్‌ల బంద్ అంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఆయన స్పష్టతనిచ్చారు. థియేటర్ల బంద్ అంశంపై కొన్ని రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. వీరంతా ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడిగా సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ 'జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ జరగడం లేదు. ఈ నెల 30న ఈసీ మీటింగ్ ఉంటుంది. ఆ రోజు మూడు విభాగాల సభ్యులతో కమిటీ వేయబోతున్నాం. తద్వారా ఈ సమస్యకు నిర్ణీత సమయంలో పరిష్కారం వచ్చే అవకాశం ఉంది. చిత్ర పరిశ్రమ కష్టాలను బయట వారెవ్వరూ తీర్చరు. స్వయంగా పరిశ్రమే అందులో నుంచి బయటపడుతుంది' అని చెప్పారు.

మంచి మాస్ రోల్ చేశాను

బెల్లంకొండ సాయి శ్రీనివాస్



"నన్ను ఇష్టపడే ప్రతి ప్రేక్షకుడి కోసం 'భైరవం' చిత్రం చేశాను. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ బలమైన మాస్ పాత్రని చేశాను. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. వంద శాతం వినోదాన్ని పంచుతుంది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రమిది. కేకే రాధామోహన్ నిర్మించారు. ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మీడియాతో ముచ్చటించారు.

- 'భైరవం' చిత్రంలో పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. ఈ సినిమాలో హీరో కొలిచేది కాలభైరవుణ్ణి. అలా కథలో నుంచే 'భైరవం' టైటిల్ వచ్చింది. సరికొత్త అంశాలతో వినూత్న కథాంశంతో సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో మాస్ అంశాలతో ఓ సినిమా చేయాలనుకుంటున్న తరుణంలో 'భైరవం' కథ నా దగ్గరకు వచ్చింది. నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. పల్లె వాతావరణంలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. దర్శకుడు విజయ్‌తో పని చేయడం మంచి అనుభవం. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు పలు మార్పులు చేసి సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మార్క్ బలంగా కనిపిస్తుంది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. ముఖ్యంగా పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్. సినిమా చూశాక విజయ్ కథకు తన పరిధిలో పరిపూర్ణంగా న్యాయం చేశారనే ఫీలింగ్ కలిగింది. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి.
- నారా రోహిత్, మంచు మనోజ్ పాత్రలు కథలో చాలా కీలకం. అందరికీ గుర్తుండిపోయేలా వారి పాత్రలను దర్శకుడు తీర్చిదిద్దారు. డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో వారిద్దరూ అలరిస్తారు. అదితీ శంకర్ వెరీ నైస్ పర్సన్. నటనలో తనదైన శైలీ, హావభావాలతో మెప్పిస్తుంది. అలాగే తను మంచి సింగర్, డాన్సర్ కూడా. ఈ సినిమాతో ఆమె ప్రతిభకు తగ్గ గుర్తింపు దక్కుతుంది. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతం ఇచ్చారు. పాటలకు మంచి స్పందన లభిస్తోంది. రాధామోహన్ గారు నాకు చాలా ఇష్టమైన ప్రొడ్యూసర్. హీరోగా నాకు చక్కటి సంతృప్తిని మిగిల్చే సినిమా ఇచ్చారు. ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు', 'కిష్కింధపురి' చిత్రాలు చేస్తున్నాను.

పోలీస్ కానిస్టేబుల్ వేషం.. చేసేది మోసం

- ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తానంటూ డబ్బులు వసూలు
- ఘరానా మోసగాడి అరెస్ట్

6



సొమ్ము జైళ్లశాఖది.. సోకు అధికారిది!



లీజు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు ఉంచిన నిర్మాణ సామగ్రి, ఏర్పాటు చేసిన షెడ్లు

జైళ్లశాఖ స్థలం దొడ్డిదారిన లీజ్

ప్రతిఫలంగా ఆయన జేబులోకి నెలకు రూ.లక్ష

ఐదేళ్లుగా రూ.60లక్షలు మింగేసిన వైనం

జైళ్ల శాఖ ఆదాయానికి గండిపై డీజీ సీరియస్

అంతర్గత విచారణకు ఆదేశాలు!

సైదాబాద్, మే24 (ఆంధ్రజ్యోతి): 'సొమ్మొకరిది.. సోకొకరిది' అన్నట్లుగా తయారైంది జైళ్లశాఖ పరిస్థితి. నగరంలో కోట్ల రూపాయల విలువ చేసే జైళ్లశాఖ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా పరిరక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కొందరు అధికారులు కాసుల కక్కుర్తితో స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అనధికారికంగా లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మలక్‌పేటలో సుమారు 3వేల గజాల జైళ్లశాఖ స్థలాన్ని ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అనధికారికంగా లీజుకు కట్టబెట్టడమే ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. వివరాల్లోకెళితే.. మలక్‌పేట అగ్నిమాపక స్టేషన్ పక్కనే సర్వే నంబరు 138, 136/1 పార్ట్‌లో జైళ్ల శాఖకు సంబంధించిన సుమారు 2.77 ఎకరాల స్థలం ఉంది. 2011లో ఐదుగురు వ్యక్తులు ఆ స్థలం తమదని, అక్కడ గోడ నిర్మాణం చేయవద్దంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు(డబ్ల్యుపీ 22721/2011) కోర్టులో పెండింగ్‌లో ఉంది. నేటికీ అధికారికంగా ఆ స్థలం జైళ్ల శాఖ పర్యవేక్షణలోనే కొనసాగుతోంది.

గతంలోనూ 323 గజాలు ప్రైవేట్ పరం

సైదాబాద్ చౌరస్తాలో కబ్జాలో ఉన్న 323 గజాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు తెలంగాణ జైళ్ల శాఖకు అప్పగించారు. ఆక్రమణలు తొలగించి జైళ్లశాఖ భూమి అంటూ బోర్డు సైతం ఏర్పాటు చేశారు. కానీ, అప్పటి మంత్రి అండ, జైళ్లశాఖ అధికారుల సహకారంతో కోట్లాది రూపాయలు విలువజేసే స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ కబ్జా వ్యవహారంలోనూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్లు సమాచారం. ఇలా జైళ్ల శాఖకు చెందిన స్థలాలు ఒకదాని తర్వాత ఒకటి అన్యాక్రాంతమవుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జైళ్లశాఖ స్థలమంటూ ఏర్పాటు చేసిన బోర్డు

అనధికారికంగా లీజుకు..

చంచల్‌గూడ ప్రెస్ నుంచి సంతోష్‌నగర్ యాదగిరి థియేటర్ వరకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించే పనులను ప్రభుత్వం 2020 జూలైలో కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే, సదరు నిర్మాణ సంస్థకు సంబంధించిన భారీయంత్రాలు, సామగ్రిని ఉంచేందుకు, వందలాది మంది కార్మికులు ఉండేందుకు సరైన స్థలం కోసం అప్పట్లో కాంట్రాక్టు ప్రతినిధులు జైళ్లశాఖ అధికారులను ఆశ్రయించారు. దీన్ని అవకాశంగా తీసుకున్న ఓ ఉన్నతాధికారి ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై

మిగతా 8వ పేజీలో..

భారీ వర్షం

ప్రధాన రహదారులను ముంచేసిన వరదనీరు

కూకట్‌పల్లిలో 2.4 సెం.మీ

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ జాం

మరో రెండురోజుల పాటు వర్షాలు



పలు ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం..

ప్రాంతం	వర్షపాతం(సెం.మీ)
కూకట్‌పల్లి	2.5
బోరబండ	2.4
జీడిమెట్ల	2.3
మాదాపూర్	2.3
షేక్‌పేట	2.2
రాజీవ్‌గృహకల్ప	2.1
గచ్చిబౌలి	2.0
హైదర్‌నగర్	1.9
జూబ్లీహిల్స్	1.9



జగద్గిరిగుట్టలో గొడుగుతో చిన్నారులు

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం రాత్రి కురిసిన భారీవర్షంతో పలు ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి. ఐడీపీఎల్, జగద్గిరిగుట్ట, కొండాపూర్, కూకట్‌పల్లి, బోరబండ, కుత్బుల్లాపూర్‌లో కురిసిన భారీవర్షంతో రోడ్లపై మోకాళ్ల లోతు వరదనీరు నిలిచింది. గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, చందానగర్, లింగంపల్లి, మియాపూర్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ బి బ్లాక్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలు ముందుకు కదలలేక ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. కూకట్‌పల్లిలో అత్యధికంగా 2.5 సెం.మీ. వర్షం కురిసింది. భారీవర్షానికి మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



కూకట్‌పల్లిలో రోడ్డుపై చేరిన వరద నీరు..

గ్రీన్‌సిగ్నల్!

రూ.11,240కోట్లతో మహానగర దాహార్తి తీర్చేలా పనులు

తుది దశకు చేరిన టెండర్లు..

జూన్ మొదటి వారంలో ప్రారంభానికి వాటర్‌బోర్డు సన్నాహాలు

జంట జలాశయాలను నింపి మూసీ పునరుజ్జీవం చేసేలా..

గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులకు శంకుస్థాపన

39 ఎస్టీపీల నిర్మాణ ప్రాజెక్టుకు సైతం భూమిపూజ

హైదరాబాద్ సిటీ, మే24 (ఆంధ్రజ్యోతి): మహా నగరంలో ప్రజల దాహార్తి తీర్చేలా రూ.11,240కోట్లతో వాటర్‌బోర్డు ఏకకాలంలో పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిధులతో గ్రేటర్ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే కాక జంట జలాశయాలను నింపుతూ మూసీ పునరుజ్జీవానికి దోహదపడే గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులను పట్టాలెక్కించనున్నారు. టెండర్ ప్రక్రియ తుదిదశకు చేరడంతో జూన్ మొదటివారంలో పనుల ప్రారంభానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. గ్రేటర్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేయడానికి గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టుల పనులను ఏకకాలంలోనే ప్రారంభించడానికి వాటర్‌బోర్డు సన్నాహాలు చేస్తోంది. జూన్ మొదటివారంలో

39ఎస్టీపీల నిర్మాణ ప్రాజెక్టుకు సైతం భూమిపూజ

మూసీలో మురుగు చేరకుండా కట్టడి చేసే 39ఎస్టీపీలకు వాటర్‌బోర్డు ఇప్పటికే టెండర్లను ఖరారు చేసింది. రూ.3,840కోట్లతో చేపట్టే ఎస్టీపీల నిర్మాణానికి ఇప్పటికే స్థలాలు నిర్ణయించడంతో పాటు భూసేకరణ ప్రక్రియ కూడా దాదాపు పూర్తికావొచ్చింది. దీంతో జూన్ మొదటివారంలో భూమిపూజ చేసేందుకు వాటర్‌బోర్డు తగు ఏర్పాట్లు చేస్తోంది.

మిగతా 8వ పేజీలో..

లక్ష్యం మేరకు ట్యాక్స్ వసూలు చేయాలి



గ్రేటర్ కమిషనర్ కర్ణన్

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సంవత్సరం చివరి వరకు వేచి చూడకుండా నిర్దేశించిన లక్ష్యం మేరకు ట్యాక్స్ వసూలు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అడిషనల్ సీసీపీ, డిప్యూటీ కమిషనర్లు, ఏసీపీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ ట్యాక్స్‌తో పాటు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని ఆదేశించారు. రెసిడెన్షియల్స్‌ను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్న భవనాలను గుర్తించి వాటిని కమర్షియల్ గా మార్చి పన్ను వసూలు చేయాలన్నారు. జోన్లలో ఉన్న కంటెంప్ట్ కేసులకు సరైన సమాధానం ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. ఈ విషయంలో అవసరమైన సహాయం కోసం లీగల్ ఓఎస్‌డి, అడిషనల్ కమిషనర్, సీసీపీలను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, సత్యనారాయణ, వేణుగోపాల్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రామ్‌నాయక్, అడిషినల్ సీసీపీ వెంకన్న, లీగల్ ఓఎస్‌డి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ ఏదైనా హక్కులు ప్రభుత్వానికే..



సదస్సులో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, మే24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ, మున్సిపాలిటీ, డీటీసీపీ, హెచ్‌ఎండీఏ ఇలా ఏ స్థాయిలో లేఅవుట్ అనుమతులు పొందినా.. అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలపై ప్రభుత్వానికే హక్కులుంటాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో లేఅవుట్లపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలకు చెందిన పలువురు నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ 10 శాతం ప్లాట్లు

మిగతా 8వ పేజీలో..

హైడ్రాకు రూ.25 కోట్ల నిధులు విడుదల

6

టార్గెట్ జూలై 2026

ఎస్టీపీల సామర్థ్యం పెంపు పనులు పూర్తి చేయాలి

నిర్మాణ సంస్థకు హెచ్‌ఎండీఏ ఆదేశాలు జారీ

హైదరాబాద్ సిటీ, మే24 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న మూడు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీ) సామర్థ్యం పెంపు పనులను వచ్చే ఏడాది (2026) జూలై నాటికి పూర్తి చేయాలని నిర్మాణ సంస్థకు హెచ్‌ఎండీఏ ఆదేశాలు జారీ చేసింది. భవిష్యత్తులో సాగర్‌లోకి రెండింతల మురుగునీరు వచ్చినా శుద్ధి చేసేలా రూ.235కోట్లతో

మిగతా 8వ పేజీలో..



ఎస్టీపీ విస్తరణ కోసం జరుపుతున్న భూసార పరీక్షలు

హెచ్‌సీయూకి రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులు

'డిజిటల్ సెంటర్' ఏర్పాటుకు కేటాయించిన హెచ్ఏఎల్

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో "డిజిటల్ ట్విన్ టెక్నాలజీ సెంటర్ ఫర్ ఎక్స లెన్స్" ఏర్పాటుకు హిందుస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.5కోట్లు కేటాయించింది. ఈ నిధులతో స్టేట్ ఆఫ్ ఆర్ట్ డిజిటల్ ట్విన్ రీసెర్చ్ ల్యాబ్, ట్రైనింగ్ ల్యాబ్, శిక్షణ తరగతుల నిర్వహణ కోసం ఆడిటోరియం నిర్మిస్తారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ, హెచ్ఏఎల్ సహకారంతో డిజిటల్ ట్విన్ టెక్నాలజీపై మరిన్ని పరిశోధనలు జరుగుతాయన్నారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కృషి చేసిన ప్రొఫెసర్ సామ్రాట్ సాబత్, ప్రొఫెసర్ సిబా కె ఉద్గతే, ప్రొఫెసర్ ఎం.ఘన్‌శ్యామ్ కృష్ణలను అభినందించారు.



సౌమ్య జైళ్లశాఖది.. సోకు అధికారిది!

(7వ పేజీ తరువాయి)

వారి పేరుతో జైళ్లశాఖలోని స్థలాన్ని అనధికారికంగా లీజ్‌కు ఇప్పించారు. ఇందుకుగాను నెలకు రూ.లక్ష వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయం గా తెలిసింది. ఇలా అద్దె రూపంలో గత ఐదేళ్లుగా సుమారు రూ.60 లక్షల దండుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

జైళ్ల శాఖ డీజీ సీరియస్

తాజాగా లీజు వ్యవహారం జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా దృష్టికి రావడంతో తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. సదరు స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ సంస్థ ప్రతినిధులను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. జైళ్లశాఖ స్థలాన్ని అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులకు లీజు ఇవ్వడం ఏమిటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురాకుండా గోప్యంగా ఎందుకు ఉంచారని నిలదీసినట్లు తెలిసింది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న డీజీ వాస్తవాలు రాబట్టేందుకు అంతర్గత విచారణకు ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. ఇందులో అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని జైలు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

యూపీఎస్సీ రాసే అభ్యర్థులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్‌లో ఆదివారం జరిగే యూపీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం గ్రేటర్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని గ్రేటర్‌ఆర్టీసీ ఈడీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు రాసేవారికి ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, రద్దీ పాయింట్లలో ఆర్టీసీ అధికారులు విధుల్లో ఉంటారని తెలిపారు. బస్సుల వివరాల కోసం కోఠి- 9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్ - 9959226154 కమ్యూనికేషన్ సెంటర్ల నెంబర్లలో వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.





పోలీస్ కానిస్టేబుల్ వేషం.. చేసేది మోసం

● ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తానంటూ డబ్బులు వసూలు ● ఘరానా మోసగాడిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): అవసరాన్ని బట్టి పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ కానిస్టేబుల్‌గా వేషాలు మార్చి, ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్న ఘరానా నేరగాడిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, ముషీరాబాద్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లా మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన కొనకంచి కిరణ్ కుమార్ (30), యూసఫ్‌గూడలో ఉంటున్నాడు. ఇతడు పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ కాని స్టేబుల్ దుస్తులు ధరించి రోడ్లపై తిరుగుతాడు. నెంబర్ ప్లేట్ మార్చిన బైక్‌పై పోలీస్ అని రాసుకోవడంతోపాటు సైరన్ కూడా పెట్టుకొని జనసమర్థ ప్రాంతాల్లో సంచరించేవాడు. అక్కడ పరిచయమైన వారికి వేసుకున్న డ్రెస్‌ను బట్టి పోలీస్ కానిస్టేబుల్ లేదా ఫారెస్ట్ బీట్ కానిస్టేబుల్‌నని చెప్పుకుంటాడు. తనకు పరిచయమున్న ఉన్నతాధికారుల సాయంతో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకులను


నిందితుడు కొనకంచి కిరణకుమార్, స్వాధీనం చేసుకున్న సామగ్రి

నమ్మించేవాడు. తాను కూడా అదేవిధంగా ఉద్యోగం సాధించానని చెబుతూ పలువురిని నమ్మించి రూ. 20 లక్షల వరకు వసూలు చేసి తప్పించుకొని తిరుగుతున్నాడు. ఇతడిపై మధిర టౌన్, సూర్యాపేట, కొణిజెర్ల, కోహిర్, ఖమ్మం, చర్లపల్లి, సైఫాబాద్, బంజా రాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమో దయ్యాయి. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నానని నమ్మించిన కిరణ్ కుమార్ తనకు పరిచయమైన జే.సుభాష్ కుమార్, అశ్వినిలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బు వసూలు చేశాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, నిందితుడు కిరణ్ కుమార్‌ను గుర్తించి, ముషీరాబాద్ పోలీసుల సాయంతో అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి పోలీస్ యూనిఫాం, ఫారెస్ట్ కానిస్టేబుల్ యూనిఫాం, హోండా గ్లామర్ బైక్, రెండు మొబైల్ ఫోన్‌లు, రూ. 5.45 లక్షలతోపాటు బాధితుల ధృవపత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

29న నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మేళా ఉంటుందని, పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు ఈనెల 29న ఉదయం 11:00 గంటలకు బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9963758829, 8328428933 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.



లేఅవుట్ ఏదైనా హక్కులు ప్రభుత్వానికే

(7వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ అయితే ఆ లేఔట్లను గుర్తించాల్సిన అవసరముందని, అందులో మార్పులు చేయాల్సి ఉంటే.. అప్పటికే ప్లాట్లు కొన్నవారి అనుమతితో రివైజ్ చేయాల్సి ఉంటుందని అన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించవచ్చు : నిపుణులు

దశాబ్దాల క్రితం గ్రామపంచాయతీలు అనుమతి ఇచ్చిన లేఅవుట్ల విషయం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాల్సిన అవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది. అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన వాటిపైన చర్యలు తీసుకోవచ్చునని అన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులపై సదస్సు కూలంకుషంగా చర్చించింది. చెరువు పరిధిలో నిర్మించిన కట్టడాల విషయంలో కూడా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేకుండా వాటిని తొలగించవచ్చని పేర్కొంది. రహదారులు, పార్కులలో నిర్మాణాలు చేపట్టినా ఇది వర్తిస్తుందని సూచించింది. అలాగే రెగ్యులరైజ్ చేసిన ఇంటి స్థలాలు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే వాటిని రద్దు చేసే అధికారం కూడా ఉందని పేర్కొంది.

హైడ్రాకు రూ.25 కోట్ల నిధులు విడుదల

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు ప్రభుత్వం రూ. 25 కోట్ల నిధులను కేటాయించింది. 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించి నిధుల కేటాయింపుకు సంబంధించి శనివారం ప్రభుత్వ కార్యదర్శి ఇలంబర్తి జీఓను జారీ చేశారు.

గ్రీన్‌సిగ్నల్!

(7వ పేజీ తరువాయి)

పనులకు శంకుస్థాపన చేసి 24 నెలల్లో గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించింది. గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టుల ద్వారా నగరానికి 20 టీఎంసీల నీటిని తీసుకురావాలనే బృహత్తర లక్ష్యాన్ని నిర్దయించింది. ఇందులో ఐదు టీఎంసీలు మూసీ పునరుజ్జీవం కోసం కాగా.. 15టీఎంసీలు హైదరాబాద్ నగర ప్రజల తాగునీటికి వినియోగించనున్నారు.

టార్గెట్ జూలై 2026

(7వ పేజీ తరువాయి)

హెచ్ఎండీఏ మూడు ఎస్టీపీల సామర్థ్యాన్ని పెంచే పనులను చేపట్టింది. ఇందుకు టెండర్లను ఖరారు చేసి ఓ నిర్మాణ సంస్థకు పనులను అప్పగించగా ఇటీవల పాటిగడ్డ వద్ద చేపట్టిన భూసార పరీక్షలతో పనులు ప్రారంభమయ్యాయి. హుస్సేన్‌సాగర్‌లోకి మొత్తం మూడు (బల్కంపేట, బుల్కాపూర్, కూకట్‌పల్లి) నాలాల ద్వారా మురుగునీరు చేరుతుండగా, ఇందులో బల్కంపేట నాలాను మళ్లించారు. బుల్కాపూర్, కూకట్‌పల్లి నాలాలపై ఎస్టీపీలను ఏర్పాటు చేశారు. బుల్కాపూర్ నాలాపై ఖైరతాబాద్ ఫ్లైఓవర్ పక్కన రోజుకు 20మిలియన్ గ్యాలన్ల మురుగును శుద్ధిచేసేలా ఎస్టీపీని, కూకట్‌పల్లి నాలాపై రోజుకు 30మిలియన్ గ్యాలన్ల మురుగును శుద్ధి చేసే ఎస్టీపీని ఏర్పాటు చేశారు. ఇవి సుమారు 20ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్టీపీలు కావడంతో అధికంగా మురుగునీరు సమయంలో నేరుగా హుస్సేన్‌సాగర్‌లోకి వెళుతుంది. ఇక వర్షాకాలంలో మురుగునీరంతా హుస్సేన్‌సాగర్‌లోకే వెళుతుంది. ఈ పరిస్థితుల్లో ఎస్టీపీల సామర్థ్యాన్ని పెంచేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది.

ఒక్కో ఎస్టీపీ రెండింతలు

తక్కువ సమయంలో ఎక్కువ మురుగునీటిని శుద్ధి చేసేలా ఎస్టీపీల సామర్థ్యాన్ని రెండింతలుగా పెంచుతున్నారు. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ పక్కన ఉన్న ఎస్టీపీని 20మిలియన్ గ్యాలన్ల నుంచి 40మిలియన్ గ్యాలన్లకు పెంచేందుకు, కూకట్‌పల్లి నాలాపై పాటిగడ్డ వద్ద ఉన్న 30మిలియన్ గ్యాలన్ల ఎస్టీపీని 60 మిలియన్ గ్యాలన్లకు పెంచుతున్నారు. అదేవిధంగా కూకట్‌పల్లిలోని ఐడీపీఎల్ చెరువు వద్ద గల ఐదు మిలియన్ గ్యాలన్ల ఎస్టీపీని 10మిలియన్ గ్యాలన్లకు పెంచుతున్నారు.

ఎస్టీపీలలో ప్రస్తుతమున్న యంత్రాల స్థానంలో ఆధునాతన యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మూడు ఎస్టీపీల సామర్థ్యాన్ని పెంచే పనులు చేపడుతున్న నిర్మాణ సంస్థే మరో ఐదేళ్ల పాటు ఆపరేషన్ మెయింటనెన్స్ నిర్వహించాలనే నిబంధన కూడా హెచ్ఎండీఏ విధించింది. ఈ ఏడాది చివరి వరకు సివిల్ వర్క్స్ పూర్తి చేయాలని, వచ్చే ఏడాది జూలై వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని నిబంధనలు విధించారు.

ప్రతీ రోజు 48 రిజిస్ట్రేషన్లు జరగాల్సిందే: డీఐజీ

నార్సింగ్, మే 24 (ఆంధ్రజ్యోతి): జూన్ 1నుంచి గండిపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆన్‌లైన్ స్లాట్ సిస్టమ్ను మొదలు పెడుతున్నారు. ఇందుకోసం శనివారం నార్సింగ్‌లోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో శంషాబాద్ డివిజన్ సబ్ రిజిస్టర్‌కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్‌శాఖ రాష్ట్ర డీఐజీ సింక్వేజాన్, రంగారెడ్డి జిల్లా డీఆర్‌వో సంతోష్, సబ్ రిజిస్టర్లు పాల్గొన్నారు. ప్రతీ కార్యాలయంలో నిత్యం 48 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తప్పకుండా జరగాలని ఆ విధంగా ప్లాన్ చేసుకోవాలని డీఐజీ సూచించారు. అంతకంటే ఎక్కువగా వస్తే మరో సబ్ రిజిస్టర్‌ని కేటాయిస్తామని, పనిమాత్రం ఆగవద్దని ఆదేశించారు. ఆన్‌లైన్ సిస్టమ్, స్లాట్ సిస్టమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, దీంతో పని సునాయాసం అవుతుందని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని స్లాట్ రిజిస్ట్రేషన్ విషయంలో కొంతమందికి అవగాహన లేక ఇబ్బందిపడుతున్నారని, అలాంటివారు కార్యాలయానికి వచ్చి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని డీఐజీ సూచించారు.

గడువులోగా రాకుంటే వాహనాల వేలం

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించి వదిలివేసిన 261 ద్విచక్ర వాహనాలను అంబర్‌పేటలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉంచామని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన వివరాలను రాచకొండ పోలీస్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, యజమానులు పత్రాలతో ఆరు నెలల్లోగా సంప్రదించాలన్నారు. గడువులోగా ఎవరూ రాకుంటే వీటిని వేలం వేస్తామని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8008338535 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.







ఉచిత వైద్య శిబిరం

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): బుద్వేల్‌లో రాపా ప్రకృతి వైద్యం, యోగా ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, రగడంపల్లి శ్రావణ్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మైదానంలో..

గోషామహల్, మే 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మైదానంలో సత్యసుందర్ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ చైర్మన్ ఠాకూర్ గోపాల్‌సింగ్, మెడ్విన్ ఆస్పత్రిల సంయుక్తాధ్వర్యంలో శనివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి మాజీ కార్పొరేటర్లు జి.ముఖేష్ సింగ్, పరమేశ్వరిసింగ్ హాజరై ప్రారంభించారు. ఠాకూర్ గోపాల్‌సింగ్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఈవైద్యశిబిరం నిర్వహించడం గొప్పవిషయమని ముఖేషసింగ్ పేర్కొన్నారు. సుమారు 800 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడ్విన్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ ఈనేశ్ మర్చంట్, సత్యసుందర్ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

నార్సింగ్, మే 24(ఆంధ్రజ్యోతి): అల్కాపూర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వంశీ ఎన్నికైయ్యారు. ఆయన ఆల్ కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కూడా ఉండడంతో రెండు కార్యవర్గాలకు కలిపి మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను శనివారం కలిశారు. తమ సంఘాల తరుపున ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అల్కాపూర్‌లో స్పోర్ట్స్ పార్కు అభివృద్ధి చేయాలని, రిజర్వాయర్ పనులు కూడా పూర్తి చేయాలని, రోడ్ల నిర్మాణం చేపట్టాలని, డ్రైనేజీ సిస్టమ్‌ను మార్చాలని ఆయన కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ వినతి పై కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆల్ కాలనీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సంతోష్, నాగార్జున, శర్మ, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, శివ, మహేందర్‌చారి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమణ రవాణాను నివారించాలి

బర్కత్‌పుర, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పశువుల అక్రమణ రవాణాను నివారించాలని భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ డిమాండ్ చేసింది. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు లేకపోవడంవల్ల పశువులతో పాటు గోవులను కూడా గుట్టుచప్పుడు కాకుండా తీసుకొస్తున్నారని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసులు పూర్తి వైఫల్యం చెందారని ఆరోపించారు. బక్రీద్ సందర్భంగా పాతబస్తీలో ఇప్పటికే వేలాదిగా ఉన్న గోవులను అక్రమంగా తీసుకొచ్చారని, వాటిని స్వాధీనం చేసుకుని గోశాలలకు తరలించాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు జస్‌రాజ్ శ్రీమాల్, కార్యదర్శి మహేష్ ఆగర్వాల్, ఉపాధ్యక్షుడు జస్మత్ పటేల్, సంయుక్త కార్యదర్శి రిధీష్ జాగీర్దార్ మాట్లాడారు. జూన్ 7న బక్రీద్ జరగనున్నదని, ఇప్పటికే పశువుల అక్రమ రవాణ జోరుగా సాగుతుందని ఆరోపించారు. బక్రీద్ రోజున గోవధను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. గోవుల అక్రమ రవాణాపై ఇప్పటికే డీజీపీ, టాస్క్‌ఫోర్స్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశామన్నారు. పాతబస్తీలో డ్రోన్స్ ద్వారా గోవుల అక్రమ రవాణను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని ఆచరణలో పెట్టి ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచడానికి, నాణ్యమైన విద్య నందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, శిక్షణ కార్యక్రమం కోర్సు డైరెక్టర్, రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. ఐదు రోజుల పాటు ఉప్పర్‌పల్లిలో నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. రీసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించిన శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేశ్వర్, మహేశ్, రోహిణి, సంతోషీ, అనిల్ శిక్షణలో చక్కగా ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇచ్చారన్నారు.

పేట్లబురుజు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జయ



చార్మినార్, మే 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యం కోసం అధిక ప్రాధాన్యం నిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలను అందిస్తోందని.. పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి జయ అన్నారు. శనివారం పెట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రజిని రెడ్డి బదిలీ కావడంతో ఆమె స్థానంలో నిలోఫర్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న టి.జయ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణలోనే అతి పెద్దాస్పత్రి పెట్ల బురుజు ఆస్పత్రిలో గర్భిణులు ప్రతిరోజూ వందలాది మంది వస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా డాక్టర్లు అందుబాటులో ఉండి వారికి మెరుగైన చికిత్సలు అందించేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సెక్యూరిటీ సిబ్బంది సైతం రోగులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. రోగులు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఆమె తెలిపారు.

జంగమ్మెట్‌లో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్

చాంద్రాయణగుట్ట, మే 24(ఆంధ్రజ్యోతి): చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని జంగమ్మెట్ డివిజన్‌లో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఇందిరాగాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమ ఇన్‌చార్జి, మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్ ముదిరాజ్, పర్వతాల రాజేందర్, శ్యామ్‌రావు ముదిరాజ్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



● ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాం, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.రాజు, కోశాధికారి ఎస్‌కె.నజీర్‌తో పాటు ఉపాధ్యక్షులు దశరథ్, జాయింట్ సెక్రటరీ జి.పరమేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.రవీందర్‌రెడ్డి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, సాంకేతిక కార్యదర్శి జి.సులోచనను శనివారం బుద్వేల్ కుసుమ హరనాథ బాబా మందిరం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మందిరం సలహాదారులు జి.అంజయ్య గౌడ్ పాల్గొన్నారు. - రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి)

గుంతలమయంగా రోడ్లు



ఎర్రకుంటలో శ్రీశైలం రహదారిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పహాడిషరీఫ్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ జల్‌పల్లి మున్సిపాలిటీకి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు షైక్ జహంగీర్, యూసుఫ్ ఖాద్రి, తయ్యాబ్ దహని, బి.యాదగిరి, మస్నా రవికుమార్, సయ్యద్ అబ్దుల్ రౌఫ్, అబ్దుల్ బారి, షాకేర్, అంజాద్ ఖాన్, సయ్యద్ అలీ, నవాజ్‌తో కలిసి జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంట షాహీన్‌నగర్‌లో పర్యటించారు. ఎర్రకుంటలోని పెట్రోల్ పంపు నుంచి పింక్ ప్యాలెస్ వరకు దెబ్బతిన్న శ్రీశైలం రోడ్డును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్ రామ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగిన భవనంలో

తెరుచుకోని దుకాణాలు

● చిరు వ్యాపారులకు అనుతించని వైనం



అగ్నిప్రమాదం జరిగిన భవనంలో, పక్క భవనంలో నేటికీ తెరుచుకొని షాప్‌లు, మూసి ఉన్న కృష్ణ పెరల్స్ దుకాణం

చార్మినార్, మే 24(ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్‌లోని ఓ భవనంలో కొన్నిరోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాద ఘటన విదితమే. కానీ ఆ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్రధాన రహదారిపై ఉన్న ఇక్రమ్ జువెల్లర్స్ రషీద్ అండ్ సన్స్, జాఫర్ అలీ అండ్ కంపెనీ షాప్‌లు షాప్‌ల ముందు చిరు వ్యాపారం చేసే వారికీ అనుమతించక పోవడంతో షాప్‌లో పనిచేసే వారు, చిరు వ్యాపారులు షాప్‌ల యజమానులు ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం సాయంత్రం కృష్ణ పెరల్స్ భవనంలో ఉన్న మోడీ పెరల్స్ షాప్ తెరుచుకోవడంతో వియగతా షాప్‌లో పని చేసే వారు, చిరు వ్యాపారులు శుక్రవారం షాప్‌ల వద్దకు రాగ షాప్‌లు మూసి ఉండ డం చూసి యజమానులకు ఫోన్ చేయగ షాప్ తెరిచినప్పుడు చెబుతామని చెప్పడంతో వేణు దిరిగారు. అధికారులు షాప్‌లకు అనుమతించాలని అగ్ని ప్రమాదంలో ఏదైనా నష్టం జరిగిందా లేదా తెలుసుకోవడానికి షాప్‌లను తెరిచేలా అధికారులు ఆదేశించాలని స్థానికులు కోరుతున్నారు. అగ్నిప్రమాదంలో దగ్ధమైనా ఇంటిని శుక్రవారం అధికారులు పరిశీలించలేదు. షేటర్‌కు తాళం వేసి ఉంది. బయట పోలీసులు బందోబస్త్ ఉన్నారు.

రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదు



గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్, మే 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ప్రజాస్వామ్యా న్ని ఏవిధంగా ఖూనీ చేసిందో ప్రజలందరూ చూశారన్నారు. స్వయంగా మీ పార్టీ ఎమ్మెల్సీ కవిత పార్టీ స్థితిగతులపైన కేసీఆర్‌కు లేఖ రాసిన విషయాన్ని యావత్తు తెలంగాణ సమా జం గమనిస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో దొంగ మిలాఖత్ చేసుకొని సీఎంపై అబద్ధాలు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమని అన్నారు.

మైలార్‌దేవుపల్లిలో కార్పొరేటర్ పర్యటన

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి బస్తీలో శనివారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జలమండలి డీజీఎం రేణుకతో కలిసి పర్యటించారు. బస్తీలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, మంచినీటిలో డ్రైనేజీ నీరు కలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అధికారులు బస్తీల్లో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి సూపర్ వైజర్ లోక్‌నాథ్, రవి నాయక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేశాల భూపాల్‌కు సన్మానం

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నిమియుతులైన రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డినగర్ ప్రాంతానికి చెందిన దేశాల భూపాల్‌ను శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంత్యుత్సవాల కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. దేశాల భూపాల్‌ను సన్మానించిన వారిలో జయంత్యుత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ

అఫ్జల్‌గంజ్, మే 24(ఆంధ్రజ్యోతి): సామాజికవేత్త దివంగత భీమ్‌సేన జైస్వాల్ 4వ జయంతిని పురస్కరించుకొని శనివారం గౌలిగూడ రామమందిర్ వద్ద జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ నేతృత్వంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేంద్ర, డాక్టర్ అక్క జైస్వాల్, సురేశ్, నితిన్ జైస్వాల్, నర్సింగ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు అర్హులకు అందజేయాలి

గోషామహల్, మే 24 (ఆంధ్రజ్యోతి): జియాగూడ డివిజన్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ మిత్ర కృష్ణ అన్నారు. ఈమేరకు శనివారం ఆయన డీఆర్‌ఓ వెంకటాచారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

డాక్టర్ రియాజ్ సేవలు మరువలేనివి

గోషామహల్, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకుల అభిరుచి మేరకు అవసరమైన పుస్తకాలు, లైబ్రరీల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతున్న రాష్ట్ర లైబ్రరీ చైర్మన్ డాక్టర్ రియాజ్ చేస్తున్న సేవలు మరువలేనివని ఉస్మానియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ మహ్మద్ రఫీ, డాక్టర్ ఎండీ జాన్‌భాషా కొనియాడారు. శనివారం అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయంలో ఆయనను అభినందించారు. రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయం అభివృద్ధికి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించనున్నట్టు రియాజ్ తెలిపారు.

'నల్లాలకు మోటార్లు బిగిస్తే సీజ్ చేస్తాం'

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ జలమండలి పరిధిలోని ఉప్పర్‌పల్లి న్యూఫ్రెండ్స్‌కాలనీ ఫేజ్-1లో నల్లాకు బిగించిన మోటారును శనివారం జలమండలి మేనేజర్ శ్రావ్యారెడ్డి సీజ్ చేశారు. కొన్ని రోజులుగా నల్లాలకు మోటార్లు బిగించవద్దని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అయినా కొన్ని చోట్ల నల్లాలకు మోటార్లు బిగిస్తూనే ఉన్నారు. శనివారం తనిఖీలు నిర్వహించిన జలమండలి మేనేజర్ శ్రావ్యారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ జావీద్, మహేశ్ సింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పెంటారెడ్డి, మల్లేశ్, కేశవ్ ఓ మోటారును సీజ్ చేశారు.

విత్తన మేళా వాయిదా

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించాల్సిన విత్తన మేళా వాయిదా పడిందని ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్ఆర్ ధాన్ 75 విత్తనాల అమ్మకం రద్దు చేయడం జరిగిందని, రైతులకు కలిగిన ఈ అసౌకర్యానికి తీవ్రంగా చింతిస్తున్నామన్నారు.



జియాగూడలోని రంగనాథ స్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో రథోత్సవానికి ముందు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, ఏసీపీ కిరణ్‌కుమార్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీజేపీ నాయకుడు ఉమా మహేందర్, ఆలయ ప్రతినిధి శేషాచారి, ట్రస్టీ ఎస్టీ చారి, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ బట్టాచార్యులు, బద్రినాథ్ చార్యులు పాల్గొన్నారు. - గోషామహల్, మే 24 (ఆంధ్రజ్యోతి)

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేత

పహాడీషరీఫ్, మే 24 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభివృద్ధి కోసం పాటు పడేది కాంగ్రెస్ పార్టీయేనని మామిడిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు లాల్ సతీష్ గౌడ్, క్లోం నరేష్ గౌడ్ అన్నారు. ఈమేరకు వార్డు ఆఫీసర్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ విజయ్ గౌడ్, సభ్యులు ఎల్.రితికా, ఇన్సంపల్లి రాజు మమత, పవన్ కుమార్, మంఖలా భాస్కర్ బేబీతో కలిసి వారు శుక్రవారం మామిడిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రం లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపాలిటీలో సొంత స్థలం ఉండి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు విడతలుగా అందిస్తోందని తెలిపారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత విద్య, వసతి

బర్కత్‌పుర, మే 24(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నట్టు గ్లోబల్ బ్రాహ్మణ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిప్రసాద్‌శర్మ తెలిపారు. 95శాతం పైగా మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు కళాశాల ఫీజు తామే చెల్లిస్తామని, రాష్ట్రంలో ఎక్కడ చదివినా వారిని చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. తెల్లరేషన్‌కార్డు తప్పనిసరిగ్గా ఉండాలని తెలిపారు. శనివారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 95శాతం కంటే తక్కువ మార్కులు వచ్చిన బ్రాహ్మణ విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ, ఎల్ఎల్‌బి, ఫార్మసీ కోర్సులలో చేర్పించి చదివిస్తామని తెలిపారు. నగరంలోని తులసీవనం బ్రాహ్మణ బాలికల హస్టల్, వశిష్ట బ్రాహ్మణ బాలుర హాస్టల్స్‌లో వసతి కల్పిస్తామని, ఈ హాస్టల్స్‌లో ఉండి కళాశాలకు వెళ్లాలన్నారు. బ్రాహ్మణ పద్ధతులు అన్ని నేర్పిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9701609689 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

29న తైబజార్ వేలం

పహాడీషరీఫ్, మే 24(ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2025- 26 సంవత్సరానికి గాను తైబజార్ రుసుం వసూలు చేసుకునే కాంట్రాక్టు కోసం ఈనెల 29న వేలం నిర్వహించనున్నట్టు కమిషనర్ బి.వెంకట్రామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు కమిషనర్ పేరుపై రూ. 1లక్ష డీడీ తీసి ఈనెల 29న మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xSEcUjHలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన వ్యక్తిని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

నార్సింగ్, మే 24(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగతనాలు చేస్తూ తప్పించుకొని పరిగెడుతున్న దొంగను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతను గాయపడిన ఘటన హైదర్షాకోట్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఓ యువకుడు పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు దొంగతనాలు చేసి పారిపోతుండగా, కొంతమంది వెంబడించారు. దీంతో అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతడి జేబులో కొన్ని సెల్‌ఫోన్లు ఉండడంతో దొంగతనానికి గురైన వారు కాల్ చేయగా, అతని జేబులో రింగ్ అయ్యాయి. ఈ ఫోన్‌లు తమవేనని గుర్తించిన స్థానికులు ఆ దొంగను నార్సింగ్ పోలీసులకు అప్పగించారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

కార్వాన్, మే 24 (ఆంధ్రజ్యోతి): టోలిచౌకి, గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిల్లో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టోలిచౌకి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఒంటరిగా ఉన్న వారిని టార్గెట్‌గా చేసుకుంటూ ముగ్గురు నిందితులు ప్రయాణికులను భయపెట్టి సెల్‌ఫోన్‌లతో పాటు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్టు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తులో ఉంది.

బస్సుల్లో దోచుకుంటున్న కిలాడీ లేడీ..

కార్వాన్, మే 24 (ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ప్రయాణం చేస్తూ, తోటివారిని మభ్యపెట్టి వారి నుంచి నగదు, నగలు దోచుకుంటున్న ఓ కిలాడీ లేడీ దొంగను మెహిదీపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మెహిదీపట్నం నుంచి వికారాబాద్ వెళ్లేందుకు హైమ అనే మహిళ బస్సు ఎక్కింది. సంజన అనే లేడీ హైమను మభ్యపెట్టి బ్యాగ్‌లో ఉన్న 45గ్రాముల బంగారం దొంగిలించింది. దీంతో హైమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సంజన నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకొని హైమకు అందజేశారు. సంజనపై కేసు నమోదు చేసి న్యాయస్థానికి తరలించారు.

వాహనాలను దొంగిలిస్తున్న వ్యక్తి..

కార్వాన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని లంగర్‌హౌజ్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖాజా తన ద్విచక్రవాహనం కనిపించడం లేదని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు బాపూఘాట్ రామాలయం వద్ద గోపాల్ అనే యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో విచారించగా తాను బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నానని విచారణలో తెలిపాడు. అతని నుంచి పోలీసులు ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గోపాల్‌పై కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ డాక్టర్ మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై పిల్లర్ నెంబర్ 320 వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గద్వాలకు చెందిన డాక్టర్ కె.రాజశేఖర్ తన మిత్రుడు షాద్‌నగర్ దూసకల్‌కు చెందిన శేఖర్‌తో కలిసి బైక్‌పై నగరం వైపు వస్తున్నారు. ఆరాంఘర్ వద్ద పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పైకి ద్విచక్ర వాహనాల అనుమతి లేదు. అయితే అది తెలియని డాక్టర్ రాజశేఖర్ తన బైక్‌ను ఎక్స్‌ప్రెస్ వే పైకి తీసుకెళ్లాడు. వేగంగా వెళ్తూ పిల్లర్ నెంబర్ 320పైన డివైడర్‌ను ఢీ కొని అక్కడిక్కడే మృతి చెందాడు. వెనుకాల కూర్చున్న శేఖర్‌కు చేతికి గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడు డాక్టర్ రాజశేఖర్ అన్న క్రిష్ణ ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2 నుంచి నాణ్యమైన విత్తనాల పంపిణీ

● సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయనుంది. జూన్ 2న ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరై తన చేతుల మీదుగా రైతులకు అందజేయనున్నారు. ఆ మేరకు ఈ విషయాన్ని వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రకటనలో తెలిపారు. ప్రతీరెవెన్యూ గ్రామానికి మూడు నుంచి ఐదు మంది అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తన సంచుల పంపిణీ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమవుతోంది. 3 నుంచి రైతులకు వివిధ పంటల విత్తనాలను అందజేస్తారు. వరి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం, చిరుధాన్యాల పంటలకు సంబంధించిన సుమారు 8500 క్వింటాళ్లు సిద్ధంగా ఉంచారు.

సంప్రదించాల్సిన నంబర్లు

రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం 94402-25385, విత్తన పరిశోధన సాంకేతిక కేంద్రం 86399-75840, వరి, జొన్న, కంది, ఆముదం విత్తనాలకు 97050-69580, కంపాసాగర్ 94923-96001, తాండూర్ 98850-40499, వరంగల్ ప్రాంతీయ కేంద్రం 90107-56465, మధిర ప్రాంతీయ కేంద్రం 96522-04006, తోర్నాల 98498-22270, జగిత్యాల 97015-92326 నంబర్‌లో సంప్రదించాలని అల్దాస్ జానయ్య తెలిపారు.

రేపు స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సు

అమీర్‌పేట, మే 24 (ఆంధ్రజ్యోతి): యువతలో భారతీయ సంప్రదాయ సంగీతం, సంస్కృతిని ప్రోత్సహించే స్పిక్ మైకే 10వ అంతర్జాతీయ సదస్సు ఏడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈనెల 26 నుంచి జూన్ 1 వరకు జరగనున్న కార్యక్రమ వివరాలను శనివారం అమీర్‌పేటలోని హోటల్ మారీ గోల్డ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కన్వీనర్లు కోనా లక్ష్మీవల్లి, కళాపూర్ణ నల్లతో కలిసి స్పిక్ మైకే వ్యవస్థాపకుడు పద్మశ్రీ డాక్టర్ కిరణ్ సేట్ ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, సంస్థ జాతీయ చైర్మన్ ఆర్. ఎం.తివారి వెల్లడించారు. ఈ సదస్సులో పద్మ విభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా(హిందుస్థాని ఫ్లూట్), పద్మభూషణ్ బేగం పర్వీన్ సుల్తానా (హిందుస్థాని వోకల్), పద్మభూషణ్ డాక్టర్ ఎన్. రాజం (హిందుస్థాని వయోలిన్) వంటి దాదాపు 20 మంది ప్రముఖులు ప్రత్యక్ష సంగీత కళా ప్రదర్శనలు ఇస్తారన్నారు.

'రైతు ముంగిట్లో'కు స్పందన సూపర్

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై రైతాంగంలో ఎటువంటి అసంతృప్తి లేదని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాల కారణంగా వారిల్లో ఆందోళన వ్యక్తమవుతున్నదన్నారు. మూడు వారాలుగా రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సాగుతున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంపై శనివారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జానయ్య ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలకు రైతాంగం నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. వ్యవసాయ అంశాలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం ఇవ్వాల్సిందిగా రైతులు కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వర్షాకాలం.. 'మెట్రో' నీడన!

● వేగవంతమైన ప్రయాణానికి కేరాఫ్.. గంటలోపే గమ్యస్థానాలకు
● పెద్దఎత్తున వినియోగించుకుంటున్న నగరవాసులు ● వానొస్తే స్టేషన్ల కిటకిట



● మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న యశ్వంత్ మూసాపేట్‌లో నివాసముంటాడు. రోజూ తన కారులో ఆఫీస్‌కు వెళ్లి వస్తుంటాడు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రోడ్లపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నుంచి ఆఫీస్ వరకు ఉన్న 15 కిలోమీటర్ల దూరం. దీంతో పది రోజులుగా మూసాపేట్ నుంచి మాదాపూర్‌కు మెట్రోలో వెళ్తున్నాడు. ఇంటి నుంచి బైక్‌పై మూసాపేటకు వచ్చి, అక్కడి నుంచి ఇందులో ప్రయాణిస్తున్నారు.

● ఎర్రమంజిల్‌కు చెందిన రైల్వే ఉద్యోగి రాజేందర్ తార్నాకలోని రైల్వే కార్యాలయంలో పనిచేస్తుంటాడు. రోజూ డ్యూటీకి బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. ఇంటి నుంచి బయలుదేరినప్పుడు, తిరిగివచ్చేటప్పుడు గంటలోగా ప్రయాణాన్ని ముగిస్తుంటాడు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మెట్రోలో వెళ్తున్నాడు. ఈ ప్రయాణమే ఉత్తమం అని చెబుతున్నారు.

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరవాసులకు మెట్రో నిమిషాల వ్యవధిలోనే గమ్యస్థానాలకు చేర్చుతోంది. దీంతో ఇటు రోడ్లపై వాహనాల రద్దీ తగ్గుతుండడంతో పాటు కాలుష్య నియంత్రణ జరుగుతోంది. హైదరాబాద్ నగర రవాణాలో ఇది అతికీలకంగా మారాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉదయం ఆరు మొదలవుతున్న రైళ్లు.. రాత్రి 12.15 గంటల వరకు సేవలందిస్తున్నాయి.

ఈ సీజన్‌లో ఉపశమనం..

హైదరాబాద్ పేరు చెబితేనే బాబోయ్ ట్రాఫిక్ అంటూ చాలామంది హడలిపోతుంటారు. తెల్లవారుజాము 4 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు నగరంలోని వాహనాలు తిరుగుతుంటాయి. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలపాటు నడుస్తాయి. దీంతో కార్లు, బైకులపై వెళ్తున్న వారు ట్రాఫిక్‌తో సతమతమవుతుంటారు. ఇక.. వర్షాలు కురిస్తే వాహనదారుల బాధలు వర్ణనాతీతం. రోడ్లపై పెద్ద ఎత్తున వరద ఉన్న కారణంగా వాహనాలు నిలిపోతాయి. దీంతో కిలోమీటరు దూరానికి కూడా అరగంటకు పైగా ప్రయాణించాల్సిన పరిస్థితి. ఈ సమయంలో మెట్రో ప్రయాణించడం శ్రేయస్కరమని పలువురు పేర్కొంటున్నారు.

రూ. 5.3 కోట్ల ఇంధనం ఆదా

2017 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మెట్రో ద్వారా నగరంలో సుమారు 5.3 కోట్ల ఇంధనం ఆదా అయినట్లు మెట్రో వర్గాలు వెల్లడించాయి. దీంతో 140 మిలియన్ కిలోగ్రాముల కర్బన ఉద్గారాలు తగ్గాయంటున్నాయి. వర్షాకాలంలో మెట్రోను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రోడ్లపై నిలిచిపోతున్న ట్రాఫిక్ నుంచి ఉప శమనం పొందడంతోపాటు రవాణా వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు దోహ దపడొచ్చని పేర్కొంటున్నారు. మెట్రోలో ప్రస్తుతం రోజుకు 4.60 లక్షల నుంచి 4.80 లక్షల మంది ప్రయాణిస్తున్నారు.

ఉపాధితోనే సాధికారత

● సత్యానగర్, రత్నానగర్ బస్తీలను తీర్చిదిద్దుతాం ● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నల్లకుంటలో పాదయాత్ర చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ అమృత తదితరులు

నల్లకుంట, మే 24 (ఆంధ్రజ్యోతి) : స్థానికులు ఉపాధి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులకు కుట్టు మిషన్లు, వివిధ ఉపాధి రంగాలలో ఉచిత శిక్షణ ఇవ్వడానికి సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో 14 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం నల్లకుంట డివిజన్ సత్యానగర్, రత్నానగర్ బస్తీలలో కార్పొరేటర్ యాకర అమృత, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. బర్కత్‌పుర బీజేపీ నగర కార్యాలయం మూడవ అంతస్తులో అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తా వద్ద ఉపాధి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పొందుతూ ఆర్థికంగా వృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. సత్యానగర్, రత్నానగర్ బస్తీలను ఆధునీకరిస్తున్నామన్నారు. ప్రజలెదుర్కొంటున్న అన్ని సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ఏడు నియోజకవర్గాలతో పాటు అంబర్‌పేట నియోజకవర్గంలోని అయిదు మున్సిపల్ డివిజన్లలో ఉన్న మురికివాడల ప్రాంతాలను పూర్తిగా ఆధునీకరిస్తున్నామని, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సత్యానగర్, రత్నానగర్‌లోని కమ్యూనిటీహాల్స్ పూర్తిగా ఆధునీకరించామని పేర్కొన్నారు. అలీకేఫ్ చౌరస్తా వద్ద మూసీ నదిపై కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను ఆయన ఆదేశించారు. అనంతరం రత్నానగర్‌లోని అభయాంజనేయస్వామి, అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, జలమండలి జీఎం రామకృష్ణ, ఈఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ భావన తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌హెచ్ విద్యార్థికి డాక్టరేట్



విద్యార్థి సాయిబాబుతో కేఎల్‌హెచ్ క్యాంపస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థి వీ సాయిబాబు డాక్టరేట్‌కు అర్హత సాధించారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అజీజ్‌నగర్ క్యాంపస్ విద్యార్థి అయిన అతను.. నిద్ర సంబంధించిన రుగ్మతపై పరిశోధన చేశారు. కేఎల్‌హెచ్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆకెళ్ల రామకృష్ణ మార్గదర్శనంలో అందుకు సంబంధించిన సిద్ధాంత వ్యాసాలు సమర్పించారు. ఇవి పీహెచ్‌డీ పట్టాలు సాధించడానికి అర్హత పొందాయి. ఈ సందర్భంగా సాయిబాబును కేఎల్ వర్సిటీ వీసీ, ఆర్‌అండ్‌డీ డీన్ ప్రొఫెసర్ బీటీపీ మాధవ్, కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆకెళ్ల రామకృష్ణ, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ గౌతమ్‌తోపాటు ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



కవలలతో కిమ్స్ వైద్య బృందం

చత్తీస్‌గఢ్ కవలలకు పునర్జన్మ

వచ్చేటప్పుడు ఇన్ఫెక్షన్ తీవ్రతరం

కిమ్స్‌లో నెల రోజుల చికిత్సతో కోలుకున్న శిశువులు

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌గఢ్ కవలలకు కిమ్స్ కడల్స్ పునర్జన్మ ఇచ్చింది. విషయానికొస్తే.. చత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌కు చెందిన ఓ మహిళకు నెలలు నిండకముందే కాన్పు జరిగింది. కాగా ఇద్దరు మగశిశువులు జన్మించారు. వరుసగా 1.4, 1.5 కిలోల బరువే ఉన్నారు. ఆపై ఇన్ఫెక్షన్ల కారణంగా ప్రాణాపాయ స్థితి ఏర్పడడంతో ప్రత్యేక విమానంలో గత నెల రెండో వారంలో హైదరాబాద్‌లోని కిమ్స్ కడల్స్ కొండాపూర్ ఆస్పత్రికి తరలించారు. నెల రోజుల పాటు రకాల చికిత్స చేసిన తర్వాత ఇన్ఫెక్షన్లు పూర్తిగా తగ్గాయని, డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి నియోనాటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్, ఎన్ఐసీయూ అధిపతి డాక్టర్ అపర్ణ తెలిపారు. కవల్ని ప్రత్యేక విమానంలో తీసుకురావడం ఇదే మొదటిసాని వివరించారు. వైద్యులు రాజశేఖర్, వంశీ, అరవింద, ప్రణీత, సునీతతో పాటు నర్సుల బృందం చికిత్స అందించినట్లు చెప్పారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మానసిక ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

మానసిక వ్యాధి లాంటిది 'స్కిజోఫినియా'

ఎర్రగడ్డ, మే 24 (ఆంధ్రజ్యోతి): స్కిజోఫినియా అనేది దీర్ఘకాలిక పునరావృత సైకోసిస్ వర్గీకరించబడిన మెదడు యొక్క రుగ్మత అని ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత అన్నారు. శనివారం ప్రపంచ స్కిజోఫినియా అవగాహన దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో సదస్సు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కిజోఫినియా అనేది ఒక రకంగా మానసిక వ్యాధి లాంటిదని అన్నారు. ముఖ్యంగా ఒక వ్యక్తి వాస్తవికతకు ఊహకు మధ్య ఉన్న తేడాయే స్కిజోఫినియా అని అన్నారు. అనంతరం ఈ సందర్భంగా కిమ్స్, యశోద హాస్పిటల్స్ నుంచి వచ్చిన వైద్య విద్యార్థులు, నర్సులు స్కిజోఫినియా వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పలు రకాల స్కిట్లను ప్రదర్శించారు. ఇన్‌చార్జి ప్రొఫెసర్లు డాక్టర్ వివాస్వన్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ ఫణికాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లు ఉమేష్, రఘువీర్, మధులిక, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'జయభేరి'పై చర్యలు తీసుకోండి

● ప్రభుత్వ స్థలం.. అక్రమ వినియోగం
● నిబంధనలు ఉల్లంఘించిందన్న అసోసియేషన్

హైదరాబాద్ సిటీ, మే24 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు పక్కన నార్సింగిలో ప్రభుత్వ స్థలాన్ని జయభేరి నిర్మాణ సంస్థ అక్రమంగా వినియోగిస్తుందని చర్యలు తీసుకోవాలని జయభేరి టెంపుల్ ట్రీ రెసిడెంట్స్ అసోసియేషన్ తెలిపింది. ఎలాంటి నిబంధనలు పాటించకపోవడంతో తమ మౌలిక సదుపాయాలు దెబ్బతింటున్నాయని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించింది. సీఎంతో పాటు రంగారెడ్డి కలెక్టర్‌కు, హైడ్రా కమిషనర్ తదితరులకు ఫిర్యాదు చేసినట్లు శనివారం ప్రకటనలో పేర్కొంది. తమ నివాసాలకు తూర్పు భాగంలో సమ్మిట్ పేరుతో ప్రాజెక్టును చేపడుతూ ఎలాంటి నిర్మాణ నిబంధనలు పాటించడం లేదని పేర్కొంది. ప్రభుత్వ స్థలంలోకి ఏవిధంగా అక్రమంగా చొచ్చుకొస్తారని ప్రశ్నించింది.

ప్రణవభక్త సమాజం అందరికీ ఆదర్శం

● సహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మ



నాగఫణి శర్మను సన్మానిస్తున్న ప్రణవభక్త సమాజం సభ్యులు

రాజేంద్రనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): వందేళ్ల నుంచి నిరాటకంగా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం అందరికీ మార్గదర్శకంగా నిలిచిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో 105 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏక శత పంచోత్తర మహోత్సవాలలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలతో భక్తులను అలరించారు. ప్రణవం అంటే ఓంకారమని, ఓంకారంతోనే సృష్టి అంతా ఇమిడి ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక చైతన్య కార్యక్రమాలను చేపడుతున్న ప్రణవభక్త సమాజం ఎప్పటికీ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాడుగుల నాగఫణి శర్మను సభ్యులు సత్కరించారు. సమాజం అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి హరినాథ్, కోశాధికారి హరినాథ్, ముఖ్య సలహదారులు మల్లారెడ్డి, సుభాష్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, మొండ్ర కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో తేనెటీగల పెంపకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సౌమ్యమిశ్రా, మహేష్ ఎం.భగవత్ తదితరులు

క్రమశిక్షణకు తేనెటీగలు ఆదర్శం

● డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా

కుషాయిగూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): తేనెటీగలను క్రమశిక్షణ, సమష్టి కృషి, బాధ్యత అనే పదాలకు పర్యాయంగా చెప్పుకోవచ్చునని తెలంగాణ జైళ్ల శాఖ/కరెక్షనల్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. శనివారం చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం(ఓపెన్ ఎయిర్ జైలు)లో తేనెటీగల పెంపకం, తేనెపట్టు యంత్రాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షా కాలాన్ని పూర్తి చేసుకొని విడుదలైన ఖైదీల పునరావాసానికి, సమాజంలో బాధ్యత గల పౌరుడిగా బతికేందుకు వీలుగా పలు ఉపాధి శిక్షణా కోర్సులను ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఇప్పటికే 'మై నేషన్' పేరిట విక్రయిస్తున్న జైలు ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోందని గుర్తు చేశారు. ఓపెన్ ఎయిర్ జైలు విస్తరించిన వందలాది ఎకరాల్లో ఉన్న పూల మొక్కలు, నర్సరీలు కూడా తేనెటీగల పెంపకానికి అనువుగా ఉన్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ ఎం.భగవత్ మాట్లాడుతూ జైళ్లశాఖ తేనెటీగల పెంపకం పథకాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

● పోలీసుల అదుపులో ఇద్దరు
● 1.30 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఒడిశా భువనేశ్వర్‌కు చెందిన బిస్వజిత్ మాలిక్, మీను మాలిక్‌లు శేరిలింగంపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. అధిక సంపాదన కోసం సొంత రాష్ట్రం నుంచి సరుకు తెచ్చి ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నారు. ఈ దందాపై పక్కా సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్ బృంద సభ్యులు వీరు ఉంటున్న ఇంటిపై దాడి చేశారు. వారిద్దరిని అరెస్ట్ చేసి, 1.30 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

28న అథ్లెటిక్స్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ట్రయల్స్‌ను ఈనెల 28న నిర్వహించనున్నారు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఉదయం 6 గంటల నుంచి ఈ పోటీలు జరగనున్నాయి. అండర్-8, 10, 12 విభాగాల్లో ట్రయల్స్ జరగనున్నాయి. 60, 200 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, జావెలిన్ త్రోలో ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు ఈ నంబర్‌కు 83747-15899 ఫోన్ చేసి తెలుసుకోచ్చని ప్రతినిధులు తెలిపారు.

ఆకట్టుకుంటున్న 'జో చాహే మ్యాంగో'




వేసవి సీజన్ పురస్కరించుకుని సైబరాబాద్.. ఓ మాల్‌లో 'జో చాహే మ్యాంగో' ఉత్సవం నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవం శనివారం రెండోరోజుకు చేరింది. థింగ్స్ టు డూ హైదరాబాద్‌తో కలిసి నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో భాగంగా మామిడి పండ్ల వేడుకను నిర్వహిస్తున్నామని ప్రతినిధులు వెల్లడించారు. ప్రజల నుంచి విశేషంగా ఆదరణ లభిస్తుంది.
- హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి)



హానర్ హోమ్స్‌కు మిస్ వరల్డ్ భామలు

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హానర్ హోమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పలు దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీదారులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హానర్ హోమ్స్ వ్యవస్థాపకులు, డైరెక్టర్లు ఎస్.రామమౌలి, పి.వేంకటేశ్వర్లు, ఎం.బాలుచౌదరి, వై.స్వప్న కుమార్ అందాల భామలకు స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిస్ వరల్డ్ పోటీలు రాష్ట్రానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు స్పాన్సర్ చేయడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ పేలుళ్లకు కుట్ర!

» సిరాజ్, సమీర్‌లపై రెండో రోజు విచారణ

విజయనగరం/క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌ల విచారణ రెండో రోజు శనివారం కొనసాగింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పలు అభియోగాలపై ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు స్థానిక పోలీసులతో కలిసి దర్యాప్తును వేగవంతం చేశారు. సిరాజ్, సమీర్‌ల ద్వారా విజయనగరం, పలు ఇతర రాష్ట్రాల్లో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు, ఐసిస్ లేదా ఇతర ఉగ్ర సంస్థలు వీరిని ప్రేరేపించినట్లు విచారణలో నిర్ధారణకు వచ్చారని సమాచారం. అధికారులు ప్రధానంగా ఆర్థిక లావాదేవీలపై అన్ని కోణాల్లో ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. రెండో రోజు దర్యాప్తులో భాగంగా సిరాజ్ కుటుంబం, అతని స్నేహితుల గురించి ఆరా తీశారు. అహిం గ్రూపులో ఎంతమంది సభ్యులు ఉన్నారు? వారు ఏయే దేశాలు, రాష్ట్రాల్లో ఉన్నారు? అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలున్నాయా? అని కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. సిరాజ్ సిగ్నల్ యాప్‌లో క్రియేట్ చేసిన ఐదు గ్రూపులను గుర్తించినట్లు సమాచారం.

- సిరాజ్ గత ఏడాది నవంబరు 22న మహారాష్ట్రలోని ముంబైకి వెళ్లినప్పుడు 10 మందితో కలిసి హక్ ఇండియాలో లైవ్ సెషన్‌కు హాజరైనట్లు విచారణలో తెలిసింది. అక్కడ ఎవరెవరిని కలిశాడు? అక్కడి నుంచి ప్లాన్, పేలుడు సామగ్రి తీసుకువచ్చాడా? అనే దానిపైనా దర్యాప్తు అధికారులు కూపీ లాగుతున్నారు.
- బిహార్‌కు చెందిన అబూతాలెం అలియాస్ అబూముసబ్ సూచనలతో సిరాజ్, సమీర్‌లు సిగ్నల్ యాప్ ద్వారా జిహాదీ కార్యక్రమాలను తెలుసుకునేవారు. ఇందుకు సంబంధించిన పోస్టులు పెడుతూ ఇతరుల ద్వారా మరిన్ని విషయాలను తెలుసుకుని అటువైపు ఆకర్షితులైనట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. విజయనగరంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఉగ్రసానుభూతిపరుల ద్వారా పేలుళ్లకు కుట్రలు పన్నినట్లు విచారణలో నిర్ధారణకు వచ్చారని సమాచారం.
- హైదరాబాద్ గోషామహల్ ఎమ్మెల్యేపై ద్వేషం ఉండేదని, అతను పెట్టిన వీడియోలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టినట్లు సిరాజ్ అధికారులకు తెలిపినట్లు సమాచారం. ఈ పోస్టులను చూసిన విశాఖలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి మెచ్చుకున్నట్లు విచారణలో చెప్పినట్లు తెలిసింది.
- సిరాజ్, సమీర్‌ల ద్వారా విజయనగరం, పలు ఇతర రాష్ట్రాల్లో భారీ పేలుళ్లు జరపాలని, ఐసిస్ లేదా ఇతర ఉగ్రవాద సంస్థలు వీరిని ప్రేరేపించినట్లు తెలుస్తోంది. విచారణలో అధికారులు ఎక్కువగా ఆర్థిక లావాదేవీలు, ఉగ్ర సంబంధాలపై దృష్టి పెట్టినట్లు తెలిసింది.

ఘనంగా మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు గాంధీ భవన్‌లో శనివారం ఘనంగా జరిగాయి. మహిళా కాంగ్రెస్, సేవాదళ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తున్నారని, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని మంత్రి కొనియాడారు.

చేనేత వస్త్రాల్లో మరింత అందంగా..

» పోచంపల్లి, గద్వాల, గొల్లభామ చీరలతో అందాల భామల ర్యాంప్ వాక్
» తర్వాత ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలతోనూ..
» ఘనంగా మిస్ వరల్డ్ ఫ్యాషన్ ఫినాలే
» ఆసియా-ఓషియానా విజేతగా నందిని



ర్యాంప్ వాక్ చేస్తున్న సుందరీమణులు

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ వేదికపై తెలంగాణ చేనేత వస్త్రాలు తళుక్కున మెరిశాయి. శనివారం ట్రైడెంట్ హోటల్‌లో జరిగిన వరల్డ్ ఫ్యాషన్ ఫినాలేలో ప్రపంచ సుందరి పోటీదారులంతా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన పోచంపల్లి, గద్వాల్ చేనేత వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. సంప్రదాయబద్ధమైన దుస్తుల్లో అలరించారు. అమెరికా, కరేబియన్ దేశాల సుందరీమణులు చేనేత వస్త్రాలు ధరించి.. యూరోప్, ఏషియా, ఓషియానా అందగత్తెలు గొల్లభామ చేనేత చీరలతో అలరించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా, ఈ ప్రాంతానికే పరిమితమైన డిజైన్లతో ఈ వస్త్రాలు, చీరలను రూపొందించడం గమనార్హం. మిస్ ఇండియా నందిని గుప్తా ఎరుపు రంగు పటోలా లెహంగాలో తళుక్కుమన్నారు. తెలంగాణ చేనేత వస్త్రాలను ప్రపంచ సుందరి పోటీదారుల కోసం డిజైన్ చేయడం ఆనందంగా, గర్వంగా ఉందని డిజైనర్ అర్చనా కొచ్చారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో తెలంగాణ చేనేత చీరలు, ఇతర వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి దక్కుతుందని తెలిపారు. ఇక ఫ్యాషన్ ఫినాలే న్యాయనిర్ణేతలు, ఆహూతులు తెలంగాణ సంప్రదాయ డిజైన్లను చూసి ప్రశంసలు కురిపించారు. ప్రపంచ దేశాల సుందరీమణులు స్థానిక చేనేత వస్త్రాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించటం.. ఆ డిజైన్లకు, తయారీదారులకు మంచి గుర్తింపును, మార్కెటింగ్ అవకాశాలను ఇస్తుందని చెప్పారు. తెలంగాణ చేనేత వస్త్రాలతో సందడి చేసిన అనంతరం.. ప్రపంచ ప్రఖ్యాత డిజైనర్లు రూపొందించిన ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలతో అందాల భామలు ర్యాంప్ వాక్ చేశారు. తెలంగాణ చేనేత వస్త్రాల కార్యక్రమానికి సంబంధించి.. ఏషియా-ఓషియానా విభాగంలో టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను భారత సుందరి నందినీ గుప్తా సాధించారు. యూరప్ విభాగంలో ఐర్లాండ్, అమెరికన్ విభాగంలో మార్టేనికా, ఆఫ్రికన్ విభాగంలో నమీబియా అందగత్తెలు విజేతగా నిలిచారు.



రాంప్‌వాక్‌లో నాలుగు విభాగాల విజేతలు



ఆసియా-ఓషియానా విజేతగా నిలిచిన నందిని గుప్తా

అందాల పోటీల్లో వేశ్యలా..

» నన్ను అలాగే చూసినట్టు అనిపించింది
» మధ్య వయసు పురుష స్పాన్సర్లతో కలివిడిగా ఉండాలన్నారు
» ప్రదర్శనలో కోతుల్లా కూర్చోవాల్సి వచ్చింది
» మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ఆరోపణలు
» మిల్లా మాగీ వ్యాఖ్యలు నిరాధారం
» మిస్ వరల్డ్ సంస్థ సీఈఓ జూలియా మోర్లే

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ సుందరి పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ సంచలన ఆరోపణలు చేశారు. మిస్ వరల్డ్ పోటీలు గతంలోలాగా కాకుండా భిన్నంగా ఉంటాయని అనుకున్నానని.. కానీ కోతుల ప్రదర్శనలా కూర్చోవాల్సి వచ్చిందని చెప్పారు. పోటీలకు స్పాన్సర్ చేస్తున్న మధ్య వయసు పురుషులతో కలివిడిగా మెలగాలని, వారితో కూర్చొని మాట్లాడాలని పోటీల నిర్వాహకులు ఒత్తిడి తెచ్చారని.. తనను వేశ్యలా చూస్తున్నట్టు అనిపించిందని వ్యాఖ్యానించారు. అందుకే మిస్ వరల్డ్ పోటీ నుంచి తప్పుకొన్నానని పేర్కొన్నారు. బ్రిటన్‌కు చెందిన 'ది సన్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ ఆరోపణలు చేశారు. "నిజానికి నేను మంచి చేయాలని, మార్పు తీసుకురావాలని పోటీల్లో పాల్గొనడానికి వెళ్లాను. రొటీన్‌కు కాస్త భిన్నంగా ఉండాలనుకున్నాను. కానీ ఇక్కడ అలాంటిది జరగలేదు. మేం ప్రదర్శనలో కోతుల్లా కూర్చోవాల్సి వచ్చింది. ఈ పోటీ ఇంకా పాతకాలంలోనే ఉండిపోయింది. నైతికంగా ఇలాంటి వాటిలో నేను భాగస్వామ్యం కాలేను. నేను వినోదాన్ని పంచడానికి రాలేదు. పోటీదారులంతా 24 గంటల పాటు మేకప్‌లో ఉండాలని, రోజంతా బాల్ గౌన్‌లను ధరించే ఉండాలని నిర్వాహకులు చెప్పారు. ఉదయం అల్పాహారం సమయంలోనూ అలాగే ఉండాలన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు స్పాన్సర్ చేసిన మధ్య వయసు పురుషులకు కృతజ్ఞత చూపాలని, వారితో కలివిడిగా ఉండాలని చెప్పారు. ఒక్కో టేబుల్ వద్ద ఆరుగురు అతిథులతో ఇద్దరు చొప్పున పోటీదారులను కూర్చోబెట్టారు. గంటలకు గంటలు వారిని అలరిస్తూ కూర్చోవాలి. ఇలా చేయడాన్ని నేను నమ్మలేకపోయాను. నేను వారిని అలరించడానికి ఇక్కడికి రాలేదు. ముమ్మాటికీ అది తప్పుడు విధానం. నన్ను ఒక వేశ్యలా చూస్తున్నట్టు అనిపించింది. 'బ్యూటీ విత్ పర్పస్' కింద నేను ఎంచుకున్న అంశాన్ని వివరించేందుకు ప్రయత్నించాను. కానీ టేబుల్ వద్ద ఉన్న పురుషులెవరూ పట్టించుకోలేదు. ఏవో సరదా మాటలు మాట్లాడుతూ ఉన్నారు. మిస్ వరల్డ్ అధికారుల్లో ఒకరు నేను చెబుతుంటే విసిగిస్తున్నానని (బోరింగ్) అన్నారు. చాలా అగౌరవంగా అనిపించింది. 'బ్యూటీ విత్ పర్పస్' అన్న భావనే లేకుండా పోయింది. మిస్ వరల్డ్ పోటీలు మారాల్సి ఉంది" అని మిల్లా మాగీ పేర్కొన్నారు. ఆమె ఈ నెల 16వ తేదీనే పోటీల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించి, ఇంగ్లండ్‌కు వెళ్లిపోయారు. 74 ఏళ్ల మిస్ వరల్డ్ పోటీల చరిత్రలో ఇలా మిస్ ఇంగ్లండ్ తప్పుకోవడం ఇదే మొదటిసారి.

తల్లి ఆరోగ్యం బాగోలేదని వెళ్లిపోయారు

మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలను మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్, సీఈఓ జూలియా మోర్లే ఖండించారు. తన తల్లి, కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగోలేదని, పోటీల నుంచి విరమించుకుని వెళ్లిపోతానని మిల్లా మాగీ కోరారని చెప్పారు. ఆమె కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా పరిగణించి.. వెంటనే ఆమెను ఇంగ్లండ్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు చేశామని తెలిపారు. మిల్లా మాగీ తప్పుకొన్నాక మిస్ ఇంగ్లండ్ రన్నరప్ షార్లెట్ గ్రాంట్ ఆ దేశం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకొచ్చారని.. ఆమె బుధవారమే భారత్‌కు చేరుకున్నారని చెప్పారు. కానీ మిల్లా మాగీ వ్యాఖ్యలు, దానిపై ప్రచురితమైన కథనాలు నిరాధారమని తప్పుపట్టారు. పోటీల ప్రారంభ సమయంలో మిల్లా మాగీ.. మిస్ వరల్డ్ పోటీలపై ఆనందాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేసిన వీడియో క్లిప్‌లను జూలియా మోర్లే విడుదల చేశారు. 'బ్యూటీ విత్ ఎ పర్పస్', నిజాయతీ, గౌరవమనే విలువలతో పోటీలు కొనసాగుతున్నాయని చెప్పారు.

రాష్ట్రం, దేశం పరువు తీశారు

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర, దేశ పరువు తీశారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీశ్‌రెడ్డి అన్నారు. తమని వేశ్యలా చూశారని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై ఆయన ఓ ప్రకటనలో స్పందిస్తూ ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. మిస్‌వరల్డ్ పోటీదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామని, ఈ పోటీలతో పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించి రాష్ట్ర, దేశ పరువు ప్రతిష్ఠలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

అందాల పోటీలంటే మహిళలను కించపర్చడమే

స్పష్టం చేసిన సీపీఐ నేత నారాయణ

ఖమ్మం, మే 24 (ఆంధ్రజ్యోతి): అందాల పోటీలు జరుగుతున్నప్పుడు మహిళలను కించపరిచారని పోటీదారులే ఆరోపిస్తుంటే ప్రభుత్వం ఇప్పుడు ఏం సమాధానం చెబుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రశ్నించారు. మిస్ ఇంగ్లాండ్ మిల్లా 'సన్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విలువలేని చోట తాను ఉండదలుచుకోలేదని చెప్పారని గుర్తు చేశారు. అందాల పోటీల్లో పాల్గొనే వారిని వేశ్యల్లా చూస్తున్నారని ఆమె తెలిపిందని నారాయణ పేర్కొన్నారు. ఇప్పటికైనా అందాల పోటీలపై మాట్లాడే వారు తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. తనపై వెటకారంగా విమర్శలు చేసిన వారు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. అందాల పోటీలు నిర్వహించడమంటేనే మహిళలను కించపర్చడమని నారాయణ స్పష్టం చేశారు.

స్వదేశాలకు పంపే సొమ్ముపై
పన్ను 3.5 శాతానికి తగ్గింపు

» రెమిటెన్స్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను తగ్గించిన ట్రంప్ సర్కారు



వాషింగ్టన్, మే 24: విదేశీయులు అమెరికాలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి స్వదేశాలకు పంపే సొమ్ము (రెమిటెన్సు)పై విధించిన పన్నులో ట్రంప్ సర్కారు స్వల్ప ఊరటనిచ్చింది. 'ఎక్సైజ్ ట్యాక్స్ ఆన్ రెమిటెన్స్ ట్రాన్స్‌ఫర్స్'గా పేర్కొంటున్న ఈ పన్నును తొలుత 5శాతంగా ప్రతిపాదించగా.. ఇప్పుడు 3.5 శాతానికి తగ్గించారు. అంటే ఉదాహరణకు రూ.లక్ష స్వదేశానికి పంపితే.. తొలి ప్రతిపాదన ప్రకారం రూ.5 వేలు పన్ను కింద చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడది రూ.3,500కు తగ్గింది. అమెరికా నుంచి విదేశాలకు సొమ్మును బదిలీ చేసే బ్యాంకులు, మనీ ట్రాన్స్‌ఫర్ సంస్థలే.. ఈ మేరకు పన్ను వసూలు చేసి, ప్రభుత్వానికి అందజేస్తాయి. 'వన్ బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్' పేరిట రూపొందించిన ఈ పన్నుల చట్టం బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ కేవలం ఒక్క ఓటు మెజారిటీతో (అనుకూలంగా 215 ఓట్లు, వ్యతిరేకంగా 214 ఓట్లు) ఆమోదం తెలపడం గమనార్హం. అమెరికాలో సుమారు 44.6 లక్షల మంది భారతీయులు ఉన్నట్టు అంచనా. వారిలో చాలా మంది అక్కడ సంపాదించిన సొమ్మును భారత్‌కు పంపిస్తూ ఉంటారు.

అమెరికాలో ఫోన్లను తయారు చేయకుంటే సామ్‌సంగ్‌పైనా దిగుమతి సుంకం: ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్, మే 24: అమెరికాలో విక్రయించే ఫోన్లను అమెరికాలోనే తయారు చేసే విధంగా ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఆయా కంపెనీలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇందులో భాగంగా అమెరికాలో అమ్మే ఐఫోన్లను ఇక్కడే తయారు చేయకుంటే వాటిపై 25% దిగుమతి సుంకం విధిస్తామని ఆయన యాపిల్ కంపెనీని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇదేవిధంగా సామ్‌సంగ్‌ను కూడా హెచ్చరించారు. అమెరికాలో తన ఫోన్లను తయారు చేయకుంటే సామ్‌సంగ్ కూడా 25% దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అమెరికాలో డివైజ్‌లను విక్రయించే ఏ ఫోన్ తయారీ కంపెనీకైనా సుంకం వర్తిస్తుందని ఆయన వైట్ హౌస్‌లో విలేకరులతో అన్నారు.

మళ్లీ కరోనా కలకలం..కొత్తగా 257 కేసులు

న్యూఢిల్లీ, మే 24: యావత్ ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ పూర్తిగా తగ్గిపోయిందని అంతా భావిస్తుండగా, దేశంలోని పట్టణ ప్రాంతాల్లో మహమ్మారి కేసులు పెరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీతోపాటు మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ నెలలో కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కొత్తగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లు వెలుగు చూశాయని ఇండియన్ సార్స్-కోవ్-2 జినోమిక్స్ కన్సార్టియం (ఐఎన్ఎస్ఏసీఓజీ) శుక్రవారం తెలిపింది. ఢిల్లీలో 23 మందికి కొవిడ్ సోకినట్లు తేలింది. ఇది ఇన్‌ఫ్లూయెంజా వంటి జ్వరం మాత్రమేనని ప్రజలు ఆందోళనకు గురి కావద్దని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి పంకజ్ సింగ్ చెప్పారు. కొత్తగా నమోదైన కేసుల్లో 53 శాతం నమూనాల్లో జేఎన్.1 వేరియంట్, 26 శాతం బీఏ2, 20 శాతం ఇతర ఒమ్రికాన్ వేరియంట్‌లున్నట్లు నిర్ధారించారు. ఈ నెలలో కేరళలో 273 మహమ్మారి కేసులు నమోదు కావడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం నిఘా పెంచాలని అన్ని జిల్లాల వైద్యాధికారులను ఆదేశించింది.

సుప్రీం కొలీజియం సభ్యురాలిగా జస్టిస్ నాగరత్న



న్యూఢిల్లీ, మే 24: సుప్రీంకోర్టు కొలీజియం సభ్యురాలిగా జస్టిస్ బీ.వీ.నాగరత్న నియమితులయ్యారు. ఈ నియామకం ఆదివారం నుంచి అమల్లోకి వస్తుంది. ఇంతవరకు కొలీజియంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ అభయ్ ఎస్ ఓకా పదవీ విరమణ చేయడంతో సీనియార్టీలో అయిదో స్థానంలో ఉన్న జస్టిస్ నాగరత్న నియమితులయ్యారు. ప్రస్తుతం కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ కె.జి.మహేశ్వరి, జస్టిస్ నాగరత్న సభ్యులుగా ఉన్నారు. నూతన కొలీజియం ప్రథమ సమావేశం సోమవారం జరిగే అవకాశం ఉంది. సుప్రీంకోర్టులో ఉన్న మూడు జడ్జీల పోస్టుల ఖాళీలు, వివిధ హైకోర్టుల్లోని ఖాళీలపై చర్చలు జరిపే అవకాశం ఉంది. సీనియారిటీ ప్రకారం జస్టిస్ నాగరత్న 2027 సెప్టెంబరు 23న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. అదే జరిగితే ఆమె భారతదేశ ప్రథమ మహిళా ప్రధాన న్యాయమూర్తి కానున్నారు. నెల రోజుల పాటు ఆ పదవిని నిర్వహించి 2027 అక్టోబరు 29న పదవీ విరమణ చేసే అవకాశం ఉంది.

ఈపీఎఫ్‌పై 8.25% వడ్డీ రేటుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, మే 24: ఈపీఎఫ్‌పై 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతం వడ్డీ రేటు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటునే కొనసాగించాలని ఫిబ్రవరి 28న ఈపీఎఫ్‌వో నిర్ణయించింది. దీనిని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం పంపారు. దీనికి ఆ శాఖ ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని గురువారం ఈపీఎఫ్‌వోకు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ పంపినట్టు ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఆమోదం తెలిపిన వడ్డీ రేటు ప్రకారం.. వడ్డీ మొత్తాన్ని 7కోట్లకు పైగా ఈపీఎఫ్‌వో చందాదారుల ఖాతాల్లో జమచేయనున్నారు.



సముద్రంలో ఒరిగిన విదేశీ నౌక

న్యూఢిల్లీ, మే 24: కేరళలోని కోచి సమీపంలో శనివారం విదేశీ సరకు రవాణా నౌక ఒకటి సముద్రంలో ఒరిగిపోయింది. ఆ నౌకలో మొత్తం 23 మంది సిబ్బంది ఉండగా అందులో 21 మందిని ఇండియన్ కోస్టుగార్డ్ కాపాడింది. లైబేరియా జెండాతో శుక్రవారం విజినం పోర్టు నుంచి బయలుదేరిన ఆ నౌక శనివారం రాత్రి పది గంటలకు కోచి చేరాల్సి ఉండగా సముద్రంలో ప్రమాదానికి గురయింది. కోచికి 38నాటికల్ మైళ్ల దూరంలో 26 డిగ్రీల మేర ఒరిగిపోయింది. ప్రమాదాన్ని పసిగట్టిన సిబ్బంది కోస్టుగార్డ్‌కు సమాచారం పంపడంతో ఆ సిబ్బంది వచ్చి సహాయ చర్యలు చేపట్టారు. ఆ నౌక తీసుకెళ్తున్న కంటెయినర్లలో ప్రమాదకర పదార్థాలు ఉన్నాయని, అటువైపు ఇతరులు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరించారు. కంటెయినర్లను వేరే నౌకల్లోకి మార్చే పనులను చేపట్టారు.

ఏపీ పదోతరగతి ఫలితాల్లో
శ్రీచైతన్య విజయ దుందుభి

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలే పదోతరగతి ఫలితాలు ప్రకటించగా రీవాల్యుయేషన్‌లో తమ విద్యార్థులు 599 మార్కులు సాధించారని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఏడుగురు విద్యార్థులు 598 మార్కులు సాధించగా, 42 మంది 597, 109 మంది 596, 201 మంది 595, 1184 మంది 590 మార్కులు సాధించారని శనివారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. మొత్తం 24261 మంది విద్యార్థులకుగాను గరిష్ఠ మార్కులు 600కి 528 సగటు మార్కులు సాధించారన్నారు. ఇటీవలే విడుదలైన జేఈఈ మెయిన్స్‌లోనూ ఓపెన్ విభాగంలో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించడంతోపాటు 100లోపు 19 ర్యాంకులు సాధించారని సీమ తెలిపారు.



నీతి ఆయోగ్‌పాలక మండలి 10వ భేటీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎంలతో ప్రధాని మోదీ

కలిసి పనిచేద్దాం!

టీమిండియా స్ఫూర్తి చాటుదాం.. సాధ్యంకాని లక్ష్యమంటూ ఉండదు

» పెట్టుబడులకు పెద్దపీట వేయండి
» వికసిత భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యం
» రాష్ట్రాల అభివృద్ధితోనే ఇది సాధ్యం
» నీతి ఆయోగ్ భేటీలో రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ, మే 24: "రండి.. కలిసి పనిచేద్దాం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమిండియా' స్ఫూర్తితో పనిచేస్తే సాధ్యం కాని లక్ష్యమంటూ ఏమీ ఉండదు." అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలో ప్రధాని అధ్యక్షతన 10వ నీతి ఆయోగ్ పాలక సమావేశం జరిగింది. 'వికసిత్ భారత్ 2047 కోసం వికసిత రాష్ట్రాలు' అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో మరింత వేగం పుంజుకోవాల్సి ఉందన్నారు. "అభివృద్ధి పనుల వేగం మరింత పెరగాల్సి ఉంది. కేంద్రం, అన్ని రాష్ట్రాలు టీమిండియా స్ఫూర్తితో కలిసి పనిచేస్తే అసాధ్యమంటూ ఏమీ ఉండదు." అని వ్యాఖ్యానించారు. "వికసిత భారత్.. అనేది ప్రతి భారతీయుడి లక్ష్యం. ఈ క్రమంలో ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే.. భారతదేశం అభివృద్ధి చెందుతుంది. ఇది 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్ష." అని ప్రధాని ఉద్ఘాటించారు. ప్రతి రాష్ట్రం, ప్రతి నగరం, ప్రతి నగరపాలక సంస్థ, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనేది ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్యసాధనకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే 'వికసిత భారత్' కోసం 2047 వరకు వేచి చూడాల్సిన అవసరం ఉండదని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, సౌకర్యాలు, మౌలిక వసతులతో ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రధాని సూచించారు. "ఒక రాష్ట్రం-ఒక ప్రపంచ గమ్యస్థానం.. స్ఫూర్తిని అందిపుచ్చుకుని అభివృద్ధి చేస్తే పొరుగున ఉన్న నగరాలు కూడా అభివృద్ధి చెందుతాయి." అని చెప్పారు. దేశంలో శరవేగంగా పట్టణీకరణ జరుగుతోందని, 'ఫ్యూచర్ రెడీ సిటీస్' దిశగా కలిసి పనిచేయాల్సి ఉందని తెలిపారు. వృద్ధి, సృజనాత్మకత, సుస్థిరత అభివృద్ధికి చోదక శక్తులని ప్రధాని చెప్పారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో మహిళల పాత్రను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పెట్టుబడులకు మార్గం సుగమం చేయాలని రాష్ట్రాలను ప్రధాని కోరారు. విధానపరమైన అడ్డంకులను తొలగించడం ద్వారా.. పెట్టుబడులకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగు పరిచేందుకు రెడ్ కార్పెట్ పరవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా విద్య, వ్యవసాయం, ప్రజారోగ్యంపై రాష్ట్రాలు ప్రధానంగా దృష్టిసారించాలని ప్రధాని సూచించారు. కాగా, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధాని భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక శాఖ మంత్రులు, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆ సీఎంలు దూరం

ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య.. బిజీగా ఉన్న కారణంగా హాజరుకాలేదు. అయితే, ఆయన తన సందేశాన్ని లిఖిత పూర్వకంగా పంపించారు. కేరళ సీఎం పినరయి విజయన్ కూడా హాజరుకాలేదు. తనబదులుగా రాష్ట్ర ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్‌ను పంపించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొనసాగుతున్న పుదుచ్చేరి సీఎం రంగస్వామి, బిహార్ సీఎం నితీశ్‌లు గైర్హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమత కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదు.

ఇదో.. వంచన: కాంగ్రెస్

నీతి ఆయోగ్ పాలకమండలిపై కాంగ్రెస్ పార్టీ నిశిత విమర్శలు చేసింది. దీనిని 'అయోగ్యమండలి'గా అభివర్ణించింది. అంతేకాదు.. ఈ సమావేశాన్ని 'వంచన, దారిమళ్లింపు' భేటీగా దుయ్యబట్టింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. "వికసిత భారత్ కోసం ప్రధాని అధ్యక్షతన భేటీ అయ్యారు. కానీ, అధికారంలో ఉన్న వారే తమ మాటలు, చేతల ద్వారా సామాజిక సామరస్యాన్ని ధ్వంసం చేస్తుంటే.. వికసిత భారత్ ఎలా సాధ్యమవుతుంది?." అని జైరాం రమేశ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. "కొందరి దగ్గరే సంపద పోగు పడుతోంది. ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో వికసిత భారత్ సాధ్యమేనా?" అని నిలదీశారు. "నేడు సమావేశమైన నీతి ఆయోగ్ మండలి.. ఓ అయోగ్య మండలి" అని జైరాం వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పతనానికి జైరాం చాలు: బీజేపీ

నీతి ఆయోగ్ భేటీపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. టీమిండియా స్ఫూర్తిని చాటేలా నిర్వహించిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలోనూ ఆయన తప్పులు వెతకడం, వివాదాలు సృష్టించడం దారుణమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ షహన్వాజ్ హుస్సేన్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ పతనానికి జైరాం ఒక్కరు చాలని వ్యాఖ్యానించారు. కాగా, పంజాబ్ సీఎం భగవంత్ మాట్లాడుతూ.. హరియాణాతో జల వివాదాన్ని ప్రస్తావించారు. భాక్రా-నంగల్ డ్యామ్ నుంచి నీటిని ఇచ్చేందుకు అసలు తమ వద్ద నీరు ఉంటేనే కదా? అని ప్రశ్నించారు.

పన్నులో వాటా 50 శాతం: స్టాలిన్

నీతి ఆయోగ్ పాలక మండలి భేటీలో పాల్గొన్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర పన్నుల వాటాలపై ప్రశ్నించారు. "చట్టబద్ధంగా రాష్ట్రాలకు రావాల్సిన నిధుల కోసం పోరాటం చేయాల్సి రావడం, వ్యాజ్యాలకు దిగడం, ఏం బాగోలేదు. భారత దేశం వంటి సమాఖ్య ప్రజాస్వామ్యంలో రాష్ట్రాలు ఈ విధంగా దేబిరించాలా?. ఇలా చేయడం వల్ల రాష్ట్రాలే కాదు.. దేశ అభివృద్ధికి కూడా విఘాతం ఏర్పడుతుంది' అని వ్యాఖ్యానించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50% కేటాయించాలని డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన 41% మేరకైనా పన్నులు తమకు తిరిగి ఇవ్వడం లేదని.. కేవలం 33.16 శాతం మేరకే విదిలిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. "ఒక వైపు రాష్ట్రానికి ఇవ్వాల్సిన పన్నుల వాటాల్లో కోత పెడుతున్నారు. మరోవైపు.. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాల వాటాను భారీగా పెంచుతున్నారు. ఇది రాష్ట్రాలపై మోపుతున్న అదనపు భారం కాదా?!" అని స్టాలిన్ ప్రశ్నించారు.

లోకం తీరు




హోటళ్లు తమ అతిథుల గోప్యతను కాపాడాలి

వివాహేతర సంబంధం కేసులో సీసీ ఫుటేజీ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ, మే 24: ఒక వివాహేతర సంబంధం కేసులో హోటల్ సీసీటీవీ ఫుటేజీ కోసం చేసిన అభ్యర్థనను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. హోటల్లో ఉన్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న జంటకు గోప్యతా హక్కు ఉందని నొక్కి చెప్పింది. ఈ మేరకు ఇద్దరు ఆర్మీ మేజర్ అధికారుల కేసులో తీర్పు వెలువరించింది. తన భార్య మరో ఆర్మీ మేజర్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉందని ఆరోపిస్తూ, ఆ ఇద్దరు హోటల్ గదిలో ఉన్నప్పటి సీసీటీవీ ఫుటేజీని ఇవ్వాలంటూ సైన్యంలోని ఓ మేజర్, పిటిషన్ దాఖలు చేశారు. ఈ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. తమ అతిథుల గోప్యతను హోటళ్లు కాపాడాలని సివిల్ జడ్జి జస్టిస్ వైభవ్ ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జంటకు హోటల్లో 'ప్రైవసీ హక్కు' ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. "ఇలాంటి ప్రైవేటు సమాచారం సదరు వ్యక్తుల అనుమతి లేకుండా విడుదల చేయడం వారి గోప్యత, సహజ న్యాయ హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది. వారి ప్రతిష్ఠకు భంగం కూడా" అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ప్రైవేటు వివాదాలకు సంబంధించి న్యాయస్థానాలు దర్యాప్తు సంస్థలు కావు అని, అంతర్గత విచారణలో సాక్ష్యాలను సేకరించే ఆధారంగానూ కోర్టులను భావించొద్దని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా అడల్టరీపై 2018లో సుప్రీంకోర్టు వెలువరించిన కేసును ఉత్తర్వుల్లో కోర్టు ఉటంకించింది. ఒక వ్యక్తి, మరొక వ్యక్తి భార్య ప్రేమను 'దొంగిలించవచ్చు' అనే భావనను సుప్రీంకోర్టు తిరస్కరించిందని గుర్తుచేశారు. ఫిర్యాదుదారుడు ఆర్మీ చట్టం (1950), అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిష్కారం పొందాలని సూచించారు.

'సింధు' స్ఫూర్తికి
పాక్ తూట్లు!

» ఐక్యరాజసమితిలో గర్జించిన భారత్



యునైటెడ్‌నేషన్స్, మే 24: దాయాది దేశం పాకిస్థాన్ కుటిలత్వంపై ఐక్యరాజ్యసమితి(ఐరాస)లో భారత్ గర్జించింది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంపై పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టింది. "65 ఏళ్ల కిందట ఒక మంచి సదుద్దేశంతో, చిత్తశుద్ధితో సింధు జలాల ఒప్పందం చేసుకున్నాం." అని వెల్లడించిన భారత్.. మూడు యుద్ధాలు చేయడం ద్వారా, వేలాది సార్లు ఉగ్రమూకలను భారత్‌పై ఉసిగొల్పడం ద్వారా సింధు జలాల స్ఫూర్తిని పాక్ ఉల్లంఘించిందని స్పష్టం చేసింది. "సింధు జలాలపై పాక్ ప్రతినిధులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎగువ నదీజలాల దేశంగా ఉన్న భారత్.. సింధు విషయంలో ఎప్పుడూ బాధ్యతగానే వ్యవహరించింది. అసలు ఈ ఒప్పందంలోని ప్రవేశిక.. 'సద్భావన, స్నేహస్ఫూర్తి'ని చాటుతుంది. కానీ, ఈ స్ఫూర్తిని పాక్ మంటగలిపింది." అని ఐరాసలో శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ నిప్పులు చెరిగారు. సింధు జలాల ఒప్పందాన్ని దాయాది దేశమే అన్ని రూపాల్లోనూ ఉల్లంఘిస్తోందని ఆయన తేల్చి చెప్పారు. "ఉగ్రదాడుల కారణంగా గత నాలుగు దశాబ్దాల్లో 20 వేల మందికిపైగా భారత పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల పహల్గాంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని అత్యంత దారుణానికి ఒడిగట్టారు. అయినా.. భారత్ అసాధారణ సహనాన్ని, ఉదారతను చాటుకుంది. పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం.. భారత్‌లోని పౌరుల జీవితాలను, మత సామరస్యాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నిస్తోంది." అని హరీశ్ చెప్పారు.

కశ్మీర్‌లో రాహుల్ పర్యటన

పాకిస్థాన్ దాడుల బాధిత కుటుంబాలకు భరోసా



పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ఇల్లును పరిశీలిస్తున్న రాహుల్

న్యూఢిల్లీ, మే 24: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో పర్యటించారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ బలగాలు చేసిన షెల్లింగ్ దాడుల ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఏ మూల చూసినా ధ్వంసమైన ఇళ్లులు, తడిబారిన కళ్లు, ప్రియమైన వారిని కోల్పోయిన బాధాతప్త హృదయాలే కనిపించాయని పేర్కొన్నారు. బాధితుల ఆందోళనలు, సమస్యలను జాతీయ స్థాయిలో లేవనెత్తుతానని వారికి భరోసా ఇచ్చారు. శనివారం ఉదయం ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్న రాహుల్ గాంధీ.. ఈనెల 8, 10వ తేదీల మధ్య పాక్ జరిపిన దాడుల్లో దెబ్బతిన్న ఇంటింటికీ తిరిగారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. షెల్లింగ్‌లో గాయపడిన వారిని ఆస్పత్రుల్లో పరామర్శించారు. స్థానికంగా ఉన్న ఒక పాఠశాలను కూడా సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు.

తడిబారిన కళ్లు... బాధాకర స్టోరీలు

బాధిత కుటుంబాలను కలిసిన అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. 'ఇది ఒక పెద్ద విషాదం. చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. నష్టం కూడా భారీగా జరిగింది. ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో లేవనెత్తాలని వారు కోరారు. నేను ఆ పని చేస్తాను' అని పేర్కొన్నారు. ఈ దేశభక్తి కుటుంబాలు ప్రతిసారీ ధైర్యం, గౌరవంతో యుద్ధ భారాన్ని మోస్తాయని, వారి ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ బలగాల ఆర్టిలరీ, మోర్టార్ షెల్లింగ్, క్షిపణులు, డ్రోన్ దాడుల్లో పూంచ్ సెక్టార్ ఎక్కువగా ప్రభావితమైంది. మొత్తం 28 మంది మరణించగా, పూంచ్ జిల్లాలోనే 13 మంది మృతిచెందారు. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా 70 మందికి పైగా గాయపడ్డారు. కాగా, రాహుల్ గాంధీ అంతకుముందు పహల్గాం దాడి తర్వాత ఏప్రిల్ 25న శ్రీనగర్‌లో పర్యటించారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను రాహుల్ గాంధీ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

పరువునష్టం కేసులో.. రాహుల్ గాంధీకి నాన్-బెయిలబుల్ వారెంట్

» జారీ చేసిన ఝార్ఖండ్ కోర్టు

రాంచీ, మే 24: లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఝార్ఖండ్‌లోని ప్రజాప్రతినిధుల(ఎంపీ, ఎమ్మెల్యే) కేసుల ప్రత్యేక కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2018లో ఝార్ఖండ్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సందర్భంగా రాహుల్‌గాంధీ అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు(ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి) అమిత్‌షాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "హత్య కేసులో ఉన్నవారు కూడా బీజేపీ అధ్యక్షుడు కావొచ్చు" అని వ్యాఖ్యానించారు. దీనిపై ఝార్ఖండ్ బీజేపీ నేత ప్రతాప్ కతియార్ 2018 జూలై 9న చాయ్‌బాసాలోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్(సీజేఎం) కోర్టులో పరువునష్టం దావా వేశారు. 2020లో ఝార్ఖండ్ హైకోర్టు ఈ కేసును రాంచీలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీచేసింది. కేసు విచారణను ప్రారంభించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. రాహుల్‌గాంధీకి సమన్లు జారీ చేసినా.. ఆయన విచారణకు హాజరవ్వకపోవడంతో తొలుత బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. దీనిపై రాహుల్ ఝార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ ఏడాది మార్చి 20న పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో.. ప్రజాప్రతినిధుల కోర్టు తాజాగా నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. వచ్చేనెల 26న జరిగే తదుపరి విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావాలని రాహుల్ గాంధీని ఆదేశించింది.

భిన్న ధ్రువాలు ఒకే జట్టులో

» సౌదీ వెళ్లిన ఎంపీల బృందంలో అసద్, దూబే
» ఇది ప్రజాస్వామ్య విశిష్టత అన్న నిశికాంత్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



ఒవైసీతో బహ్రెయిన్‌లోని తెలుగు కళా సమితి అధ్యక్షుడు జగదీశ్

రాజకీయంగా భిన్నమైన అభిప్రాయాలను కలిగిన ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ నేత నిశికాంత్ దూబేలు ఒక అంశంలో కలిసి పనిచేయాల్సి రావడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. భిన్న ధ్రువాలుగా ఉండే ఈ ఎంపీలు పాకిస్తాన్ ఉగ్రవాద ఉన్మాదాన్ని ఎండగట్టేందుకు బయలుదేరిన జట్టులో ఉండటం ఆసక్తిని రేపుతోంది. పాక్ దుర్మార్గాలను వివరించేందుకు సౌదీ అరేబియాతో పాటు కువైట్, బహ్రెయిన్ దేశాల పర్యటనకు ఒడిశా బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలో వచ్చిన ఏడుగురు సభ్యుల బృందం శనివారం బహ్రెయిన్‌కు చేరుకుంది. ఇందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేలు ఉన్నారు. తాను, ఒవైసీ ఒకే విధానాన్ని అంతర్జాతీయంగా చెప్పడానికి ఉద్దేశించిన బృందంలో సహచరులు కావడం ప్రజాస్వామ్య విశిష్టత అని దూబే అన్నారు. కేంద్ర మాజీ మంత్రి గులాం నబీ ఆజాద్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగాలు కూడా ఈ బృందంలో ఉన్నారు. బహ్రెయిన్‌లో రెండు రోజుల పాటు సమావేశమైన అనంతరం వీరు కువైట్ వెళతారు. అక్కడి నుండి 27న రాత్రి సౌదీ అరేబియాకు, అక్కడి నుండి అల్జీరియాకు వెళతారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ తనయ సుప్రియా సూలే నేతృత్వంలోని బృందం శనివారం రాత్రి ఖతర్ చేరుకుంది. ఈ బృందంలో తెలుగుదేశం ఎంపీ లావు కృష్ణదేవరాయలతో పాటు విదేశీ మాజీ మంత్రులు మురళీధరన్, మనీశ్ తివారీ, తెలుగు వారైన మాజీ దౌత్యవేత్త సయ్యద్ అక్బరుద్దీన్ ఉన్నారు. ఖతర్ అనంతరం ఈజిప్టు, ఇథియోపియా, దక్షిణాఫ్రికాలో ఈ బృందం పర్యటిస్తుంది. మహారాష్ట్ర మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే తనయుడు శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని బృందం యూఏఈ పర్యటనను ముగించుకుని శనివారం తిరిగి వెళ్లింది. ఇదిలా ఉండగా, ఉగ్రవాదం నుంచి తనను తాను కాపాడుకునే హక్కు భారతదేశానికి ఉందని జర్మనీ గుర్తించినట్టు విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు. జర్మనీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం బెర్లిన్‌లోని విదేశీ వ్యవహారాల జర్మన్ కౌన్సిల్‌లో ముఖాముఖిలో పాల్గొన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్, అంతర్జాతీయ సమాజం నుంచి ప్రత్యేకించి జర్మనీ నుంచి భారత్‌కు లభిస్తున్న బలమైన మద్దతును ఈ సందర్భంగా జైశంకర్ ప్రస్తావించారు.

విమానాల టేకాఫ్ సమయంలో ఫొటోలు, వీడియోలపై నిషేధం

» పౌర విమాన సంస్థలకు డీజీసీఏ ఉత్తర్వు

న్యూఢిల్లీ, మే 24: పలు విమానాశ్రయాల్లో ఫొటోలు, వీడియోలు తీయడాన్ని నిషేధిస్తూ పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) ఉత్తర్వులు జారీ చేసింది. కిటికీ షేడ్స్ మూసే ఉంచాలంటూ పేర్కొంది. రక్షణ శాఖ విమానాశ్రాయాల నుంచి... ప్రధానంగా పశ్చిమ సరిహద్దుల్లోని విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించే క్రమంలో ఈ నిబంధనలను తూచాతప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేసింది. విమానం బయలుదేరి, 10 వేల అడుగుల ఎత్తుకు చేరే వరకూ ప్రయాణికులు తమ కిటికీ షేడ్స్ మూసి ఉంచాలని పేర్కొంది. అలాగే విమానం దిగేక్రమంలో 10 వేల అడుగుల ఎత్తు నుంచి విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యి ప్రయాణికుల టెర్మినల్‌ను చేరే వరకూ 'షేడ్స్' తెరవకూడదని స్పష్టం చేసింది. అలాగే టెర్మినల్‌లో ఉన్నప్పుడు, రన్‌వైపై ట్యాక్సీలో ప్రయాణిస్తున్నప్పుడు, విమానం ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఫొటోలు, వీడియోలు తీయకూడదని పేర్కొంది.



యాదగిరిగుట్టపై భక్తుల కిటకిట

యాదగిరిగుట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం వారాంతపు రద్దీ కనిపించింది. భారీగా వచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. స్వామివారిని సుమారు 45వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వాహనాలతో కొండపై పార్కింగ్ స్థలం నిండిపోయింది. భక్తులు క్యూలైన్లలో రాత్రి వరకు బారులు తీరారు. కాగా, శనివారం ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.49,77,624 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి


విజయ్‌కుమార్(ఫైల్)

మర్పల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లో చిక్కుకుని అప్పులపాలైన ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కొత్లాపూర్‌లో జరిగింది. కోటమర్పల్లికి చెందిన విజయ్ కుమార్(23) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని రూ.2లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురై శనివారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం కొత్లాపూర్ శివారులో హైదరాబాద్ నుంచి పూర్ణాకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కార్పొరేట్ డేటా చౌర్యం కేసు..నలుగురి అరెస్టు

ఓ కార్పొరేట్ కంపెనీ డేటా, డిజైన్లను చోరీ చేసిన కేసులో నలుగురు నిందితులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీ సీఎస్‌బీ) అరెస్టు చేసింది. సీఎస్‌బీ డీజీ షికాగోయల్ కథనం ప్రకారం.. ఓ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేసే పట్టి దుర్గాప్రసాద్, ఆటోక్యాడ్ డిజైనర్ చంద్రశేఖర్ ప్రసాద్, బిల్డింగ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, ఎంఈపీ మేనేజర్ అనిల్ కుమార్‌లు ఆ కంపెనీకి చెందిన వినియోగదారుల సమాచారం, ప్రాజెక్టు డిజైన్లు, ధరల వివరాలు, కీలకమైన వ్యాపార సమాచారాన్ని కాజేశారు. వీరంతా కలిసి చంద్రశేఖర్ ప్రసాద్ తండ్రి పేరుతో క్రాఫ్ట్‌మెన్ ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రా కంపెనీలో వ్యాపారం ప్రారంభించాలని ప్రయత్నించారు. కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన సీఎస్‌బీ అధికారులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

మయన్మార్‌లో ఉద్యోగాల ఎర.. ఇద్దరికి బేడీలు

మయన్మార్‌లో ఉద్యోగాల పేరుతో యువతను మోసగించి, సైబర్ నేరాలు చేయిస్తున్న కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికాగోయల్ తెలిపారు. జీడిమెట్లకు చెందిన నాగశివ అలియాస్ జేమ్స్‌పై మూడు కేసులు నమోదయ్యాయని.. ఇతనిపై ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసు జారీ అయ్యిందని తెలిపారు. ఇతను లావోస్ నుంచి రావడంతో.. కోల్‌కతా విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇదే కేసులో రిక్రూటింగ్ ఏజెంట్‌గా పనిచేసిన గుజరాత్ నివాసి హితేశ్‌ను మయన్మార్ పోలీసులు తిప్పిపంపగా.. ఢిల్లీలో అరెస్టయినట్లు తెలిపారు.

జూన్‌లో ఒకేసారి 3నెలల రేషన్!

- రేషన్ షాపుల్లో ఆ నెలంతా సన్నబియ్యం అందజేత
- కేంద్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా ముందస్తుగా ఇవ్వాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం
- వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల ముప్పు కారణంగానే


హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో భారీ వర్షాలు, వరదలకు అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా పేదలకు మూడునెలల ముందస్తు రేషన్ అందించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం వచ్చే జూన్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. జూన్, జూలై, ఆగస్టు నెలల కోటా సన్న బియ్యాన్ని రేషన్ దుకాణాల్లో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు జూన్ ఒకటి నుంచి 30వ తేదీలోపు మూడు నెలల రేషన్ పంపిణీ పూర్తయ్యేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లు, తహసీల్దార్లు, డీటీఎస్‌లను ఆదేశించారు. ఈసారి మూడు నెలల కాలవ్యవధికి అవసరమైన బియ్యం కేటాయింపులు స్టేజ్-1 గోదాముల ద్వారా ఎంఎల్ఎస్ పాయింట్లకు చేర్చే ప్రక్రియ దాదాపుగా పూర్తయిన నేపథ్యంలో వినియోగదారులకు పంపిణీ జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీలోగా పూర్తిచేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని చౌహాన్ స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా ప్రజలందరికీ పోర్టిఫైడ్ సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి నెల ఇచ్చినట్లుగానే ఆహార భద్రతా కార్డు గలిగిన వారికి తలా 6 కిలోల చొప్పున ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని అందజేస్తారని తెలిపారు. ఎఎఫ్ఎస్‌సీ కార్డుదారులకు 35 కిలోల బియ్యం, అన్నపూర్ణ కార్డు దారులకు 10 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఏఏవై కార్డుదారులకు పంచదార రూ. 13.50కి ఒక కిలో చొప్పున ఇస్తారని తెలిపారు. గోధుమలు కిలో రూ. 7 చొప్పున జీహెచ్ఎంసీలో 5 కిలోలు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ-పాస్ సాంకేతికత ద్వారా నెలనెలకు వేర్వేరు ఈపీవోఎస్ రసీదులు జనరేట్ చేయాలని, బయోమెట్రిక్ ద్వారా ధ్రువీకరణ కూడా నెలనెలకు వేర్వేరుగా చేయాలని అధికారులను ఆదేశించారు.

ముందే రుతురాగం

కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు.. 16 ఏళ్ల తర్వాత 8 రోజుల ముందుగా దేశంలోకి..

- ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు వరకూ విస్తరణ
- రెండు రోజుల్లో ఏపీ, తెలంగాణకు
- రాబోయే 5 రోజులూ వర్షాలే: వాతావరణ కేంద్రం


ఆసిఫాబాద్ మండలం గుండి పెద్దవాగుపై కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన



హైదరాబాద్/విశాఖపట్నం/అమరావతి, మే 24(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది రైతన్నలకు చల్లని కబురు. ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం. ఈ ఏడాది 8 రోజుల ముందే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. 16 ఏళ్ల తర్వాత సాధారణ తేదీ (జూన్ 1) కంటే వారం ముందుగానే వచ్చాయి. నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకినట్టు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. మరో రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణకు వచ్చే అవకాశాలున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో కొద్ది రోజుల్లోనే దేశమంతా విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 27న కేరళకు వస్తాయని భారత వాతావరణ శాఖ ఇటీవల ప్రకటించింది. ఐఎండీ అంచనాకు భిన్నంగా మూడు రోజుల ముందే కేరళను తాకాయి. గతంలో 2009లో మే 23వ తేదీనే దేశంలోకి నైరుతి ప్రవేశించగా.. ఆ తర్వాత ఈ సారి మే 24న కేరళను తాకాయి. కొంకణ్‌కు ఆనుకుని తూర్పు మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం శనివారానికి వాయుగుండంగా బలపడడం, అరేబియా సముద్రం మీదుగా పశ్చిమ గాలులు బలంగా వీస్తుండడంతో నైరుతి రుతుపవనాలు ముందుగానే దేశ భూభాగంలోకి వచ్చాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దక్షిణ కొంకణ్‌కు ఆనుకుని తూర్పు, మధ్య అరేబియా సముద్రంలో తీవ్ర అల్పపీడనం శనివారం ఉదయం బలపడి వాయుగుండంగా మారింది. తూర్పుదిశగా పయనించి సాయంత్రానికి మహారాష్ట్రలోని రత్నగిరి సమీపంలో తీరం దాటింది. వచ్చే 24 గంటల్లో మధ్య మహారాష్ట్ర మీదుగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా మారుతుంది. మరింత బలహీనపడి తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా ఈ నెల 27వ తేదీలోగా పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించి అల్పపీడనంగా మారుతుందని కొన్ని వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఆ తరువాత ఉత్తర వాయవ్యంగా పయనించి బలపడుతుందని, ఈ నేపథ్యంలో అరేబియా సముద్రం నుంచి రుతుపవన కరెంట్ బంగాళాఖాతం వైపు వీస్తోందని విశ్లేషించాయి. దీంతో రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో రానున్న 5 రోజులు వర్షాలు పడే అవకాశ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

ముందస్తు వేసవితోనే ముందుగా

దేశంలో ఈ ఏడాది ఫిబ్రవరి తొలివారం నుంచే ఎండలు పెరగడంతో వాతావరణం వేడెక్కిందని, దీంతో ఏప్రిల్ నుంచే వానలు ప్రారంభమయ్యాయని, ఈ నేపథ్యంలో ఎనిమిది రోజులు ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కేజీ రమేశ్ విశ్లేషించారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సగటు కంటే 1.6 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. దీంతో ఫిబ్రవరి నుంచే దేశంలో వేసవి తీవ్రత క్రమేపీ పెరిగిందన్నారు. మార్చి నెల నుంచి మధ్య భారత్‌లోని నాగ్‌పూర్, తూర్పుభారత్‌లోని అనేక ప్రాంతాల్లో రుతుపవన ముందస్తు వర్షాలు కురిశాయన్నారు. అందుకే మే నెలలో ఎండ తీవ్రత తగ్గిందని, వడగాడ్పుల ప్రభావం కూడా పెద్దగా లేదన్నారు.

ఈ ఏడాది ఎక్కువ వర్షపాతం

సాధారణంగా నైరుతి రుతుపవనాల సీజన్‌లో 87సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. అయితే సీజన్ దీర్ఘకాల సగటులో 105 శాతం నమోదు అవుతుందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. ఈశాన్య భారత్‌లో అనేక ప్రాంతాలు, దక్షిణాదిలో తమిళనాడు, ఉత్తర భారత్‌లో కశ్మీర్, లద్దాఖ్ మినహా దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

హైదరాబాద్‌లో భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అరగంటకు పైగా వర్షం పడటంతో రహదారులు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై వరద నీరు నిలిచిపోవడంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, రాయదుర్గం, హైటెక్‌సిటీ, అమీర్‌పేట ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పెద్దపల్లి జిల్లా ఓదెలలో శనివారం ఉదయం వరకు 4.3 సెం.మీ వర్షం కురిసింది. ధర్మారంలో 4.2, భోజన్నపేట్‌లో 3.6, రంగంపల్లిలో 3.3 సెం.మీ వాన పడింది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు, అప్పన్నపేట, తదితర ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిశాయి. ఎలిగేడు మండలం శివపల్లిలో పశువుల కొట్టంపై పిడుగు పడి నాలుగు ఆవులు మృతి చెందాయి. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో గంటపాటు భారీ వర్షం కురిసింది. గోదావరి రోడ్డులోని పలు వాడల్లో మురికి నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. ఆసిఫాబాద్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆసిఫాబాద్ మండలంలోని గుండి పెద్దవాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన వరదకు కొట్టుకుపోయింది. దహెగాం మండలంలో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోయింది.

ఫైనల్‌గా ఏ 'ప్యాలెస్'కు!?

- ఏపీలో మద్యం ముడుపుల రూటు కనిపెట్టిన 'సిట్'
- హైదరాబాద్ 'రియల్'లో భారీగా పెట్టుబడులు
- బెంగళూరులో పదుల కొద్దీ ఎకరాల కొనుగోలు
- వాటి విక్రేతలు, మధ్యవర్తుల గుర్తింపు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

క్యాష్ కొట్టు... ఆర్డర్ పట్టు!
ఏపీలో వైఎస్ జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం తీరిది! అలా తెచ్చుకున్న నగదంతా ఎక్కడికి వెళ్లింది? ఏ నగరాలను చుట్టింది? ఏ దేశాలకు వెళ్లి.. మళ్లీ హవాలా ద్వారా తిరిగి ఇక్కడికి చేరుకుంది? అత్యంత కీలకమైన వివరాలను పసిగట్టడంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందడుగు వేసినట్లు తెలుస్తోంది. సాక్షుల వాంగ్మూలాలు, నిందితులు చెప్పిన వివరాలు, సాంకేతిక ఆధారాలకు తోడు.. ఇతర రాష్ట్రాలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమాచారంతో 'సిట్' పక్కాగా తీగ లాగుతోంది. జగన్ హయాంలో లిక్కర్ మాఫియా రూ.3200 కోట్లు పోగేసుకున్నట్లు సిట్ నిర్ధారించింది. లిక్కర్ పాలసీ రూపకల్పన నుంచి ముడుపుల వసూళ్ల వరకూ జరిగిన అన్ని అక్రమాలను ఆధారాలతో సహా తేల్చిన సిట్ అధికారులు.. అంతిమంగా డబ్బులు ఎక్కడికి చేరాయనే సమాచారం సేకరించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

పలు రాష్ట్రాల్లో 'పెట్టుబడులు'

మద్యం ముడుపులను హైదరాబాద్‌లో హవాలా, ముంబైలో బులియన్ ద్వారా 'అంతిమ లబ్ధిదారు' చెప్పిన చోటుకు చేరినట్లు సిట్ అధికారులు గుర్తించారు. రాజ్ కసిరెడ్డి(ఏ1) గ్యాంగ్ వసూలు చేసిన డబ్బులో సుమారు వెయ్యి కోట్లు హైదరాబాద్‌లోని స్థిరాస్తి వ్యాపారస్తుల ద్వారా బెంగళూరులో పెట్టుబడులుగా మారినట్లు ఆధారాలు లభించాయి. సజ్జాపుర, చిక్క తిరుపతి, హెచ్ఎస్ఆర్ లేఔట్ ప్రాంతాల్లో 2022 నుంచి 2024 మధ్య పదులకొద్దీ ఎకరాలు కొనుగోలు చేశారని.. వాటి 'అసలు' యజమాని ఎవరనేది కూడా 'సిట్ గుర్తించిందని తెలిసింది. ఆ ఆస్తులు, వాటి విక్రేతలు, మధ్యవర్తులను సైతం గుర్తించి.. వారితోనూ కూపీ లాగుతోంది. మరోవైపు ముంబైలో బులియన్ వ్యాపారుల నుంచి బంగారం కొనుగోలు చేసినట్లు లభించిన జీఎస్టీ బిల్లులపై ఆరా తీయగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎక్కువ శాతం బిల్లులు కేవలం జీఎస్టీ చెల్లించి తీసుకున్నట్లు తేలింది. బంగారం వ్యాపారుల నుంచి పలు వివరాలు సేకరించిన సిట్ అధికారులు కేవలం జీఎస్టీ చెల్లించి బిల్లులు తీసుకున్న వ్యక్తులు ఆ డబ్బు ఎక్కడికి చేర్చారనే అడ్రస్ కూడా రాబట్టినట్లు తెలుస్తోంది. ఆ చిరునామా వెతికే క్రమంలో మరింత ముందుకు వెళితే... అదంతా ఏ 'ప్యాలెస్'కు చేరిందో తెలిసిపోతుంది.

పార్ట్-బీ మెట్రోకు డీపీఆర్ సిద్ధం

రాష్ట్ర సర్కారుకు చేరిన సమగ్ర నివేదిక.. ఈ నెల 8న పంపించిన హెచ్ఏఎంఎల్

- క్యాబినెట్ ఆమోదం తర్వాత కేంద్రానికి
- 3 కారిడార్లకు 19,579కోట్ల వ్యయం!



పార్ట్-బీ డీపీఆర్‌లోని ముఖ్యాంశాలు..

కారిడార్	కిలో మీటర్లు	అంచనా వ్యయం (సుమారు)	స్టేషన్ల సంఖ్య
జేబీఎస్-మేడ్చల్	24.5	రూ.5,571.00 కోట్లు	18
జేబీఎస్-శామీర్‌పేట్	22.0	రూ.5002.58 కోట్లు	14
ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్‌సిటీ	39.6	రూ.9004.64 కోట్లు	16

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలోని మెట్రో రెండో దశలో భాగంగా పార్ట్-బీ కింద ప్రతిపాదించిన నార్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. ఆయా కారిడార్లలో సుమారు 6 నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని అంశాలపై అధ్యయనం చేసిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు డీపీఆర్‌ను తయారు చేశారు. ఇటీవల జరిగిన బోర్డు మీటింగ్‌లో మరోసారి అన్ని అంశాలనూ కూలంకషంగా చర్చించి, ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత కేంద్రానికి అందజేయాలని యోచిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరం నలుమూలలకూ మెట్రో రైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా తొలుత నాగోల్-ఎయిర్‌పోర్టు (కారిడార్-4) 36.8 కిలోమీటర్లు, రాయ దుర్గ్- కోకాపేట్ (కారిడార్-5) 11.6 కిలోమీటర్లు, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (కారిడార్-6) 7.5 కిలోమీటర్లు, మియాపూర్- పటాన్‌చెరు (కారిడార్-7) 13.4 కిలోమీటర్లు, ఎల్బీనగర్- హయత్‌నగర్(కారిడార్-8) 7.1 కిలోమీటర్ల కారిడార్లను ప్రతిపాదించారు. కిలోమీటరుకు సుమారు రూ.318 కోట్ల అంచనా వ్యయంతో రూ.24,269 కోట్లను కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా (50:50) పద్ధతిన పనులు చేపట్టాలని నిర్ణయించారు. రెండో దశ విస్తరణలో భాగంగా తొలుత 5 కారిడార్లను మాత్రమే ప్రతిపాదించి డీపీఆర్‌లు తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం.. మెట్రో రైల్ అధికారులను ఆదేశించింది. అయితే నగరానికి ఉత్తరం వైపునకు కూడా మెట్రో రైలును తీసుకురావాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. దీంతో ఫేజ్-2 కింద తొలుత ప్రతిపాదించిన 5 కారిడార్ల డీపీఆర్‌ను పార్ట్-ఏగా తయారు చేయాలని, పార్ట్-బీ కింద జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్, ఎయిర్‌పోర్ట్- ఫ్యూచర్‌సిటీని రూపొందించాలని హెచ్ఏఎంఎల్ అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఈ క్రమంలో పార్ట్-ఏ డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో గతేడాది నవంబర్-4న కేంద్రానికి పంపించగా.. తాజాగా పార్ట్-బీకి సంబంధించిన మూడు కారిడార్ల డీపీఆర్‌ను హెచ్ఏఎంఎల్ బోర్డు ఆమోదంతో 8న రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది.

కిలోమీటరుకు రూ.227.39 కోట్లు..!

పార్ట్-బీ కింద జేబీఎస్ మెట్రో స్టేషన్- మేడ్చల్ (24.5 కిలోమీటర్లు), జేబీఎస్ మెట్రో స్టేషన్-శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) ప్రతిపాదించారు. అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్‌సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లు చేపడుతున్నారు. అయితే పార్ట్-ఏలో కిలోమీటరుకు సుమారు రూ.318కోట్లతో అంచనాతో డీపీఆర్‌ను తయారు చేయగా.. పార్ట్-బీలో కిలోమీటరుకు రూ.227.39 కోట్లతోనే రూపొందించినట్లు తెలుస్తోంది. పార్ట్-బీలోని ఫ్యూచర్‌సిటీ మార్గంలో భూసేకరణ సమస్య పెద్దగా లేకపోవడంతో ఖర్చు తగ్గిన పరిస్థితి కనిపిస్తోంది.. కాగా, జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్‌లో ఖర్చు పెరుగు తోందని అధికారులు తెలిపారు. మొత్తం మూడు కారిడార్లకు రూ.19,579 కోట్లు అవసరం పడుతున్నట్లు డీపీఆర్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తర్వాత డీపీఆర్‌ను కేంద్రానికి పంపించనున్నట్లు హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. జేబీఎస్-మేడ్చల్‌లో 24.5 కిలోమీటర్ల మార్గం పూర్తి ఎలివేటెడ్ కారిడార్ (ఆకాశమార్గం)లో నిర్మాణం జరుగుతోందన్నారు. కాగా, జేబీఎస్-శామీర్‌పేట్ 22 కిలోమీటర్ల కారిడార్‌లో 20.35 కిలోమీటర్ల వరకు ఎలివేటెడ్, 1.65 కిలోమీటర్లు భూగర్భంలో ఉంటుందని చెప్పారు. హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మార్గంలో ట్రాక్ చేపడుతామన్నారు. కాగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టు- ఫ్యూచర్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లలో ఎయిర్‌పోర్టు నుంచి 1.5 కి.మీ భూగర్భ మార్గంలో, 21 కిలోమీటర్లు ఎలివేటెడ్ (ఆకాశ మార్గంలో), 17 కిలోమీటర్లు ఎట్ గ్రేడ్ (భూమిపై) ట్రాక్ ఉంటుందన్నారు. మొత్తం 86.1 కిలోమీటర్లతో పార్ట్-బీ డీపీఆర్‌ను తయారు చేసినట్లు పేర్కొన్నారు.

వికసిత భారతాన.. స్వర్ణాంధ్ర సాధన

- 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- నీతీ ఆయోగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి


ప్రధాని మోదీతో ఏపీ సీఎం చంద్రబాబు. చిత్రంలో తమిళనాడు సీఎం స్టాలిన్

న్యూఢిల్లీ, మే 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్రం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకునేనాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా నడిచేందుకు.. ఇందులో దేశానికే మార్గదర్శకంగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ద్వారా ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో జాతీయ అభివృద్ధికి ఏపీ దోహద పడుతుందని తెలిపారు. 'వికసిత్ భారత్ 2047' సాకారంలో ఆంధ్రప్రదేశ్ ముందుందని పేర్కొన్నారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పీ 4 ద్వారా ఈ లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలోని 'భారత మండపం'లో శనివారం ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతీఆయోగ్ 10వ పాలక మండలి సమావేశంలో చంద్రబాబు ఏపీ అభివృద్ధిపై నివేదికను సమర్పించి మాట్లాడారు. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రస్తావించారు. డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. నీతీ ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను బ్లూ ప్రింట్ ద్వారా బాబు వివరించారు. దీనిపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని సూచించారు.

ప్రైవేట్ హాస్టళ్లపై టాస్క్‌ఫోర్స్ కొరడా!

- స్పెషల్ డ్రైవ్‌లో తనిఖీలు.. 38 హాస్టళ్లకు నోటీసులు
- నిబంధనలు పాటించని వారికి 2,46,000 జరిమానా


ఓ ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకుడికి నోటీసు ఇస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ హాస్టళ్లపై జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపిస్తోంది. గ్రేటర్‌లో రెండు రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు హాస్టళ్లలో టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలతో వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం పలు ప్రాంతాల్లో హాస్టళ్లను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఎల్బీనగర్‌లోని శ్రీనగర్‌కాలనీ, లలితనగర్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి జోన్‌లోని కేపీహెచ్‌బీ, మూసాపేట ప్రాంతాలు, శేరిలింగంపల్లి జోన్‌లోని వినాయకనగర్, పత్రికా నగర్‌లలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 60 హాస్టళ్లను తనిఖీ చేసి 38 హాస్టళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. 7 హాస్టళ్లలో కిచెన్లు మూసివేశారు. నిబంధనలు ఉల్లంఘించిన హాస్టళ్ల నిర్వాహకులకు రూ. 2.46 లక్షల జరిమానా విధించారు. పలు ప్రాంతాల్లో కొంతమంది హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్ ద్వారా తనిఖీలు చేయిస్తున్నారు.

స్టైపెండ్ దోపిడీపై మెడికోల ఆందోళన

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు వైద్య విద్య కళాశాలల్లో పనిచేస్తున్న హౌజ్ సర్జన్స్, పీజీ విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. ప్రతి నెలా తమకు చెల్లించాల్సిన స్టైపెండ్‌ను కాలేజీ యాజమాన్యాలే జేబుల్లో వేసుకుంటున్నట్టు వారు ఆరోపిస్తున్నారు. తాము శ్రమ దోపిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఏటా ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదివే పీజీ విద్యార్థుల స్టైపెండ్ సుమారు రూ.500 కోట్లను యాజమాన్యాలు తమ జేబుల్లో వేసుకుంటున్నట్లు మెడికోలు ఆరోపిస్తున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలమేరకు ప్రతి పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థికి ప్రతి నెలా స్టైపెండ్ చెల్లించాలని, కానీ ఇచ్చినట్లే ఇచ్చి వెంటనే యాజమాన్యాలు డ్రా చేసుకుంటున్నాయని వారు చెబుతున్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత ఏడాదిపాటు చదివిన కాలేజీలోనే ఇంటర్న్‌షిప్ చేయాలి. ఆ సమయంలో నెలకు రూ.25,906 ఇస్తారు. పీజీ విద్యార్థులకైతే మొదటి ఏడాది రూ.58,289, రెండో ఏడాది రూ.61,528, మూడో ఏడాది రూ.64,767 ఇవ్వాలి. పీజీ డిప్లొమా వారికి మొదటి ఏడాది రూ.58,289, సెకండియర్‌కు రూ.61,528 చొప్పున ప్రతి నెలా చెల్లించాలని 2023లో ప్రభుత్వం జీవో నంబరు 59 జారీ చేసింది.

ఇలా వేసి.. అలా డ్రా..

ప్రైవేటు వైద్య విద్య కాలేజీల్లో చదువుతున్న పీజీలకు చేరిన వెంటనే కళాశాల యాజమాన్యాలు తమ క్యాంపస్‌లోని బ్యాంకులోనే ఖాతా తెరవాలని నిబంధనలు పెడుతున్నాయి. ఎన్ఎంసీ నిబంధనల మేరకు ప్రతి విద్యార్థికి స్టైపెండ్ చెల్లిస్తున్నట్లు చూపేందుకు విద్యార్థుల ఖాతాలో ప్రతి నెలా స్టైపెండ్ వేస్తారు. అయితే విద్యార్థి కాలేజీలో చేరిన తొలి ఏడాదే మూడేళ్లపాటు ఇచ్చే స్టైపెండ్ మొత్తానికి 36 విత్‌డ్రా ఫామ్‌లు వారి వద్ద తీసుకుంటున్నారు. కొన్ని కాలేజీలు విద్యార్థుల నుంచి 36 చెక్కులు తీసుకుంటున్నాయి. మరికొన్ని విద్యార్థుల నుంచి ఏటీఎమ్ కార్డులు తీసుకుంటూ డబ్బులు డ్రా చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని కాలేజీల మెడికోలు నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేపట్టారు.

తెలంగాణ పాలిట.. రేవంత్, ఉత్తమ్ తెల్ల ఏనుగులు

ఒకరు ఆదాయానికి, మరొకరు నీటి వాటాకు

అసమర్థతతో గండికొడుతున్నారు

కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా..

తుమ్మిడిహెట్టి పనులు చేపట్టలేదు

కాంగ్రెస్ డీఎన్ఏలోనే అవినీతి: హరీశ్



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు తెల్ల ఏనుగులా భారంగా మారిందనడం సరికాదని.. నిజానికి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌లే తెలంగాణ పాలిట తెల్ల ఏనుగులని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. అసమర్థతతో ఒకరు రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతుంటే, మరొకరు నీటి వాటాకు గండి కొడుతున్నారని ఓ ప్రకటనలో ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్లను, పంపుహౌజ్‌లను వాడుకుంటూనే... ఆ ప్రాజెక్టుపై ఉత్తమ్ మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నారని హరీశ్ మండిపడ్డారు. చెప్పిన అబద్ధాన్ని మళ్లీ మళ్లీ చెబితే ప్రజలు నమ్ముతారనే భ్రమలో ఉత్తమ్ ఉన్నారని విమర్శించారు. కాళేశ్వరం మీద కుట్రలు చేయడం తప్ప.. గత ఏడాదిన్నరలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని పేర్కొన్నారు. గతంలో ఏపీలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు సాధించలేదని గుర్తు చేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు, అప్పటికే చేసిన ఖర్చు వృథా కాకుండా ఉండేందుకు ప్రాణహిత ప్రాజెక్టుకు రీడిజైనింగ్ చేసి, కాళేశ్వరం చేపట్టామని వివరించారు.

ఎస్ఎల్‌బీసీ కూలడానికి కాంగ్రెస్సే కారణం

కాంగ్రెస్ అంటేనే కరప్షన్, కాంగ్రెస్ డీఎన్ఏలోనే అవినీతి ఉందని హరీశ్‌రావు విమర్శించారు. జలయజ్ఞం ధనయజ్ఞం అంటూ అప్పట్లో కాగ్ రిపోర్టు ఇవ్వడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందని, కానీ ఆరు ఎకరాలకు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా పక్కన పెట్టడం వల్లే ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిందని మంత్రి ఉత్తమ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.3,200 కోట్లు ఖర్చు చేసి 12 కిలోమీటర్ల సొరంగం తవ్వడంతోపాటు డిండి, పెండ్లిపాకల పనులు పూర్తి చేశామని వివరించారు. దీనిపై హైదరాబాద్‌లోనైనా, హుజూర్‌నగర్‌లోనైనా చర్చిద్దాం రావాలని ఉత్తమ్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా, హడావుడి పనులతో ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలిందని, 8 మంది ప్రాణాలు బలయ్యాయని ఆరోపించారు. ప్రమాదం జరిగి వంద రోజులైనా.. సొరంగంలోని మృతదేహాలను బయటికి తీయని అసమర్థులని మండిపడ్డారు.

అప్పుడు ఈడీ అపవిత్రం.. ఇప్పుడు పవిత్రమా?

బీఆర్ఎస్‌ది నియంతృత్వ పాలన: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నపుడు అపవిత్రంగా కనిపించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ).. ప్రతిపక్షంలోకి రాగానే పవిత్రంగా కనిపిస్తుందా? అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. ఇప్పుడు పొగుడుతున్న దర్యాప్తు సంస్థయే గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై కేసు నమోదు చేసిన సంగతిని మర్చిపోయారా..? అంటూ శనివారం ఒక ప్రకటనలో నిలదీశారు. 60 ఏళ్ల కలను సాకారం చేస్తూ సోనియా ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే.. బీఆర్ఎస్ పదేళ్ల తెలంగాణను దెయ్యంలా పట్టి పీడించిందని విమర్శించారు. నియంతృత్వ పాలనతో ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. ఈడీని పావుగా చేసుకొని కాంగ్రెస్ అగ్ర నాయకులపై బీజేపీ ప్రభుత్వం పెట్టిస్తున్న అక్రమ కేసులను బీఆర్ఎస్ సమర్థించడం వెనుకున్న చీకటి ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాదంటే కొత్త పార్టీ



(మొదటిపేజీ తరువాయి)

అంశాలపై చర్చిస్తారని ఆమె భావించారని, కానీ అవేమీ జరగలేదని, మరికొంత సమయం కవిత ఎదురు చూశారని, ఈ లోగా ఆమె రాసిన లేఖ బయట పడిందని తెలిపాయి.

పార్టీ పేర్లు ఇవే

తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే కొత్త పార్టీ పెట్టడం ఖాయమని కవిత సన్నిహితవర్గాలు వెల్లడించాయి. ఒకటి రెండు పేర్లు చర్చకు వచ్చినట్లు సమాచారం. తన మానస పుత్రిక తెలంగాణ జాగృతి సంస్థ పేరునే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశాలు లేకపోలేదని సన్నిహితులు చెబుతున్నారు. తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి(టీబీఆర్ఎస్) పేరును కూడా ఆమెతో సన్నిహితంగా ఉండే కొందరు బీసీ నేతలు తెరపైకి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.

లీకేజీపై కవిత గరంగరం

ముఖ్యంగా తన లేఖ లీకేజీపై కవిత తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తాను చెబుతున్న దయ్యాలే వాటిని కావాలని బయటకు విడుదల చేసి ఉండాలని ఆమె భావిస్తున్నారు. ముందు లేఖ ఎలా లీకైందన్న విషయం బయటకు రావాల్సిందేనని కవిత పట్టుబడుతున్నట్లు తెలిసింది. గతంలోనూ అనేక చేదు అనుభవాలను కవిత ఎదుర్కొన్నారని సన్నిహిత వర్గాలు అంటున్నాయి. గతంలో కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడేందుకు కవిత పలుమార్లు ప్రయత్నించినా తన తండ్రికి ఫోన్ కూడా ఇవ్వకుండా చేశారని, ఇటువంటి పరిస్థితులు ఆమెకు మింగుడు పడకుండా చేశాయని సమాచారం. తన లేఖ లీకేజీ వీరులెవరో తెలిసేదాకా పార్టీ కార్యాలయానికి కానీ, కేసీఆర్ వద్దకు కానీ వెళ్లకూడదని మరో ఆలోచన కూడా కవితకు ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. తాను రాసిన లేఖనే లీకు చేస్తారా అన్న ఆగ్రహావేశాలతో ఆమె ఉన్నట్లు జాగృతి వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా లీకు వీరులపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాల్సిందేనని ఆమె డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం ఎర్రవల్లిలో కేసీఆర్ ఫాంహౌజ్‌లో ఉన్న ఇద్దరు ముగ్గురితో కవిత ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. లేఖలో కవిత పేర్కొన్న అంశాల్లో తప్పేముందన్న నేతలు లేకపోలేదు. కవిత లేఖ విషయంలో ఎవ్వరూ నోరెత్తవద్దన్న అధిష్ఠానం ఆదేశాల మేరకు అంతా గప్‌చుప్‌గా ఉన్నారు. ఆమె ప్రస్తావించిన అంశాలు ఎంతో విలువైనవని మాత్రం అంటున్నారు. కేసీఆర్ కోటరీ విషయంలో కవిత ప్రస్తావించిన అంశాలపై బహిరంగంగా మీడియాతో మాట్లాడే ధైర్యం ఏ ఒక్కరూ చేయలేక పోతున్నారు. శనివారం నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీపీ కవిత లేఖలో ప్రస్తావించిన అంశాలు సరైనవేననీ, దానిపై అధిష్ఠానం సీరియెస్‌గా చర్చించాల్సిందేనని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌లో కవిత అంశంపై ఒక్క కేటీఆర్ తప్ప మిగిలిన వాళ్లు అంతా మౌనముద్ర దాల్చారు. కేటీఆర్ కూడా కేసీఆర్ ఆదేశాల మేరకే కవిత అంశంపై స్పందించారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ అంతర్గత విషయాలను అంతర్గతంగానే మాట్లాడాలని చెప్పడం ద్వారా కవిత వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. ఒక రకంగా కవిత బహిరంగంగా అలా మాట్లాడటం సరికాదన్న ధోరణితో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు కేటీఆర్ వ్యాఖ్యల ద్వారా తేటతెల్లమైందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

శనివారమంతా ఇంటికే పరిమితం

శుక్రవారం రాత్రి విదేశాల నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కవిత శనివారమంతా ఇంటికే పరిమితమయ్యారు. బయటకు రాలేదు. ప్రయాణ బడలిక కారణంగా కొంత సేపు కవిత విశ్రాంతి తీసుకున్నారని సన్నిహితులు వెల్లడించారు. ఎవర్నీ కలిసేందుకు కవిత ఇష్టపడలేదని తెలిపారు. ఆమె ఎవరికి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని జాగృతి వర్గాలు వెల్లడించాయి. తన భర్త అనిల్ తరపున బంధువులే పెద్ద సంఖ్యలో వచ్చినట్లు తెలుస్తోంది. వారితో కొంతసేపు మంతనాలు జరిపినట్లు సమాచారం.

మా పార్టీలో రేవంత్ కోవర్టులు

- ఒక్కోసారి వాళ్లంతట వాళ్లే బయటపడతారు
- లేఖ రాయడం పెద్ద విషయమేమీ కాదు
- పార్టీలో అంతర్గతంగానే మాట్లాడాలి
- ఎంత పెద్దవాళ్లయినా ఇదే సూత్రం
- కవిత వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పార్టీలో అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు, అంశాలను అంతర్గతంగానే మాట్లాడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా, ఏ హోదాలో ఉన్నా అలాగే చేయాలని చెప్పారు. ఈ సూత్రం పార్టీలోని అందరికీ వర్తిస్తుందన్నారు. కేసీఆర్ చుట్టూ దయ్యాలు చేరాయని చెల్లెలు కవిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో శనివారం విలేకరుల సమావేశంలో కేటీఆర్ ఆమె వ్యాఖ్యలపై స్పందించారు. నేషనల్ హెరాల్డ్ వ్యవహారంపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లెలి వ్యాఖ్యలపై ముక్తసరిగా స్పందించారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, ఎవరైనా తమ సూచనలు, సలహాలను ఏ విధంగానైనా తమకు ఇవ్వొచ్చని చెప్పారు. పార్టీ అధ్యక్షుడిని నేరుగా కలవొచ్చని, పార్టీ వేదికలు కూడా ఉన్నాయని, పార్టీ ఆఫీస్ బేరర్స్‌లో ఎవరినైనా కలిసి చెప్పే అవకాశం ఉందని గుర్తు చేశారు. సలహాలు, సూచనలను లిఖిత రూపంగా, మౌఖికంగానైనా చెప్పొచ్చన్న ఆయన అంతర్గత విషయాలను మాత్రం అంతర్గతంగానే మాట్లాడాలన్నారు. కవిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కేసీఆర్ దేవుడైతే దయ్యం ఎవరంటూ విలేకరులు ప్రశ్నించగా, తెలంగాణకు పట్టిన దయ్యం రేవంత్, రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ అని కేటీఆర్ బదులిచ్చారు. దయ్యాన్ని, శనిని ఎలా వదిలించుకోవాలనేదే తమ లక్ష్యమని కేటీఆర్ సమాధానం చెప్పారు. లేఖలు రాయడం పెద్ద విషయంగా భావించి బాధ పడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలో కోవర్టులు ఉన్నారంటూ కవిత చేసిన వ్యాఖ్యల గురించి విలేకరులు ప్రస్తావించగా, అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారని, రేవంత్‌రెడ్డికి కూడా తమ పార్టీలో ఉంటే ఉండొచ్చని, సమయం వచ్చినప్పుడు వాళ్లెవరో తెలుస్తుందని, ఒక్కోసారి వారంతట వారే బయట పడతారని వ్యాఖ్యానించారు.

రాష్ట్రం పరువు తీశారు.. రాజీనామా చేయాలి

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును చేర్చిందని, ఇది రాష్ట్రానికి చాలా అవమానకరమని కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డి 2015లో ఓటుకు నోటు కుంభకోణానికి పాల్పడితే ఇప్పుడు సీటుకు రూటు కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. రేవంత్ రూ.50 కోట్లు ఖర్చు పెట్టి పీసీసీ అధ్యక్ష పదవి కొనుక్కున్నారని స్వయంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టంగా చెప్పారని తెలిపారు. ఇప్పుడు ఈడీ చార్జిషీటులో ఎవరెన్ని డబ్బులు ఇచ్చారో, ఏ పదవిని ఎంతకు అమ్ముకున్నారో స్పష్టంగా చెబుతోందన్నారు. ఈడీ చార్జిషీటులో రేవంత్‌రెడ్డి పేరు ఉన్నందున నైతికత ఉంటే ముఖ్యమంత్రి పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులైనా స్పందించి రేవంత్‌తో రాజీనామా చేయించి నిష్పక్షపాతంగా విచారణకు సహకరించాలని అన్నారు. రేవంత్‌కు ఇద్దరు బాస్‌లని, రాహుల్, మోదీలను ప్రసన్నం చేసుకోవడానికే ఆయన తరచూ ఢిల్లీ వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. బిల్డర్లు, కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీ బాస్‌లకు వేల కోట్ల చందాలు తప్ప సీఎంగా రేవంత్ ఏమీ చేయలేదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో చార్జిషీటులో పార్టీ ముఖ్యమంత్రి పేరు ఉంటే రాహుల్‌గాంధీ స్పందించరేమని ప్రశ్నించారు. సీఎం జపాన్ పర్యటనకు వెళ్లినప్పుడే తమకు అనుమానం వచ్చిందని, ఆ సమయంలోనే ఈడీ రాహుల్, సోనియాగాంధీలను ఏ1, ఏ2గా చేర్చిందని తెలిపారు. అప్పుడు దేశంలోని కాంగ్రెస్ నేతలంతా స్పందించారని, రేవంత్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదని అన్నారు. చార్జిషీటులో పేరున్న కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కర్ణాటక బీజేపీ డిమాండ్ చేస్తోందని, తెలంగాణ బీజేపీ మాత్రం రేవంత్‌రెడ్డి విషయంలో మౌనంగా ఉంటోందని ప్రస్తావించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య సంబంధాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలని సూచించారు. బీజేపీ ఎంపీలు చేస్తున్న భూ దందాలకు ముఖ్యమంత్రి వత్తాసు పలకడమే ఈ మౌనానికి కారణమని అనుమానం వ్యక్తం చేశారు. రేవంత్ బిల్డర్ల దగ్గర నుంచి చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారని చెప్పారు. అవినీతి వ్యవహారాల మీద నెల రోజుల పాటు వేచి చూస్తామని, అప్పటికీ కేంద్రం స్పందించకుంటే బీఆర్ఎస్ కార్యాచరణలోకి దిగుతుందని ప్రకటించారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో ముఖ్యమంత్రిపై విచారణకు ఆదేశించాలని గవర్నర్‌ను కలిసి కోరతామని చెప్పారు. సీఎం విచారణకు హాజరు కావాల్సిందేనని, ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబడాల్సిందేనని, చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

పాలిసెట్ ఫలితాలు విడుదల

- ఎంపీసీ విభాగంలో 82శాతం, ఎంబైపీసీ విభాగంలో 84శాతం ఉత్తీర్ణత
- 100 శాతం మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన నలుగురు విద్యార్థులు



ఉండ్యాల కౌశిక్ నారాయణ



షేక్ ఇఫ్రా తస్నీమ్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఖమ్మం ఖానాపురంహవేలి, మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సూర్యాపేట అర్బన్, చిలుకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలకు ఉద్దేశించిన పాలిసెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఈ ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 98,858 మంది పరీక్షకు హాజరుకాగా.. ఎంపీసీ విభాగంలో 80,949 (81.88%) మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంబైపీసీ విభాగంలో 83,364 (84.33%) మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విభాగంలో గోరుగంటి శ్రీజ (మిర్యాల-సూర్యాపేట జిల్లా), తూమాటి లాస్యశ్రీ (ఖమ్మం), ఉండ్యాల కౌశిక్ నారాయణ (మహబూబ్‌నగర్), వీసవరం దీక్షిక (హైదరాబాద్) 120 మార్కులకు 120 సాధించి సంయుక్తంగా రాష్ట్రంలో మొదటి ర్యాంకును సాధించారు. అలాగే ఎంబైపీసీ విభాగంలోనూ గోరుగంటి శ్రీజ, తూమాటి లాస్యశ్రీ 150 మార్కులకు 150 సాధించి సంయుక్తంగా మొదటి ర్యాంకులు పొందారు. ఎంబైపీసీ విభాగంలో కాచిగూడలోని నెహ్రూనగర్‌కు చెందిన మహ్మద్ అశ్వఖ్‌కు స్టేట్ 5వ ర్యాంకు వచ్చింది. హైదరాబాద్ మియాపూర్‌లోని జనప్రియనగర్‌కు చెందిన బుద్ధ నాగసౌఖ్య ఎంపీసీ విభాగంలో స్టేట్ 9వ ర్యాంకు పొందారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రణవి రాష్ట్రస్థాయిలో ఎంపీసీ విభాగంలో 9వ ర్యాంకు సాధించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రానికి చెందిన షేక్ ఇఫ్రా తస్నీమ్ ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు 119 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు, ఎంబైపీసీ విభాగంలో 150 మార్కులకు 149 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్ సాధించారు.

టీచర్ల ప్రోత్సాహంతోనే ఫస్ట్ ర్యాంక్



మాది బీహెచ్ఈఎల్‌లోని న్యూఎంఐజీ కాలనీ. పాలిసెట్ ఎంపీసీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు, టీచర్ల సహకారం, ప్రోత్సాహంతో పాలిసెట్‌కు చదివాను. పదో తరగతిలో 590 మార్కులు వచ్చాయి. ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ పూర్తిచేసి మంచి కంపెనీలో ఉద్యోగం సాధించాలని అనుకుంటున్నాను.

- వీసవరం దీక్షిక

ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం



ఐఏఎస్ కావలన్నదే నా లక్ష్యం. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం సహకారంతోనే మొదటి ర్యాంకు సాధించా. పదో తరగతిలో 569 మార్కులు వచ్చాయి.

- లాస్యశ్రీ

ఐఐటీ సీటు సాధించడమే లక్ష్యం



ఐఐటీ సీటు సాధించాలనే లక్ష్యంతో కష్టపడుతున్నా. ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌పై ఆసక్తి ఉంది. రాకెట్ ప్రయోగాలు చేయడంలో ఇష్టం ఉంది.

- జి.శ్రీజ



ఫామ్‌హౌస్‌కి ఎవర్నీ రానివ్వని కేసీఆర్?

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, మే 24: అమెరికా నుంచి వచ్చిన కవిత విమానాశ్రయం నుంచి నేరుగా వెళ్లి తండ్రిని కలుస్తారని అంతా భావించారు. అది జరగలేదు. కనీసం శనివారం ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలుస్తారనుకున్నారు. వెళ్లలేదు. ఫామ్‌హౌజ్‌లోనే ఉన్న కేసీఆర్ తనను కలిసేందుకు ఆమెకు అనుమతి ఇవ్వలేదా? లేక కవితే కేసీఆర్‌ను కలవడానికి ఆసక్తి చూపించలేదా? అనే విషయాలపై అస్పష్టత నెలకొంది. పార్టీ నాయకులు సైతం కేసీఆర్‌ను కలవాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అయితే, గడిచిన రెండ్రోజుల్లో ఏ నాయకుడు కూడా ఫామ్‌హౌస్ దరిదాపుల్లోకి అడుగుపెట్టక పోవడం గమనార్హం. ఆయన అనుమతి ఇవ్వకపోవడమే అందుకు కారణమని భావిస్తున్నారు.

హైకోర్టు నిర్మాణ కాంట్రాక్టు

డీఈసీ ఇన్‌ఫ్రాకు!

హైదరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న కొత్త హైకోర్టు భవనం నిర్మాణ కాంట్రాక్టును డీఈసీ ఇన్‌ఫ్రా సంస్థ దక్కించుకుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రూ.2,583 కోట్లతో వంద ఎకరాల్లో హైకోర్టు భవనం, జడ్జిల నివాస సముదాయం, ఇతర మౌలిక వసతులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నిర్ణయించింది. అందుకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఖరారు చేశారు. తాజాగా నిర్మాణ సంస్థగా డీఈసీ ఇన్‌ఫ్రాను ఎంపిక చేశారు. ప్రధాన కోర్టు భవనం ఆరు అంతస్తులు ఉంటుంది. 63 మంది జడ్జిల కోసం నివాసాలు నిర్మిస్తారు.

కవిత చెప్పిన దయ్యం నువ్వేనా?

- కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సీతక్క ప్రశ్న
- కేటీఆర్ మతి భ్రమించింది: మహేశ్‌గౌడ్
- దయ్యాలెవరో కేటీఆరే చెప్పాలి: పొన్నం



హైదరాబాద్/న్యూఢిల్లీ, మే 24(ఆంధ్రజ్యోతి): కవిత లేఖతో కేటీఆర్ చిన్న మెదడు చితికిందని, అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. కవిత చెప్పినట్టుగా కేసీఆర్ దగ్గర ఉన్న దయ్యం నువ్వేనా? అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. రాహుల్ గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. దేశ ప్రజల కోసం మాట్లాడుతున్న రాహుల్‌గాంధీపై మోదీ ఈడీని ప్రయోగిస్తున్నారని, మోదీ ప్రశంసల కోసం పాకులాడుతూ కేటీఆర్ పాకులాడుతున్నారని మండిపడ్డారు. సచివాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని, పీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పత్రికకు తన వంతు సాయం చేశారని తెలిపారు. అధికారంలో లేనప్పుడు.. అధికార దుర్వినియోగం ఎలా జరుగుతుందని నిలదీశారు. కేటీఆర్‌కు 'గోబెల్స్' అవార్డు ఇవ్వొచ్చని వ్యంగ్యంగా అన్నారు. కాగా, కవిత లేఖతో కేటీఆర్ మతి భ్రమించిదని, సీఎం రేవంత్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేసీఆర్‌కు పట్టిన దెయ్యం కేటీఆరేనని కవిత చెప్పకనే చెప్పారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందంలో భాగంగానే కవిత లేఖ రాసినట్టుగా ఉందన్నారు. కవిత లేఖ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే నేషనల్ హెరాల్డ్ కేసుపై కేటీఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పత్రికకు తమ పార్టీ నేతలు నిధులివ్వడం అవినీతి ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. పదేళ్ల అవినీతికి సంబంధించిన సొమ్ము పంపకాల్లో తేడాల వల్లే కవిత తిరుగుబాటు జెండా ఎగరవేశారని ఆరోపించారు. కేటీఆర్, కవిత మధ్య వైరం తీవ్ర స్థాయికి చేరిందని, అదును కోసం హరీశ్ చూస్తున్నారని చెప్పారు. ఇవన్నీ తట్టుకోలేకనే కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితం అయ్యారన్నారు. కేటీఆర్, కవిత, హరీశ్ తీరుతో బీఆర్ఎస్ మూడు ముక్కలవుతుందని, తెలంగాణలో ఆ పార్టీ కనుమరుగవడం ఖాయమని అన్నారు. కాగా, కేసీఆర్ వద్ద ఉన్న దెయ్యాలు ఎన్ని కుంభకోణాలకు పాల్పడ్డాయో కవిత వివరించాలని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ దయ్యాల అవినీతి, అక్రమాలపై సీబీఐకి ఫిర్యాదు చేయాలని కవితకు సూచించారు. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలెవరో కేటీఆర్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో పొన్నం విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ కాంగ్రెస్‌ను విమర్శించడం మానుకొని.. సొంత పార్టీని చక్కదిద్దుకుంటే మంచిదని హితవు పలికారు. కవిత ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాత కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తే మంచిదని సూచించారు. కాంగ్రెస్, సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ చేసిన నిరాదార ఆరోపణలపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కేటీఆర్.. తన పార్టీలో వివక్షపై స్పందించాలని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి హితవుచెప్పారు. కవిత చెబుతున్న దయ్యాలు సంతోష్‌రావు, కేటీఆర్, హరీశ్ రావేనని విమర్శించారు. నేడో, రేపో కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసి, సంతోష్‌కు పదవి కట్టబెట్టే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ అంతర్గత అంశాలు చర్చకు రాకుండా కేటీఆర్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ఆస్తులు కాపాడుకోవడం కోసమే బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కైందని ఆరోపించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కేటీఆర్‌కు దమ్ముంటే కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించడం సిగ్గుచేటని, ఆయనకు తామంతా కవచంలా నిలబడతామన్నారు. కవిత లేఖతో బీఆర్ఎస్ దోపిడీ బయటపడిందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ విమర్శించారు. దోచుకున్న సొమ్ము పంపకాల్లో పంచాయితీ ఏర్పడినట్టుందన్నారు. తెలంగాణ అభివృద్ధికి పట్టిన దయ్యం కేటీఆర్ అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ విమర్శించారు.

ఆ దయ్యాలెవరో కవితే చెప్పాలి: డీకే అరుణ

కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలెవరో ఎమ్మెల్సీ కవితనే చెప్పాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ సూచించారు. "కవిత రాసిన లేఖ ఆమె లేదా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ల్లో ఒకరు లీక్ చేసి ఉండాలి. వారెవరు అన్నది కవితనే చెప్పాలి. అమెరికా నుంచి వచ్చే ముందు రోజే ఆమె లేఖ ఎందుకు లీక్ అయ్యిందో కూడా వెల్లడించాలి. బీజేపీలోకి కవిత రావాలనుకున్నా..తీసుకునే ప్రసక్తే ఉండదు" అని స్పష్టం చేశారు. దోచుకోవడం, దాచుకోవడం బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల ఎజెండా అని దుయ్యబట్టారు. పదేళ్లపాటు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ పాత్ర ఏంటో రాహుల్ చెప్పాలని డిమాండ్ చేశారు.

టెర్రరిస్టులతో చర్చలకు సిద్ధమన్న వారు...

నక్సలైట్లతో మాత్రం సిద్ధంగా లేరు

- నక్సల్స్ పేరిట గిరిజనుల హత్యలు
- గిరిప్రసాద్ వర్ధంతి సభలో నారాయణ
- మావోయిస్టులతో చర్చలపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు: కూనంనేని



గిరిప్రసాద్ 29 వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఖమ్మం, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఒక్క నక్సలైట్ పేరుతో పదిమంది గిరిజనులను చంపుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఎంతమంది నక్సలైట్లను చంపినా ఉద్యమం ఆగదన్నారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. నక్సలైట్లు శాంతి చర్చలకు సిద్ధమని చెప్పినా వారితో చర్చించడానికి సిద్ధంగా లేరు కానీ టెర్రరిస్టులతో రాజీ పడుతున్నారన్నారని విమర్శించారు. బీజేపీ ఒక ఫాసిస్టు పార్టీ అని విమర్శించారు. మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా, వారు శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు స్పందించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. నాడు నిజాం ప్రభుత్వ పంథాను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. గిరిప్రసాద్ లాంటి ఎంతోమంది పోరాట యోధుల వారసత్వంతో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో వారు విలేకరులతో మాట్లాడారు. వర్సిటీ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారిణి విజయలక్ష్మిని హత్య చేయడం పట్ల తెలంగాణ రాజకీయ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ మారణకాండపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులను నిర్మూలించడానికి బహిరంగ ముహూర్తాలు పెడుతుండడం, నంబాల కేశవరావు హత్యపై హర్షాతిరేకాలు ప్రకటించడం శోచనీయమని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. వీడియో రికార్డింగ్ ద్వారా వారి బంధుమిత్రుల సమక్షంలో శవ పంచనామా జరిపి, భౌతిక కాయాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని విమలక్క, పటోళ్ల నాగిరెడ్డి, మల్లేశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



బెంగళూర్‌లో జరిగిన విద్యుత్ మంత్రుల సదస్సులో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతం

- డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు: భట్టి విక్రమార్క

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2034-35 దాకా ఏర్పడే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. శుక్రవారం రాత్రి బెంగళూర్‌లో ప్రాంతీయ విద్యుత్ మంత్రుల సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నామని చెప్పారు. సాంకేతిక, వాణిజ్య నష్టాలను తగ్గించుకోవడంతో పాటు విద్యుత్ సంస్థల ఆర్థిక పురోగతిపై దృష్టి పెడుతున్నామన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రాల ఏర్పాటును వేగవంతం చేస్తున్నామని తెలిపారు. హరిత ఇంధనానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, సోలార్ ప్లాంట్లతో పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని ఆయన వివరించారు.

అటవీ చట్టాల పేరిట గిరిజనుల్ని ఇబ్బంది పెట్టొద్దు: కొండా సురేఖ



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): అటవీ చట్టాల పేరిట గిరిజనులను ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు. గిరిజనుల అభివృద్ధికి అటవీ శాఖ ఉన్నతాధికారులు సహకరించాలన్నారు. కనీస సౌకర్యాలైన రోడ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, తాగునీరు, కరెంటు లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం సచివాలయంలో శనివారం జరిగింది. మంత్రి సురేఖ మాట్లాడుతూ.. గిరిజనుల బతుకులు మారాలంటే ఆయా ప్రాంతాల అభివృద్ధి జరగాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను విస్తృతంగా చర్చించి, ఒక పరిష్కార మార్గాన్ని చూపించాలని అటవీ అధికారులను ఆదేశించారు..

గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని అడ్డుకోండి: తెలంగాణ

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును అడ్డుకోవాలని తెలంగాణ కోరింది. ఈ మేరకు గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ), కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌లకు తెలంగాణ ఈఎన్‌సీ (జనరల్) జీ. అనిల్ కుమార్ లేఖ రాశారు. గోదావరి-బనకచర్ల అనుసంధానంపై వివరాలు ఇవ్వాలని కోరితే... ఈ ప్రాజెక్టు ప్రతిపాదనల దశలోనే ఉందని, దీనికి సాధ్యాసాధ్యాల నివేదిక కూడా తయారు చేయలేదని, ఆ నివేదిక వచ్చాక, సీడబ్ల్యూసీ క్లియరెన్స్ తీసుకున్నాక.. డీపీఆర్‌ను సిద్ధం చేస్తామని, కానీ ఇప్పుడే ప్రాజెక్టుపై సమాచారం పంచుకోవడం సాధ్యం కాదని గత నెల (ఏప్రిల్) 7న జరిగిన గోదావరి బోర్డు సమావేశంలో ఏపీ ఈఎన్‌సీ చెప్పారని గుర్తు చేశారు. అయితే, ఈ ప్రాజెక్టుపై ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించి, ముందుకెళ్లాలని ఏపీ నిర్ణయించుకున్నట్లు సమాచారం ఉందని తెలంగాణ పేర్కొంది. తక్షణమే గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో ముందుకెళ్లకుండా అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఇక, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వరాదని సీడబ్ల్యూసీకి కూడా విజ్ఞప్తి చేశారు.

పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల వద్దు

- గోదావరి బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించడానికి వీలుగా ఏపీ ప్రతిపాదించిన ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)ని తెలంగాణ కోరింది. తెలంగాణలో ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నా నీటి లభ్యత లేదని ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నదని, ఈ ఎత్తిపోతలతో గోదావరి డెల్టా సిస్టమ్ (జీడీఎస్) అవసరాలపై కూడా ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ మేరకు పీపీఏ, గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్‌లకు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) జీ.అనిల్ కుమార్ శనివారం లేఖ రాశారు.

పల్లెవెలుగు,ఎక్స్‌ప్రెస్‌లకు ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు: ఆర్టీసీ

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో కండక్టర్లను నియమించేందుకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అవసరమైన సంఖ్యలో కండక్టర్లను నియమించుకోవాలని రీజనల్ మేనేజర్లను ఆదేశిస్తూ బస్‌భవన్ నుంచి ఉన్నతాధికారులు సర్క్యులర్ జారీ చేశారు. మ్యాన్‌పవర్ ఏజెన్సీల ద్వారా చేపట్టే కండక్టర్ పోస్టులకు నెలవారీ జీతం రూ.18 వేలుగా నిర్ణయించారు. కండక్టర్‌గా విధుల్లో చేరే వారికి బీమాతో సహా అన్ని సదుపాయాలను ఏజెన్సీలే సమకూర్చాల్సి ఉంటుంది. కాగా, ఆర్టీసీలో 3,120 పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎప్పటి నుంచో చెబుతున్నారు. నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఎస్సీ వర్గీకరణ, ఇతర అంశాల పేరుతో ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయకుండా ఔట్ సోర్సింగ్‌లో నియామకాలు చేపట్టడాన్ని ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు ఎంపికైన గురుకుల విద్యార్థులను సత్కరించిన పొన్నం

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లోని అడ్వెంచర్ క్యాంప్ శిక్షణకు ఎంపికైన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఘనంగా సన్మానించారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ సెలక్షన్స్ కోసం గురుకుల పాఠశాలల నుంచి వంద మంది బాలికలు, మరో వందమంది బాలురు ఎంపిక చేసి రెండు రోజుల పాటు భువనగిరిలోని రాక్ క్లైమింగ్‌లో శిక్షణ ఇప్పించారు. ఇందులో ప్రతిభ ప్రదర్శించిన 20 మంది విద్యార్థులను అడ్వెంచర్ క్యాంప్‌కు ఎంపిక చేశారు. వీరు మే 25 నుంచి జూన్ 10 వరకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద ట్రెక్కింగ్ చేయనున్నారు. ఆదివారం ఉదయం విద్యార్థులు బయలుదేరి వెళ్లనున్నారు.

గాంధీ ఆస్పత్రిలో 60 పడకలతో కొవిడ్ సెంటర్

అడ్డగుట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కలకలం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గాంధీ ఆస్పత్రిలో 60 పడకలతో కొవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మూడు వార్డులను ఆస్పత్రిలో వివిధ చోట్ల ఏర్పాటు చేయగా ఓ వార్డును అత్యవసర విభాగంలో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను పర్యవేక్షించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి సారథ్యంలో కమిటీని ప్రకటించారు. ప్రస్తుతం ఎలాంటి కొవిడ్ కేసులు రాకపోయినప్పటికీ ముందుజాగ్రత్తలో భాగంగానే ఈ చర్యలు చేపట్టామని సూపరింటెండెంట్ తెలిపారు. కొవిడ్ నేపథ్యంలో 24గంటలపాటు డాక్టర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు.

నిషేధిత భూములకూ ప్రత్యేక పోర్టల్

- ఎక్కడ రిజిస్ట్రేషన్ చేసినా నిమిషాల్లో సమాచారం
- ఫిర్యాదులొస్తే.. అధికారులపై చర్యలు
- సమీక్షలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలోని భూములు రిజిస్ట్రేషన్ కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. భూభారతి తరహాలో ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు చేశామని, నిషేధిత భూముల వివరాలను అందులో పొందుపరుస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా నిషేధిత జాబితాలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లో హైదరాబాద్‌లోని రిజిస్ట్రేషన్ శాఖ ప్రధాన కార్యాలయంలో తెలిసిపోయేలా ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత భూములు, రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్, గ్రామ పాలనాధికారుల పరీక్ష తదితర అంశాలపై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ పాలనాధికారుల ఎంపిక కోసం ఆదివారం నిర్వహించనున్న పరీక్షకు 5వేల మంది హాజరుకానుండగా, 33జిల్లా కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. వీలైనంత త్వరగా వీరి సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్‌బుకింగ్ అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు స్లాట్‌బుకింగ్ ద్వారా 36వేల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగే పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, ఇబ్రహీంపట్నం, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వికసిత్ భారత్ బాటలో..

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసగించారు. తొలుత.. పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రధాని మోదీ 'ఆపరేషన్ సిందూర్'కు సంకల్పించడం, దాన్ని భారత సైన్యం అమలు చేయడంపై అభినందనలు తెలిపారు. 1971లో ఇందిరా గాంధీ నాయకత్వంలో పాకిస్థాన్‌ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన చరిత్రను గుర్తుచేశారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లోని నాలుగు కీలకాంశాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రా అభివృద్ధి, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు తెలంగాణ రైజింగ్ విజన్‌లో ప్రాధాన్యతనిస్తాం. వికసిత్ భారత్ సాధన మనందరి ఆశయం. నేషన్ ఫస్ట్-పీపుల్ ఫస్ట్ అన్న ప్రాధాన్యతతో ముందుకు వెళ్తున్నాం" అని వ్యాఖ్యానించారు.

కులగణనపై..

దేశవ్యాప్త కులగణనకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం రేవంత్.. ఈ విషయంలో తెలంగాణ అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. "తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణనతో.. బీసీలకు విద్య, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు, ఎస్సీల ఉప వర్గీకరణ వంటి చరిత్రాత్మక నిర్ణయాలను మా ప్రజా ప్రభుత్వం తీసుకుంది. ఏకకాలంలో ఈ రెండు నిర్ణయాలు తీసుకోవడం గర్వకారణం. తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే సంక్షేమ-సామాజిక న్యాయ విధానం, గ్రీన్ ఎనర్జీ విధానం, ఇన్‌ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, పర్యాటక విధానాలను అమలు చేస్తున్నాం. అభివృద్ధిలో, సంక్షేమంలో ఆయా వర్గాలకు న్యాయమైన వాటా ఇవ్వాలన్నది మా సంకల్పం. అందుకే, తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన చేపట్టాం" అని వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర ఉండేలా విధానాలను రూపొందించామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం,


నీతిఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు, వారితోనే పాఠశాలల నిర్వహణ, శిల్పారామంలో వంద స్టాళ్లతో మహిళా బజార్ ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలను సృష్టించామని చెప్పారు. "నిరుద్యోగ సమస్యకు నైపుణ్యాల కొరతే కారణమని గుర్తించి, యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించి శిక్షణ అందజేస్తున్నాం" అని పేర్కొన్నారు. తెలంగాణను మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటికి నియంత్రించడంలో 139 దేశాల్లో తెలంగాణ నెంబర్‌గా నిలిచిందని గుర్తుచేశారు. జూన్ 2 నుంచి రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారభిస్తున్నామని, తద్వారా యువతకు స్వయం ఉపాధికి రూ.5 లక్షలు అందిస్తామన్నారు.

ధాన్యం ఉత్పత్తిలో ఆదర్శం

తెలంగాణలో 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా సాయం చేస్తున్నామన్నారు. మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 చెల్లించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నామన్నారు. గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. రైతుల కోసం చేసే వ్యయాన్ని సంక్షేమ కోణంలో కాకుండా.. ఆహార సంపద సృష్టికి పెడుతున్న పెట్టుబడిగా చూడాలని పిలుపునిచ్చారు. ఇండస్ట్రీ, ఇన్‌ఫ్రాలో అంతర్జాతీయ నగరాల సరసన తెలంగాణను నిలబెట్టాలనే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్- 2047 విజన్‌తో ముందుకెళ్లాలని నిర్ణయించామని సీఎం రేవంత్ తెలిపారు. తొలి అడుగుగా, ఏడాదిన్నరలో అమెరికా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, స్విట్జర్ లాండ్‌లో పర్యటించి, రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని గుర్తుచేశారు. తెలంగాణను మూడు జోన్లుగా విభజించి.. మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణగా విభజించి, వృద్ధిని సాధిస్తామని పేర్కొన్నారు. మెట్రో రైల్ రెండో దశ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మ్యానుఫ్యాక్చరింగ్ హబ్, అగ్రిబేస్డ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని వివరించారు. సబర్మతీ రివర్ ఫ్రంట్, గంగా పునరుద్ధరణ ప్రాజెక్టు మాదిరిగా తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందని తెలిపారు. మెట్రో రెండో దశ, రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టులు ప్రస్తుతం డీపీఆర్ దశలో ఉన్నాయని వివరించారు. గుడ్ గవర్నెన్స్‌తో అత్యున్నత ప్రమాణాలతో పౌర సేవలను అందిస్తామని, ఇందులో భాగంగా 'బిల్డ్ నౌ' యాప్ ద్వారా నిర్మాణ రంగానికి వేగం పెంచామన్నారు. హైదరాబాద్‌ను డేటా సెంటర్ హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

కొవిడ్, డెంగీ పేరిట ఆందోళనకు గురిచేయొద్దు

- రోగులను దోచుకునే ప్రయత్నం చేసే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు
- దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): కొవిడ్, డెంగీ వ్యాధుల పేరిట రోగులను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నం చేసే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కొవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు మంత్రి సూచించారు. శనివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భారత్‌లో పరిస్థితి సాధారణంగానే ఉందని, జేఎన్.1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యాయని, ప్రస్తుతం కొవిడ్‌పై ఆందోళనకర పరిస్థితులేమీ లేవని అధికారులు వివరించారు. రాష్ట్రంలో అక్కడక్కడ కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని, వారికి చికిత్స అందించడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. జలుబు, దగ్గులాగే కొవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని, ప్రజలు పరిశుభ్రతపై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంటే దోమలు పెరిగి, వ్యాధులు వ్యాపించే ప్రమాదముంటుందని, ఈ విషయంపై ప్రజలకు అర్థమయ్యేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు.


సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మోడల్‌కాలనీ పనులను మంత్రి ఉత్తమ్‌కి వివరిస్తున్న అధికారులు

మేడిగడ్డ గుండె పగిలింది!

- విచారణ కమిషన్‌పైనే విమర్శలంటూ మండిపాటు
- ఎవరు బాంబులేస్తే కాళేశ్వరం కూలిందో చెప్పాలి: మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): తుమ్మడిహెట్టిని కాదని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డ బ్యారేజీ మెయిన్ గుండె అని బీఆర్ఎస్ నేతలు చెప్పారని, కానీ ఇప్పుడు మేడిగడ్డ గుండె పగిలిందని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు.. ఆ పార్టీ అధికారంలో ఉండగానే కూలిందని ఎద్దేవా చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల కేంద్రంలోని తన ఇంట్లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవినీతి, అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాక ఘోష్ కమిషన్ నోటీసులివ్వడాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుబట్టడం సిగ్గు చేటని పేర్కొన్నారు. విచారణ జరుపుతున్న కమిషన్ చైర్‌పర్సన్- సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పైనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు నోటీసులిస్తే.. కాళేశ్వరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ నేతలే బాంబులు పెట్టారని మాట్లాడటం శోచనీయం అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. ఎవరు బాంబులు పెడితే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందో బీఆర్ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టు పునాదుల్లోనే తప్పు జరిగిందని పేర్కొన్నారు. అంబేడ్కర్ పేరుతో గత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే తమ పార్టీకి పేరొస్తుందన్న రాజకీయ దురుద్దేశంతోనే మేడిగడ్డకు తరలించారని ఉత్తమ్ ఆరోపించారు. కాళేశ్వరం పథకానికి రూ. లక్ష కోట్లకు బదులు తుమ్మడిహెట్టి వద్ద రూ.38 వేల కోట్లతో ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. కానీ, కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి, రాజకీయ దురుద్దేశంతోనే డిజైన్లు మార్చేసి, అంచనాలు నాలుగింతలు పెంచేసి అవినీతికి పాల్పడటంతోపాటు తెలంగాణ సమాజాన్ని మోసగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటిపారుదలశాఖ ఆగం కాగా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని పేర్కొన్నారు.

మెట్రో రెండో దశకు అనుమతులివ్వండి

గత ప్రభుత్వం విస్తరణ చేపట్టలేదు.. ఆర్ఆర్ఆర్‌కు ఆర్థిక, క్యాబినెట్ ఆమోదం తెలపండి

- బందరు పోర్టు-హైదరాబాద్ డ్రైపోర్టు.. గ్రీన్ ఫీల్డ్ హైవేను మంజూరు చేయండి
- ఐఎస్ఎమ్ ప్రాజెక్టును ఆమోదించండి
- రక్షణ రంగ ప్రాజెక్టులకు మద్దతివ్వండి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మే 24 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో దశకు అనుమతులివ్వాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం విస్తరణ చేపట్టలేదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. శనివారం ఢిల్లీలో ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసి పలు అంశాలపై వినతి పత్రాలను అందజేశారు. హైదరాబాద్‌లో మెట్రో మొదటి దశలో భాగంగా రూ.22 వేల కోట్లతో 69 కిలోమీటర్ల మేర నిర్మించారని వివరించారు. రెండోదశ విస్తరణకు ప్రతిపాదనలను ఇప్పటికే సమర్పించామని గుర్తుచేశారు. రెండో దశలో భాగంగా.. రూ.24,269 కోట్లతో 76.4 కిలోమీటర్లలో ఐదు కారిడార్లను నిర్మించనున్నట్టు తెలిపారు. ఇది కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో చేపట్టాల్సిన ప్రాజెక్టని చెప్పారు. కేంద్రం వాటా కింద 18%(రూ.4,230 కోట్లు), రాష్ట్ర వాటాగా 30%(రూ. 7,313 కోట్లు), మిగిలిన 48%(రూ. 11,693 కోట్లు) రుణంగా తీసుకోనున్నట్టు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశకు సంబంధించి గతేడాది నవంబరు 4న కేంద్ర గృహ, పట్టణ శాఖకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. వాటిపై కేంద్రం కొన్ని ప్రశ్నలను లేవనెత్తగా.. సమాధానాలిచ్చామన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో..

హైదరాబాద్ చుట్టూ రెండు జాతీయ రహదారులతో రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్)ను ప్రతిపాదించామని సీఎం రేవంత్ గుర్తుచేశారు. ఉత్తర భాగం(సంగారెడ్డి- నర్సాపూర్- తూప్రాన్-గజ్వేల్-భువనగిరి-చౌటుప్పల్), దక్షిణ భాగం(చౌటుప్పల్-అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి) మీదుగా ఆర్ఆర్ఆర్ నిర్మించనున్నట్లు వివరించారు. ఉత్తర భాగానికి సంబంధించి 2022లో భూసేకరణ ప్రారంభమైందని..


ఢిల్లీలో కేంద్రమంత్రి కుమారస్వామితో సీఎం రేవంత్, సీఎస్, ఎంపీ చామల

ఇందులో 50% వ్యయాన్ని రాష్ట్రమే భరిస్తుందని చెప్పారు. 90% భూముల ప్రతిపాదనలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)కు పంపగా, టెండర్లను పిలిచిందని, దీనికి సంబంధించి ఆర్థిక, క్యాబినెట్ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర భాగంతోపాటే దక్షిణ భాగాన్ని సైతం ఏకకాలంలో చేపట్టాలని భావిస్తున్నామని తెలిపారు. ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ వృద్ధితో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రస్తుతమున్న ఓఆర్ఆర్ రాబోయే ఐదేళ్లలో సరిపోదన్నారు. ఉత్తర భాగం తర్వాత దక్షిణ భాగం నిర్మాణం చేపడితే భూసేకరణ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగే ప్రమాదముందని, అందుకే రెండు భాగాలను కలిపి ఒకేసారి పూర్తి చేస్తేనే ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించి భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50% భరించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు.

డ్రైపోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే

రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా 370 కిలోమీటర్ల పరిధిలో రైల్వే లైన్‌ను ప్రతిపాదించామని ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు. బందరు పోర్టు నుంచి హైదరాబాద్ డ్రైపోర్ట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో 35% ఔషధాలను తెలంగాణ ఉత్పత్తి చేస్తోందని గుర్తుచేశారు. "డ్రైపోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో సరుకు రవాణా ఖర్చును తగ్గించవచ్చు. తయారీ రంగానికి ప్రోత్సాహకంగా ఉంటుంది. కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది" అని వివరించారు. సెమీ కండక్టర్ రంగానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎమ్)కు తెలంగాణ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఏఎండీ, క్వాల్ కామ్, ఎన్విడీఐఏ వంటి ఆర్అండ్ డీ కేంద్రాలున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో పరిశ్రమలకు అనుకూలమైన స్థలాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ఐఎస్ఎమ్ ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కలిగించి ఉద్యోగాలు సృష్టించవచ్చని.. 2030 నాటికి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో 500 బిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి ఇది తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

రక్షణ రంగ ప్రాజెక్టులపై..

హైదరాబాద్‌లో ప్రభుత్వ ప్రభుత్వ-ప్రైవేటు సంయుక్త భాగస్వామ్యం(పీపీపీ)లో ఎంఎస్ఎంఈల్లో ఉన్న రక్షణ రంగ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ కోరారు. హైదరాబాద్‌లో డీఆర్డీవో, డిఫెన్స్ పీఎస్‌యూలు ఉన్నత స్థాయిలో పని చేస్తున్నాయని గుర్తుచేశారు. హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌ను మంజూరు చేయాలన్నారు. యూపీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రోత్సాహం ఉందని, తెలంగాణకు లేదని రేవంత్ తెలిపారు. ఆయా రాష్ట్రాలతో సమానంగా తెలంగాణకు కేంద్రం మద్దతు ఇవ్వాలన్నారు. రక్షణ రంగ పరికరాల తయారీలో ముందున్న హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎక్స్‌పోను నిర్వహించాలని కోరారు.

అంబేడ్కర్ అంతర్జాతీయ పరిశోధన కేంద్రం

- హైదరాబాద్‌లో 2 ఎకరాల్లో స్థాపన

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "అంబేడ్కర్ అంతర్జాతీయ పరిశోధన కేంద్రం" స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో దీన్ని నిర్మించనున్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ ఘంటా చక్రపాణి రూపొందించి సమర్పించిన ఈ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సంస్థ ఏర్పాటుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధులు ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి రూ.100 కోట్లు మంజూరు చేసింది. అంబేడ్కర్ స్ఫూర్తిని ఆధారంగా చేసుకొని ఈ కేంద్రం సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ప్రపంచస్థాయిలో చర్చలు, పరిశోధనలకు వేదికగా నిలువనుందని వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి శనివారం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రూ.100 కోట్ల నిధులు ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి మంజూరు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రం దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనార్టీలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాల సమస్యలపై లోతైన అధ్యయనానికి, అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనకు కేంద్రంగా పని చేయనుంది. అంబేడ్కర్ అంతర్జాతీయ 'ఫెలోషిప్ ప్రోగ్రామ్' పేరుతో ప్రతి సంవత్సరం తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఆరుగురు విద్యార్థులకు పూర్తిస్థాయి ఉపకార వేతనం ఇస్తారు. వీరు డా.అంబేడ్కర్ విద్యనభ్యసించిన 'కొలంబియా' విశ్వవిద్యాలయం, 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశాన్ని కల్పించనుంది. జూబ్లీహిల్స్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ సమీపంలోని 2 ఎకరాల భూమిలో ఈ కేంద్రాన్ని స్థాపించనున్నారు. ఇందులో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

కొణతం దిలీప్‌పై లుక్ అవుట్ సర్క్యులర్ తాత్కాలిక సస్పెన్షన్

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): దాదాపు పది క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్‌కు వ్యతిరేకంగా పోలీసులు జారీచేసిన లుక్‌అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ)ను హైకోర్టు తాత్కాలికంగా జూన్ 11 వరకు సస్పెండ్ చేసింది. ఆ రోజు నాటికి అమెరికా నుంచి హైదరాబాద్‌కు కచ్చితంగా తిరిగి రావాలని స్పష్టం చేసింది. తండ్రి 15వ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా పుస్తకావిష్కరణ కోసం అమెరికాలోని వర్జీనియా వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు జారీచేసిన ఎల్‌వోసీని కొట్టేయాలని దిలీప్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ జే శ్రీనివాసరావుల డివిజన్ బెంచ్ షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది.

కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి కలెక్టర్‌కు నోటీసులు..

ఓ కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని హైకోర్టు సుమోటోగా ఇంప్లీడ్ చేసింది. ఆయన నల్లగొండ కలెక్టర్‌గా ఉన్నప్పుడు ముగ్గురు పార్ట్‌టైం ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని 2020లో హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అవి అమలు కాని నేపథ్యంలో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. దాంతో కలెక్టర్ నారాయణరెడ్డిని సుమోటోగా ఇంప్లీడ్ చేసిన హైకోర్టు.. నాలుగువారాల్లో తమ ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని నోటీసులు జారీచేసింది.

అంతర్జాతీయ స్థాయికి 'మై నేషన్' బ్రాండ్

తెలంగాణలోని ఆయా జైళ్లల్లో 'మై నేషన్' బ్రాండ్ పేరుతో ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తోంది. ప్రపంచ అందాల పోటీల సందర్భంగా శిల్పారామంలో జైలు ఉత్పత్తుల విక్రయ శాలను ఏర్పాటు చేశారు. అందాల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సుందరీమణులు ఆ స్టాల్‌ను సందర్శించి ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తుల్ని పరిశీలించారు.మహిళా ఖైదీలు అల్లికలు, కట్లతో ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలపట్లవారు ఆకర్షితులయ్యారు.

అన్నారం బ్యారేజీ పునరుద్ధరణకు డిజైన్ కన్సల్టెంట్‌ను నియమించాలి

- ప్రభుత్వానికి నిర్మాణ సంస్థ అఫ్కాన్స్ లేఖ
- మేడిగడ్డ పునరుద్ధరణకు డిజైనర్‌ను నియమించాలని ఎల్ అండ్ టీ లేఖ

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ పునరుద్ధరణ/మరమ్మతులకు డిజైన్ కన్సల్టెంట్‌ను నియమించాలని నిర్మాణ సంస్థ అఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్ ప్రభుత్వానికి లేఖ రాసింది. బ్యారేజీ పునరుద్ధరణకు అవసరమైన సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. నిధుల కొరత తీవ్రం గా ఉందని, ఈ నేపథ్యంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లు రూ.176.46 కోట్లు(ఓ అండ్ ఎం పనులకు సంబంధిం చి రూ.6.42 కోట్లు, ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మధ్యంతర సిఫారసులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ.4.45 కోట్లు కలిపి) విడుదల చేయాలని లేఖ రాసింది. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) మధ్యంతర సిఫారసుల్లో భూ సాంకేతిక పరీక్షలు తప్ప ఇతర అన్ని పనులు చేశామని గుర్తుచేసింది. వరద ఉధృతిని తగ్గించే వ్యవస్థలు లేనందువల్లే బ్యారేజీ దిగువ భాగంలో రక్షణ వ్యవస్థలు చెల్లాచెదురు అయ్యాయని తెలిపింది. డిజైన్ లోపాల వల్లే బ్యారేజీ దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు దెబ్బతిన్నాయని నివేదించింది. డ్యామ్ భద్రత సమీక్ష కమిటీ సభ్యులతో పాటు నీటిపారుదల శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) అధికారుల బృందం అన్నారం బ్యారేజీలో స్టిల్లింగ్ బేసిన్‌తో పాటు కటాఫను పెంచాలని సూచించారని గుర్తుచే సింది. ఎన్‌డీఎస్‌ఏ పూర్తి నివేదిక అమలు కోసం నిపుణులైన సంస్థ లేదా డిజైన్ కన్సల్టెంట్‌ను నియమించాలని, ఎన్‌డీఎస్‌ఏ సూచనల ప్రకారం బ్యారేజీ పునరుద్ధరణకు డిజైన్ తయారుచేయాలని జాయింట్ వెంచర్ పేర్కొంది. మరోవైపు మేడిగడ్డ బ్యారేజీపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక అమలు చేయడానికి 'రిహాబిలిటేషన్ డిజైనర్'ను నియమించాలని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కోరింది. ఈమేరకు నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక ప్రకారం మేడిగడ్డలోని బ్లాక్-1-8ల దాకా భూభౌతిక పరీక్షలు కేంద్ర సంస్థలతో చేయించామని తెలిపింది. 2023 నవంబరు నుంచి 2024 దాకా కాఫర్ డ్యామ్‌తో పాటు రోడ్డును నిర్మించి, 2024 జూన్‌లో తొలగించామని, బ్లాక్-7 రక్షణ కోసం పనులు చేశామని పేర్కొంది. వానాకాలానికి ముందే 'రిహాబిలిటేషన్ డిజైనర్'ను నియమించాలని కోరింది. మధ్యంతర నివేదికలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.16.54 కోట్లను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

దేశంలో జిల్లాకో ఫోరెన్సిక్ ల్యాబ్

- ఈ ఆర్థిక ఏడాదిలో నెలకొల్పేందుకు కృషి
- ఫోరెన్సిక్ నెట్‌వర్క్ పటిష్ఠానికి చర్యలు: సంజయ్



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి జిల్లాలో ఫోరెన్సిక్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. దీంతో పాటు అధునాతన పరికరాలతో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లను విస్తరిస్తామని చెప్పారు. న్యాయ ప్రక్రియలో 'ఫోరెన్సిక్-ఫస్ట్ అప్రోచ్'ను భాగం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. 'నూతన నేర చట్టాల నేపథ్యంలో ఫోరెన్సిక్ సైన్స్ సేవల బలోపేతం' అంశంపై చండీగఢ్‌లోని ఫోరెన్సిక్ సెంట్రల్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయంలో రెండు రోజులపాటు ఆలిండియా సీఎఫ్ఎస్ఎల్, ఎస్ఎఫ్ఎల్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. "కొత్త క్రిమినల్ చట్టాల అమలులో భాగంగా న్యాయ ప్రక్రియను మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చాలంటే ఫోరెన్సిక్ సేవలను ఇంకా బలోపేతం చేయడంతోపాటు ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. నేర దర్యాప్తులో ఫోరెన్సిక్ అధికారులు శాస్త్రీయ ఆధారాలను సేకరించడాన్ని కొత్త చట్టాలు తప్పనిసరి చేశాయి. అయితే, చాలా రాష్ట్రాల్లో ఇప్పటికీ సరైన ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాలు లేవు. శిక్షణ పొందిన శాస్త్రవేత్తల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పెండింగ్ కేసులు న్యాయ ప్రక్రియను బలహీనపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి రాష్ట్రంలో ఆధునిక పరికరాలతో కూడిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లను స్థాపించటం, నేరస్థుల వద్దే ఆధారాలను సేకరించేందుకు మొబైల్ యూనిట్ల ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నాం. ఫోరెన్సిక్‌లో ఏఐ సాంకేతికతను ప్రవేశపెడుతున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ప్రతి జిల్లాలో ఒక ప్రభావవంతమైన ఫోరెన్సిక్ యూనిట్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక, శిక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సంజయ్ వివరించారు. కాగా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత పెంచింది. ఇద్దరు నేతలకు టయోటా ల్యాండ్ క్రూజర్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కేటాయించింది.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు ప్రభుత్వోద్యోగులు

- పట్టా మార్పిడికి రూ.7,000 లంచంతో అరెస్టయిన కడెం సర్వేయర్
- డీజే వాహనం అప్పగింత కోసం పట్టుబడ్డ జగద్గిరిగుట్ట ఎస్సై, మధ్యవర్తి

కడెం/ జీడిమెట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ప్రభుత్వోద్యోగులుగా పనిచేస్తూ.. కాసుల కోసం కక్కుర్తి పడిన ఒక ఉద్యోగి, మరొక ఎస్సై, మధ్యవర్తిని ఏసీబీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. నిర్మల్ జిల్లా కడెం మండలం గంగాపూర్ గ్రామ రైతు గుగ్లావత్ ప్రభాకర్.. మరణించిన తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరుతో పట్టా మార్పిడి చేయాలని మండల సర్వేయర్ పవర్ ఓమాజీని కోరాడు. అందుకు రూ.20 వేలు లంచం అడిగితే, వారం క్రితం ప్రభాకర్ రూ.12 వేలు చెల్లించి.. భూమి పట్టా మార్పిడి తర్వాత మిగతాది చెల్లిస్తానని చెప్పాడు. కానీ మిగతా డబ్బు ఇస్తేనే పని చేస్తానని ప్రభాకర్‌ను ఓమాజీ వేధించాడు. దీంతో విసుగెత్తిన ప్రభాకర్.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రభాకర్ నుంచి రూ.7,000 నగదు తీసుకుంటున్న సర్వేయర్ ఓమాజీని అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట-పాపిరెడ్డి నగర్ ప్రాంతంలో డీజే నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న కిరణ్.. ఒక వేడుకలో ఎక్కువ శబ్దంతో డీజే పెట్టినందుకు పర్యావరణ చట్టం కింద జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్ కేసు నమోదు చేసి, డీజే వాహనాన్ని జప్తు చేశారు. తనకు జీవనాధారమైన డీజే వాహనం, సౌండ్ బాక్సులు ఇవ్వాలని అప్పటి నుంచి పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్న కిరణ్‌ను ఎస్సై శంకర్.. రూ.15 వేల లంచం అడిగారు. తనను మానసికంగా వేధించడంతోపాటు లంచం అడిగినందుకు ఏసీబీ అధికారులకు కిరణ్ ఫిర్యాదు చేశాడు. వారి సూచన మేరకు ఎస్సై శంకర్ మధ్యవర్తి నాగేందర్‌కు కిరణ్ రూ.15 వేల నగదు అందజేశాడు. నాగేందర్ వెంటనే ఎస్సై శంకర్‌కు ఆ సొమ్ము అందించగానే, ఏసీబీ రంగారెడ్డి జిల్లా యూనిట్-1 డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అక్కడే మాటు వేసిన ముగ్గురు ఎస్సైలు, ఇతర సిబ్బంది.. శంకర్, నాగేందర్‌లను అరెస్ట్ చేశారు. డీఐ నరేందర్ రెడ్డి వాంగ్మూలం నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.